
'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 సంచిక: 99

SUNDAY Special | ఆదివారం 24-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చొరబాటుయత్నం భగ్నం ఉగ్రవాది హతం

జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి జరిగిన చొరబాటు యత్నాన్ని ఆర్మీ తిప్పికొట్టింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు.

- వివరాలు 6లో



ఆసీస్ పోరాడినా.. భారత్ చేతుల్లోనే..

భారత మహిళలతో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసింది. ప్రస్తుతం 46 పరుగులు ముందంజలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు భారత్ ఆలౌటైంది.

- వివరాలు 12లో

ఫ్యాక్ట్‌చెక్

అసత్యాలే అసూయపడేలా..

- పింఛన్లపైనా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- ఏటా రూ.3,500 కోట్ల అవినీతంటూ విషపు రాతలు
- పూర్తి ఆన్‌లైన్ విధానంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకున్నా 'ఈనాడు' అడ్డగోలు ఆరోపణలు
- బయోమెట్రిక్ ప్రక్రియ కూడా ఆధార్‌తో అనుసంధానం
- ఈ వివరాలు సరిపోలిన తర్వాతే పింఛన్ అందజేత
- ఈ సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

14లో

పిల్లలకిచ్చే కానుక పైనా 'కుటిల' రాతలు

- 'జగనన్న విద్యా కానుక'పై అవాస్తవాలు, వక్రీకరణలతో 'ఈనాడు' కథనం
- ప్రభుత్వ బడుల రూపురేఖలు, బోధనలో సమూల మార్పులు
- పేద పిల్లల చదువులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్
- వారు తలెత్తుకొని స్కూలుకెళ్లేలా 'జగనన్న విద్యా కానుక'

14లో

పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి

వైఎస్సార్ జిల్లాలో 'సెంచురీ' ప్యానల్స్ పరిశ్రమ ఉత్పత్తితో పాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం

- బద్వేలు వద్ద రూ.956 కోట్లతో ఉడ్ ప్యానల్స్ పరిశ్రమ ఏర్పాటు
- 'కడప రిమ్స్' రాయలసీమకే తలమానికం
- రిమ్స్ ప్రాంగణంలో ఆధునిక వసతులతో డా.వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, వైఎస్సార్ క్యాన్సర్ కేర్ సెంటర్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ భవనాల ప్రారంభోత్సవం
- ఆధునీకరించిన వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్‌కూ సీఎం జగన్ శ్రీకారం
- దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ స్కూటర్ల పంపిణీ
- విపత్కర వేళల్లో ఉపయోగించే రెస్క్యూ పరికరాలూ ప్రారంభం
- స్మార్ట్ సిటీగా కడపకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు: సీఎం జగన్
- ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం


వైఎస్సార్ జిల్లా బద్వేలు వద్ద సెంచురీ ప్యానల్స్ ఉత్పత్తిని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం వైఎస్సార్ జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బద్వేలు నియోజకవర్గం గోపవరం మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కులో రూ.956 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన సెంచురీ ప్యానల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఉత్పత్తిని ఆయన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే, కడప రిమ్స్ ప్రాంగణంలో అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన డా.వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, డా. వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, డా.వైఎస్సార్ క్యాన్సర్ కేర్ సెంటర్లతో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ భవనాలకు ముఖ్యమంత్రి జగన్ వేర్వేరుగా

మిగతా 10వ పేజీలో ▶

తిరుమలలో స్వర్ణ రథంపై ఊరేగుతున్న మలయప్పస్వామిని దర్శించుకుంటున్న అశేష భక్తజనం



విశ్వవిరాట్ వైభవం

తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

- ఉత్తరద్వారం గుండా స్వామి వారిని దర్శించి పులకించి తరించిన భక్త కోటి
- కనులపండువగా స్వర్ణ రథోత్సవం

- వివరాలు 2లో

చిటికెలో 'మ్యుటేషన్'

- రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి ఆటో మ్యుటేషన్
- ఆస్తి రిజిస్ట్రేషన్ కాగానే మారిపోతున్న యాజమాన్య హక్కు
- రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల సాఫ్ట్‌వేర్స్ అనుసంధానం
- రెవెన్యూ శాఖలో సీఎం జగన్ తెచ్చిన సంస్కరణల ఫలితం
- గతంలో కార్యాలయాల వద్ద రోజుల తరబడి పడిగాపులు


ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ విద్యా ధరణి

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం అరిశేపల్లి గ్రామానికి చెందిన నంద్యాల తేజస్ ఒక ఎకరం పొలాన్ని కొనుగోలు చేశారు. బందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో ఆయన పేరు నమోదైంది. ఒకే రోజు రిజిస్ట్రేషన్‌తో పాటు ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ కూడా జరిగిపోయింది.

సరళంగా ప్రక్రియ

ఆస్తి ఒకరి పేరు మీద నుంచి మరొకరి పేరిట మారాలంటే కొద్ది రోజుల క్రితం వరకు పెద్ద ప్రహసనమే. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరిగినా మ్యుటేషన్ జరగక

మిగతా 2వ పేజీలో ▶

ప్రతిభ గల కళాకారులకు అవార్డులు



- చంద్రబాబు హయాంలో అనర్హులకే అవార్డులు దక్కేవి
- అర్హత సాధించిన కళాకారులకే అవార్డులివ్వాలని సీఎం జగన్ చెప్పారు
- రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని
- గుంటూరులో నంది నాటకోత్సవాలు ప్రారంభం

5లో

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ సమావేశం

- సీఎం రమేష్ సొంత విమానంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన లోకేశ్
- చంద్రబాబు, లోకేశ్‌తో ప్రశాంత్ సమావేశం
- రాబోయే ఎన్నికల్లో పార్టీ పరిస్థితిపై చర్చ!
- పీకేపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన బాబు

14లో



మెడ్‌టెక్ జోన్ సిగలో మరో కలికితురాయి

- ఉద్యోగులకు వసతి కోసం ప్రత్యేకంగా ఐవీవై లీగ్ హౌస్
- పూర్తి సౌకర్యాలతో వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌తో నిర్మాణం

- వివరాలు 14లో

2 గర్భసంచులు 2 రోజులు 2 ప్రసవాలు

అమెరికా మహిళ అరుదైన రికార్డు

- తొలి 3 కాన్పులు సాధారణం
- మహిళల్లో ఇలా రెండు గర్భసంచులుండే ఆస్కారం కేవలం 0.3 శాతమే

- వివరాలు 6లో



సమగ్ర ప్రణాళికతో ఎన్నికలు



సమీక్షలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల బృందం సభ్యులు

- ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా అప్రమత్తత, నిష్పాక్షికతతో ఎన్నికలు జరగాలి
- ఒక్క తప్పు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయండి
- పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- 2024 సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై ముగిసిన సమీక్ష
- స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించాం: ఎన్నికల సంఘం

- వివరాలు 3లో

జనవరి 6న కక్ష్యలోకి ఆదిత్యఎల్1



- అంతరిక్షనౌక ఆదిత్య ఎల్–1 జనవరి 6న తన కక్ష్యలోకి చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అంచనావేశారు. కక్ష్యలోకి చేరగానే దానికి వ్యతిరేక దిశలో ఇంజిన్‌ను మండిస్తామని, దాంతో అది ఆ కక్ష్యలో స్థిరంగా కుదురుకుంటుందని చెప్పారు.

- వివరాలు 6లో

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్–తిరుపతి(07489/07490) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో 30వ తేదీ రాత్రి 8.25కు బయలుదేరి ఉదయం 8.50కి హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్ –తిరుపతి (07449/07450) మరో స్పెషల్ ట్రైన్ ఈ నెల 27వ తేదీ సా. 6.10కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.45కు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 28వ తేదీ సాయంత్రం 5.15కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30కు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–కాకినాడ (07451/07452) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29న రాత్రి 8.30కు బయలుదేరి మరుసటిరోజు ఉ. 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

టీడీపీ అక్రమాలపై చర్యలు తీసుకోండి

ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో అవకతవకలకు పాల్పడుతోంది

మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలు సేకరిస్తోంది



- తెలంగాణలో ఓట్లున్నవారిని రాష్ట్రంలో ఓటర్లుగా చేరుస్తోంది
- ఇందుకోసం టీడీపీ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది
- మేనిఫెస్టో పేరుతో టీడీపీ నేతలు ఇంటింటికీ ప్రమాణపత్రాలు ఇస్తున్నారు
- తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న కోనేరు సురేశ్‌పై చర్యలు తీసుకోండి
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వినతి

- వివరాలు 3లో


సగానికిపైగా ఓట్లు మనకే పడాలి



- సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మరింతగా ప్రజా ఓటరును ఒడిసి పట్టాలని బీజేపీ సీనియర్ నేతలకు ప్రధాని మోదీ సూచించారు. సగానికిపైగా ఓట్లు బీజేపీకి పడాల్సిందేనని.. పోలింగ్‌లో పార్టీ ఓటు షేర కనీసం 10 శాతమైనా పెరగాలని ఆదేశించారు.

- వివరాలు 6లో

కాంగ్రెస్ ఏపీ ఇన్‌చార్జిగా మాణిక్కం ఠాగూర్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్కం ఠాగూర్ నియమితులయ్యారు. ఏపీతోపాటు అండమాన్–నికోబార్ ఇన్‌చార్జిగా కూడా ఆయన వ్యవహరిస్తారు. అలాగే తెలంగాణ ఇన్‌చార్జిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ నియమితులయ్యారు. కేరళ, లక్షద్వీప్ పార్టీ వ్యవహారాలను కూడా ఆమెకే అప్పగించారు. ఇప్పటివరకు తెలంగాణ ఇన్‌చార్జిగా ఉన్న మాణిక్‌రావ్ ఠాక్రేను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయనకు గోవా, డయ్యూ–డామన్, దాద్రా అండ్ నగర్ హవేలీ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పలు రాష్ట్రాల ఇన్‌చార్జిలను మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అలాగే ప్రధాన కార్యదర్శుల్లోనూ మార్పులు చేర్పులు చేపట్టింది. ఈ మేరకు శనివారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఈ ప్రభుత్వమే పెద్ద దిక్కయింది..



రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద గిరిజన కుటుంబం మాది. బతుకుదెరువు కోసం అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని రామానాయక్‌తండా నుంచి తిరుపతికి వెళ్లాం. నా భర్త సర్దార్‌నాయక్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నా భర్తకు అనారోగ్యం చేయడంతో 2012లో సొంత ఊరికి తిరిగి వచ్చేశాం. అప్పటికే మాకు చిన్నపాప ఉంది. దురదృష్టవశాత్తు 2013లో నా భర్త మృతి చెందాడు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఆ సమయంలో అత్తగారింటిలో ఉన్నా... అత్త, మామ వృద్ధాప్యం కారణంగా ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నారు. వారికి భారం కాకూడదని బిడ్డను చదివించేందుకు కూలి పనులకెళ్లాను. కష్టంగా జీవనం సాగిస్తున్న సమయంలో మా అదృష్టం కొద్దీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. నవరత్నాల్లో భాగంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి ఓ భరోసా ఇచ్చింది. నాలుగేళ్లుగా రూ. 15వేలు వంతున నా ఖాతాలో జమవుతోంది. ఇక నిశ్చింతగా పాపను చదివించుకోవచ్చనే ధైర్యం వచ్చింది. అమ్మ ఒడి పుణ్యమాని నా కుమార్తె అంకిత రాయచోటిలోని గురుకుల సంక్షేమ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. అదే లేకుంటే నా బిడ్డ చదువు అర్ధంతరంగా నిలిచిపోయేది. అలాగే నాకు వితంతు పింఛను నాలుగేళ్లుగా వస్తోంది. డ్వాక్రా గ్రూపులో రుణ మాఫీతో లబ్ధిపొందాను. ఇప్పటికి మూడు విడతల్లో రూ.30 వేలు వచ్చింది. జగనన్న కాలనీలో ఇల్లు కూడా మంజూరైంది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రస్తుతం నేను ఓ సంస్థలో ఔట్‌రీచ్ వర్కర్‌గా పనిచేస్తున్నా. సమస్యల్లో ఉన్న మాకు ఈ ప్రభుత్వం మాకు పెద్ద దిక్కయింది.

– బి.సావిత్రి, రామానాయక్ తండా, పెద్దమండ్యం మండలం, మదనపల్లె డివిజన్, అన్నమయ్య జిల్లా

(మాడా చంద్రమోహన్, విలేకరి, మదనపల్లె సిటీ)

సర్కారు సాయంతో సాఫీగా జీవనం



మాది సాధారణ రైతు కుటుంబం. మా స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెద్దూరు. గ్రామంలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. సుమారు 15 ఏళ్ల క్రితం విద్యుత్‌షాక్‌తో కుడికాలు పోయింది. దివ్యాంగుడిని కావడంతో జీవనం కష్టంగా మారింది. పదేళ్లపాటు ఎలా గడిపానో ఆ భగవంతుడికే తెలియాలి. అదృష్టవశాత్తూ ఈ ప్రభుత్వం వచ్చాక నా కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. నాకు దివ్యాంగ పింఛన్ కింద రూ.మూడు వేలు మంజూరైంది. అనంతరం కొద్దినెలల్లో డీఎంహెచ్‌ఓ పింఛన్ రూ.2 వేలు అదనంగా మంజూరుచేశారు. ఇప్పుడు నెలనెలా మొత్తం 5వేల వంతున పింఛన్ అందుతోంది. గతేడాది దివ్యాంగుల కోటాలో మూడుచక్రాల వాహనం(స్కూటీ) అందజేశారు. రైతు భరోసా కింద ఏడాదికి రూ. 13,500లు వంతున నాలుగు విడతలుగా అందుతోంది. నా భార్య తులసి టైలరింగ్ నేర్చుకుని కుట్టుపని ప్రారంభించింది. ఆమెకు వైఎస్సార్ చేదోడు కింద ఇప్పటివరకూ రెండేళ్లకు రూ. 20వేలు అందింది. మా పాప అనంతపురం ఎంపీపీ స్కూలులో 5వ తరగతి, బాబు గుమ్మకోట గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. అమ్మఒడి సొమ్ము కూడా వస్తోంది. మొత్తంమ్మీద ఇప్పుడు జీవనం సాఫీగా సాగుతోంది.

– కమిడి మల్లేశ్వరరావు, పెద్దూరు, అనంతగిరి మండలం

(పెరుమల సుధాకర్, విలేకరి, అనంతగిరి, అల్లూరి సీతారామరాజు జిల్లా)

వృద్ధాప్యంలో సొంతింటి కల నెరవేరింది



మాది పెద్ద కుటుంబం. ఇద్దరు కొడుకులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లతో చిన్న ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడేవాళ్లం. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్ మా స్వగ్రామం. అక్కడ అద్దె ఇల్లు తీసుకుందామంటే మూడు, నాలుగు వేల రూపాయలు భరించడం కష్టంగా ఉండేది. నేను, నా భర్త అల్లస్వామి కూలి పనులకు వెళ్తుండేవాళ్లం. కూలి డబ్బులతో ఇంటి పోషణ పోగా ఏడాదికి సుమారుగా ఓ రూ.50 వేలు మిగిలేది. ఇది కూడా ఆ ఏడాదంతా కూలి పనులు దొరికితేనే. కొడుకులిద్దరికీ పెళ్లిళ్లు చేశాం. కోడళ్లు, పిల్లలతో ఇల్లు కళకళలాడుతున్నా పాత మిద్దిల్లు కావడంతో ఇరుకుగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక మాబోటోళ్లకు ఇల్లు ఇస్తుందని తెలుసుకుని వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేశాం. దరఖాస్తు పెట్టుకున్న ఆరు నెలల్లోనే ఇంటి స్థలంతో పాటు, ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు తోడుగా మేము దాచుకున్న కొంత సొమ్మును కలిపి జగనన్న కాలనీలో ఇంటిని పూర్తి సౌకర్యాలతో నిర్మించుకున్నాం. వ్యవసాయ కూలీలు కావడంతో మా ఇద్దరు కొడుకులు కుటుంబాలతో ఊళ్లో నివాసం ఉంటుండగా జగనన్న కాలనీలో నేను, నా భర్త నివాసం ఉంటున్నాం. సొంత ఇంట్లో ఉండటం చాలా సంతోషంగా ఉంది. వృద్ధాప్యంలో ఉన్న మాకు సొంతిల్లు నిర్మించి ఇచ్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– పుట్టపోశం బాలమ్మ, ఓర్వకల్, కర్నూలు జిల్లా.

(జి.రాజశేఖరనాయుడు, విలేకరి, కర్నూలు)



ఉత్తర ద్వార దర్శనం కోసం తిరుమల ఆలయంలోకి ప్రవేశిస్తున్న భక్తులు



సింహాచలంలో శేషతల్పంపై దర్శనమిచ్చిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి

విశ్వవిరాట్ వైభవం

తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో
వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు పోటెత్తారు. వేకువ జాము నుంచే ఆలయాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం కనులపండువగా జరుగుతోంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. తిరుమల శ్రీవారి దర్శనం కోసం తెల్లవారుజామున 1:45 గంటలకు ఉత్తర ద్వారం తలుపులు తెరుచుకున్నాయి. శ్రీవారి ఆలయంలో 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నారు.


తిరుమల/ద్వారకాతిరుమల/సింహాచలం/అన్నవరం/సాక్షి ప్రతినిధి,విజయనగరం: తిరుమలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముక్కోటి దేవతలు వెంటరాగా మలయప్ప దివి నుంచి భూ వైకుంఠానికి వేంచేయడంతో సప్తగిరులు పులకించాయి. వైకుంఠం నుంచి వచ్చిన వేంకటేశుడి దర్శనానికి ఉత్తర ద్వారం స్వాగతం పలికింది. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన అనంతరం అర్చకులు వైకుంఠ ఏకాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైకుంఠ ద్వారాలను తెరిచి పూజలు చేశారు. ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాత్రమే ఈ ద్వారాలను తెరుస్తారు. కొన్నేళ్ల నుంచి 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పిస్తున్నారు. సామాన్య భక్తులకు 5.15 గంటలకే సర్వదర్శనాన్ని ప్రారంభించారు.

వైభవంగా స్వర్ణరథోత్సవం

శ్రీవారి ఆలయంలో స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు స్వర్ణ రథంపై మాడవీధుల్లో ఊరేగారు. రథోత్సవాన్ని గ్యాలరీల్లోంచి భక్తులు దర్శించి తరించారు. టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా తిరుమలలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి చక్రస్నానాన్ని నిర్వహించనున్నారు.

ప్రధాన ఆలయాలకు భక్తుల తాకిడి..

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయంలో స్వామి వారు ఉత్తరద్వారాన వెండి గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. 40 వేల మందికి పైగా చినవెంకన్నను దర్శించుకున్నారు. సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై ఆలయ ఉత్తర రాజగోపురంలో వైకుంఠ వాసుడిగా శేష తల్పంపై వేంజేసి దర్శనమిచ్చారు. స్వామి వారిని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర దర్శించుకున్నారు. కాకినాడ జిల్లా అన్నవరంలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను 50 వేల మందికిపైగా ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఉత్తర ద్వారం నుంచి తొలి దర్శనం చేసుకున్నారు. విజయనగరం జిల్లాలోని రామతీర్థం సీతారామస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు భారీగా నీలాచలం బోడి కొండ చుట్టూ 12 కి.మీ మేర గిరి ప్రదక్షిణ చేశారు. ఉదయం 5 గంటలకు ఉత్తర సీతారామచంద్రస్వామి ఉత్తర రాజగోపురం నుంచి దర్శనమిచ్చారు. ఆలయం వద్ద 10 వేల మందికి అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.



ద్వారకా తిరుమలలో ఉత్తర ద్వారం వద్ద శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీవారి సేవలో ప్రముఖులు

- స్వామివారిని దర్శించుకున్న పలువురు సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా....



ఆలయం వెలుపల మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ హిమాకొహ్లి, జస్టిస్ సూర్యకాంత్ తదితరులు


తిరుమల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీవారిని ఉత్తరద్వారం గుండా దర్శనం చేసుకున్నారు. వీరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్వీ భట్టీ, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ వి.సుజాత, జస్టిస్ బి.శ్యాంసుందర్, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ రాజశేఖర్ రావు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ ఏవీ శేషసాయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జే.శ్రీనివాసరావు, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ ఎస్.నందా, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.నాగార్జున్, జస్టిస్ గోవిందరాజ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కే జోహారి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ ఉన్నారు. అలాగే, శ్రీవారిని ఆలయ పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కర్ణాటక గవర్నర్ తావర్‌చంద్ గహ్లోత్, ఏపీ డిప్యూటీ సీఎంలు రాజన్న దొర, నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, చెల్లుబోయిన, కారుమూరి, అంబటి, ఉషశ్రీ చరణ్, రోజా, ఆదిమూలపు, సీదిరి, మేరుగు, గుమ్మనూరు జయరాం, విశ్వరూప్, గుడివాడ అమర్నాథ్, ఎంపీ మిథున్‌రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎమ్మెల్యేలు గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల బిజేంద్ర రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, ముదునూరి ప్రసాద్ రాజు, జగ్గిరెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు, డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి దర్శించుకున్నారు.

గోదావరి-కావేరి అనుసంధానం.. ఇచ్చంపల్లి నుంచైతే కష్టమే!

- 85 టీఎంసీల్లోపే ఇచ్చంపల్లి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాడుకోవడానికి వీలు
- ఆ మేరకు 1975లో ఏపీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల మధ్య ఒప్పందం
- ఇదే అంశాన్ని స్పష్టంచేసిన గోదావరి ట్రిబ్యునల్ అవార్డు
- అనుసంధానం తొలిదశలో ఇచ్చంపల్లి నుంచి 141 టీఎంసీల తరలింపునకు ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన
- దీన్ని అమలుచేస్తే మూడు రాష్ట్రాల ఒప్పందం, గోదావరి ట్రిబ్యునల్‌ను ఉల్లంఘించినట్లేనంటున్న న్యాయ నిపుణులు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించినట్లు పోలవరం నుంచైతే అనుసంధానానికి సమస్యలు ఉండవని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఇచ్చంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేయాలని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చేసిన ప్రతిపాదన ఆచరణ సాధ్యంకాదని న్యాయ, సాగునీటిరంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి మధ్యప్రదేశ్, మహారాష్ట్రల మధ్య 1975, డిసెంబర్ 19న కుదిరిన ఒప్పందం ప్రకారం ఇచ్చంపల్లి నుంచి 85 టీఎంసీలకు మించి ఉమ్మడి రాష్ట్రం వాడుకోవడానికి వీల్లేదు. ఇదే అంశాన్ని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు స్పష్టంచేసింది. గోదావరి–కావేరి అనుసంధానం తొలిదశలో ఇచ్చంపల్లి నుంచి 141.3 టీఎంసీలు తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనను అమలుచేస్తే మూడు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం, గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించినట్లవుతుందని న్యాయ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి విడిపోయి ఏర్పాటైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తుండడాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన మేరకు పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపడితే న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని.. తక్కువ వ్యయంతో పనులు పూర్తిచేయవచ్చునని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన ఇదీ..
ఇంద్రావతి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ (అప్పటి మధ్యప్రదేశ్)కు గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన నీటిలో వాడుకోని 141.3 టీఎంసీలకు 106 టీఎంసీల వరద జలాలను జతచేసి.. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా), గ్రాండ్ ఆనకట్ట (కావేరి) వరకూ నీటిని తరలించడం ద్వారా గోదావరి–కావేరి అనుసంధానం చేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ తొలుత ప్రతిపాదించింది. దీనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు అభ్యంతరం చెప్పాయి. గోదావరి నికర జలాల్లో మిగులులేదని.. నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాకే అనుసంధానం చేపట్టాలని డిమాండ్ చేశాయి. దీంతో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలను గోదావరి–కావేరి అనుసంధానం తొలిదశలో భాగంగా ఇచ్చంపల్లి నుంచి తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ మళ్లీ ప్రతిపాదించింది. ఆవిరి ప్రవాహ నష్టాలుపోనూ ఆంధ్రప్రదేశ్‌కు 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడుకు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలను అందించాలని ప్రతిపాదించింది. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మా కోటాలో నీటిని తరలిస్తే న్యాయ పోరాటం చేస్తామని తేల్చిచెప్పింది. గోదావరి, ఉప నదులలోని నికర జలాల్లో ఎగువ రాష్ట్రాలకు కేటాయించగా మిగిలిన నీరు, వరద జలాలపై పూర్తి హక్కును దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు ట్రిబ్యునల్ ఇచ్చింది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ.. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేలా గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని ఎన్‌డబ్ల్యూడీఏకు పలు మార్పులు కోరింది.



మూడు రాష్ట్రాల మధ్య ఒప్పందం ఇదీ..

గోదావరిపై ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం 1975, డిసెంబర్ 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం మేరకు ఇచ్చంపల్లి నుంచి 85 టీఎంసీలను మాత్రమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వినియోగించుకోవచ్చు. రిజర్వాయర్ నుంచి 3 టీఎంసీలు మధ్యప్రదేశ్, 4 టీఎంసీలు మహారాష్ట్ర, 5 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ ఎత్తిపోతల ద్వారా వినియోగించుకోవచ్చు. మిగతా నీటిని విద్యుదుత్పత్తికి వినియోగించాలి. ఉత్పత్తయ్యే విద్యుత్‌లో మధ్యప్రదేశ్ 38 శాతం, మహారాష్ట్ర 35 శాతం, ఆంధ్రప్రదేశ్ 27 శాతం వాడుకోవాలి. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో 78.10 శాతం ఆంధ్రప్రదేశ్, 10.50 శాతం మహారాష్ట్ర, 11.40 శాతం మధ్యప్రదేశ్ భరించాలి. ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే నిర్వహించాలి.

పోలవరం నుంచైతేనే కావేరికి గోదావరి..
గోదావరి బేసిన్‌లో దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపడితే ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఏ రాష్ట్రం హక్కులకు విఘాతం కలగదు. ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రస్తావిస్తూ.. పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానాన్ని చేపట్టాలని సూచించారు. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీకు చేరిన గోదావరి జలాలను కృష్ణా నదీ ప్రవాహానికి వ్యతిరేక దిశలో పులిచింతల, నాగార్జునసాగర్, శ్రీశైలంలోకి ఎత్తిపోసి.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తరలించేలా పనులు చేపట్టాలని సూచిస్తున్నారు. దీనివల్ల భూసేకరణ, నిర్వాసితుల సమస్య తప్పుతుందని.. తక్కువ వ్యయంతో గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టవచ్చునన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను న్యాయ, సాగునీటిరంగ నిపుణులు బలపరుస్తున్నారు.

చిటికెలో 'మ్యుటేషన్'

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలుదారులు అవస్థలు పడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రవేశపెట్టిన విధానాలు, రెవెన్యూ సంస్కరణల ఫలితంగా ఇప్పుడు చాలా తేలిగ్గా ఆటో మ్యుటేషన్ జరిగిపోతోంది. వ్యవస్థలు వాటి పని అవి చేసుకుంటూ వెళుతున్నాయి. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా వెబ్‌ల్యాండ్‌లో యాజమాన్య హక్కుల బదలాయింపు జరుగుతోంది. ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న కార్డ్ ప్రైమ్ రిజిస్ట్రేషన్ల విధానంలో మ్యుటేషన్ ప్రక్రియ అత్యంత సరళంగా ముగుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రిజిస్ట్రేషన్లు, ఆటో మ్యుటేషన్ల తీరును 'సాక్షి' ప్రతినిధి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



పూర్తయ్యేదాకా ఉత్కంఠే!

స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరిగిన తర్వాత వాటిని తమ పేరు మీదకు మార్చుకోవడం ఇన్నాళ్లూ క్లిష్టతరంగా ఉండేది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మళ్లీ మ్యుటేషన్ కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవడం, ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టడంతో కొనుగోలుదారులకు కునుకు పట్టేది కాదు. ఆస్తిని రిజిస్టర్ చేసేది రిజిస్ట్రేషన్ శాఖ అయితే దాన్ని రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేసేది రెవెన్యూ శాఖ. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, ఏళ్ల తరబడి అదే విధానం కొనసాగడంతో రిజిస్ట్రేషన్ పూర్తయినా మ్యుటేషన్ కోసం నిరీక్షణ తప్పని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో రిజిస్టర్ అయిన ఆస్తికి సంబంధించి వివాదాలు తలెత్తడంతో మ్యుటేషన్ జరిగేది కాదు. అవతవకలకు ఆస్కారం ఉండేది. సంక్లిష్టంగా ఉన్న మ్యుటేషన్ల విధానాన్ని సీఎం జగన్ ప్రభుత్వం సరళంగా మార్చింది. ఎంతోకాలం నుంచి కాగితాలకే పరిమితమైన ఆటో మ్యుటేషన్ ప్రతిపాదనను వాస్తవ రూపంలోకి తెచ్చి ప్రజల అవస్థలను తొలగించింది.

రిజిస్ట్రేషన్ల శాఖకు వెబ్‌ల్యాండ్ అనుసంధానం

నూతన విధానంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్‌ను, రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేశారు. దానికి ముందు రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్ కార్డ్ స్థానంలో కార్డ్ ప్రైమ్‌ను ప్రవేశపెట్టారు. ఆటో మ్యుటేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్ తయారు చేసుకోవడం, సర్వే నెంబర్ ఎంటర్ చేయగానే మార్కెట్ విలువ కనిపించడం, అందుకు తగ్గట్టుగా ఆన్‌లైన్‌లోనే చలానాలు కట్టడం, అనంతరం రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవడం కార్డ్ ప్రైమ్ విధానంలో కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. నిర్దేశించిన స్లాట్ ప్రకారం రిజిస్ట్రార్ ఆఫీసు లేదంటే గ్రామ, వార్డు సచివాలయానికి వెళితే అక్కడ కొత్త విధానంలో వెంటనే రిజిస్ట్రేషన్‌తోపాటు ఆ వివరాల ప్రకారం ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగిపోతోంది. మళ్లీ మ్యుటేషన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసే సమయంలోనే అన్నింటినీ పక్కాగా నిర్ధారిస్తారు. సబ్ రిజిస్ట్రార్లు రెవెన్యూ రికార్డులను పూర్తిగా పరిశీలించి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. రిజిస్ట్రేషన్ జరగగానే రెవెన్యూ రికార్డుల్లో యాజమాన్య హక్కు దానంతట అదే మారిపోతుంది.

త్వరలో అర్బన్ ప్రాంతాల్లోనూ..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మూడు నెలల క్రితం నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త విధానంలోనే రిజిస్ట్రేషన్లతోపాటు ఆటో మ్యుటేషన్లు జరుగుతున్నాయి. కొత్త విధానం వచ్చాక 26 జిల్లాల్లో ఇప్పటివరకు 7 వేలకుపైగా ఆటో మ్యుటేషన్లు జరిగాయి. వ్యవసాయ భూములకు సంబంధించి అమలవుతున్న ఆటో మ్యుటేషన్ విధానాన్ని త్వరలో అర్బన్ ప్రాంతాల్లోనూ అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నగరాలు, పట్టణాల్లో ఆస్తుల రికార్డులు మున్సిపల్ శాఖ నిర్వహిస్తుండడంతో రిజిస్ట్రేషన్ల శాఖ అందుబాటులోకి తెచ్చిన కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌ను దానికి అనుసంధానించాల్సి ఉంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల శాఖ అందుకు సిద్ధమవగా మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తోంది.

సులభతరం



రిజిస్ట్రేషన్ సేవలతోపాటు మ్యుటేషన్ విధానాన్ని సులభతరం చేశాం. కార్డ్ ప్రైమ్ విధానంలో ఆటో మ్యుటేషన్ వెంటనే జరిగిపోతోంది. ఇందుకోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల సాఫ్ట్‌వేర్‌లను పూర్తిగా మార్చాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములకు ఆటో మ్యుటేషన్లు జరుగుతున్నాయి. అర్బన్ ఆస్తులకూ ఇదే విధానాన్ని తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ల విధానం, ఆటో మ్యుటేషన్ చాలా బాగా అమలవుతోంది. దుష్ప్రచారాలను నమ్మవద్దు. – వి.రామకృష్ణ, కమిషనర్ అండ్ ఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

వెంటనే ఆన్‌లైన్‌లో..



మా గ్రామ సమీపంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశా. నందిగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ అరగంటలోనే పూర్తయింది. ఆ తర్వాత వెంటనే నా పేరు మీద ఆన్‌లైన్‌లో కూడా మారింది. ఇంతకుముందు ఆన్‌లైన్‌లో పేరు చేర్చాలంటే రిజిస్ట్రేషన్ పత్రాలతో ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వెంటనే మ్యుటేషన్ జరగడం బాగుంది.
– నల్లపోతుల నాగరాజు, నందిగామ మండలం, రాఘవాపురం

తిరిగే తిప్పలు లేవు..



నా పేరుతో ఉన్న 33 సెంట్ల భూమిని నా కుమార్తె వెంకటేశ్వరమ్మ పేరిట రాశాను. రిజిస్ట్రేషన్ జరిగిన రోజే ఆమె పేరిట భూమి మారిపోయింది. ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన బాధ లేకుండా వెంటనే పని పూర్తయింది.
– చల్లా ఆంజనేయులు, కొండూరు, నందిగామ మండలం.

సమగ్ర ప్రణాళికతో ఎన్నికలు

కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ

సాక్షి, అమరావతి: 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికే 360 డిగ్రీల సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా శాంతియుత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్), సాధారణ ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం నోవాటెల్‌లో ప్రారంభమైన సమీక్ష సమావేశం శనివారం కూడా కొనసాగింది. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్, స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ (వ్యయం) యశ్వేంద్ర సింగ్‌తో పాటు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరేంధిర తదితరులు హాజరయ్యారు. జిల్లాల్లోని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వారి ఫిర్యాదుల పరిష్కారం, ఇంటింటి సర్వే, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, ఎన్నికల సిబ్బంది, శిక్షణ తదితరాలపై శుక్రవారం 19 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ప్రజెంటేషన్ ఇవ్వగా, శనివారం ఇతర జిల్లాల అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా ప్రతి దశలో అప్రమత్తత, పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షికతతో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఓటర్ల జాబితాలన్నీ దోష రహితంగా ఉండాలని చెప్పారు. ఎక్కడా ఒక్క మరణించిన వ్యక్తి కానీ, డబుల్ ఎంట్రీ కానీ ఉండకుండా జాబితాల స్వచ్ఛీకరణ జరగాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా, నిర్భయంగా, సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ఈవీఎంలు, ఎన్నికలకు అవసరమయ్యే ప్రతి మెటీరియల్‌ను మైక్రో ప్లాన్‌కు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులు, పౌరులు, అభ్యర్థులకు ఉపయోగపడే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదికలపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని తెలిపారు. లొకేషన్ మేనేజ్‌మెంట్ (డిస్పాచ్ సెంటర్, రిసీట్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, ట్రైనింగ్ సెంటర్లు)కు కూడా పటిష్ట ప్రణాళిక ఉండాలన్నారు. ఎన్నికల సిబ్బందికి సమర్థవంతమైన మాస్టర్ ట్రైనర్లతో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంలు కూడా కీలకమని చెప్పారు.

ప్రతి ప్రాంతానికి ప్రత్యేక స్వీప్ ప్రణాళిక

గత ఎన్నికల్లో నియోజకవర్గాలు, పోలింగ్ స్టేషన్ల వారీగా పోలింగ్ శాతాలను విశ్లేషించుకొని, దాని ఆధారంగా ప్రాంతాలనుబట్టి ప్రత్యేక సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సమస్యలకు కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి, స్థానికుల్లో భయాలను పోగొట్టాల్సిందిగా చెప్పారు. సోషల్ మీడియా ఫిర్యాదుల పరిష్కారం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), ఎథికల్ ఓటింగ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ నిర్వహణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితరాలపైనా ఎన్నికల సంఘం ప్రతినిధులు మార్గనిర్దేశం చేశారు. ఈ రెండు రోజుల సమీక్షలో స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన, సమ్మిళిత ఎన్నికల నిర్వహణకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు భేష్

రెండు రోజుల సమీక్ష సమావేశాలకు మంచి ఏర్పాట్లు చేసి, విశిష్ట ఆతిథ్యమిచ్చిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నేతృత్వంలోని అధికార యంత్రాంగానికి కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్ బృందం ధన్యవాదాలు తెలిపింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఎన్నికలపై ఈసీఐ అధికారుల నేతృత్వంలో విజయవంతంగా జరిగిన నిర్మాణాత్మక సమీక్ష సమావేశాలు స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు మార్గదర్శిగా నిలిచాయని కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. ఈ సందర్భంగా ఈసీఐ అధికారులను జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో కేంద్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ శర్మ


ధర్మేంద్ర శర్మకు అమ్మ వారి ప్రసాదాలు అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కేంద్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్, ప్రత్యేక అధికారి ధర్మేంద్ర శర్మ శనివారం దర్శించుకున్నారు. ధర్మేంద్ర శర్మకు ఆలయ ఏఈఓ ఎస్.రమేష్‌బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ధర్మేంద్రశర్మ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఉన్నారు.

సరిహద్దుల్లో నిఘా పెంచాలి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో నిఘా పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి సూచించారు. వారు శనివారం సీఎస్, డీజీపీ, ఇతర అధికారులతో సమావేశమై సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లు, శాంతి భద్రతలపై చర్చించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి, ఎన్నికలకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి రాష్ట్రంలో చేపడుతున్న చర్యలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించాయి. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘ అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, మద్యం సరఫరా వంటివి నిరోధించడానికి ఎక్సైజ్ శాఖ, సెబ్ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని స్థాయిల్లో సమాచారం నిరంతరాయంగా వెళ్లేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా ఇంటెలిజెన్స్ సహాయంతో సకాలంలో చర్యలు తీసుకోగలమని తెలిపారు.

సీఎం జగన్, మహిళా మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన యశస్విపై కేసు నమోదు
- లుక్ అవుట్ నోటీసుతో అరెస్టు చేసి విచారించిన సీఐడీ పోలీసులు
- అవసరమైనప్పుడు విచారణకు రావాలని చెప్పిన సీఐడీ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి/నగరంపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మహిళా మంత్రులను అసభ్య పదజాలంతో అవమానకరంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న బొద్దులూరి యశస్వి(యష్)పై కేసు నమోదు చేసిన సీఐడీ పోలీసులు శనివారం అరెస్టు చేసి విచారించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన యష్ వాషింగ్టన్ డీసీ(యుఎస్ఏ)లో ఉంటున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహిళా మంత్రులు, ప్రజాప్రతినిధులపైన, ముఖ్యంగా సీఎం జగన్‌పై నోటికొచ్చినట్టు దుర్భాషలాడటంతో పాటు సోషల్ మీడియాలో అసభ్యకర, అవమానకరంగా పోస్టులు పెడుతున్నాడు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేలా, ప్రజల మధ్య, వివిధ రాజకీయ వర్గాల్లో వైషమ్యాలు పెంచేలా, శాంతి భద్రత సమస్యలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాడు. యూఎస్ఏలో ఉంటూ సామాజిక మాధ్యమాల్లో అత్యంత దారుణమైన పోస్టింగ్‌లు పెడుతున్న యష్‌పై ఏపీ సీఐడీకి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 10/2022 ఐపీసీ సెక్షన్ 153–ఎ, 505(2), 120–బి, ఐటీ యాక్ట్–2000 సెక్షన్ 66–సి ప్రకారం ఒక కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 2/2023 ఐపీసీ సెక్షన్ 153–ఎ, 505(2), 120–బి కింద మరో కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 7/2023 ఐపీసీ సెక్షన్ 153–ఎ, 505(2), 504, 503 రెడ్ విత్ 120–బి కింద ఇంకో కేసు నమోదు చేశారు. ఈ కేసులో యష్‌ను అరెస్టు చేసేందుకు సీఐడీ లుక్ అవుట్ నోటీసు కూడా జారీ చేసింది. యష్ శనివారం అమెరికా నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. లుక్ అవుట్ నోటీసు అమల్లో ఉండటంతో అక్కడి ఇమ్మిగ్రేషన్ ఆఫీసర్ అతన్ని పట్టుకుని సీఐడీ పోలీసులకు అప్పగించారు. అతన్ని గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించి విచారించారు. తన తల్లికి అనారోగ్యంగా ఉందని యష్ చెప్పడంతో.. సెక్షన్ 41ఎ నోటీసు ఇచ్చిన సీఐడీ అధికారులు.. ఎప్పుడు అవసరమైతే అప్పుడు విచారణకు రావాలని చెప్పి పంపించారు.

4న పాలిటెక్నిక్ లెక్చరర్స్ పోస్టుల రాత పరీక్ష



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్స్ పోస్టుల భర్తీ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక పరీక్ష నిర్వహించడానికి ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 4వ తేదీన జరిగే రాత పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను ఈ నెల 28 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను https://psc.ap.gov.in, అనే వెబ్‌సైట్ లింక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కోరింది.

బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా రూ.95 కోట్ల రుణాలు

- సొసైటీ చైర్మన్ అమ్మా ప్రసాద్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ద్వారా రూ.95 కోట్ల నికర రుణాలు ఇచ్చినట్టు సొసైటీ చైర్మన్ అమ్మా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 75,005 మంది సభ్యులతో 16 శాఖలతో విస్తరించిన సొసైటీకి చైర్మన్‌గా పనిచేయడానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అతి పెద్ద ప్రాథమిక పరపతి సంఘంగా గుర్తింపు పొందిన ఈ సొసైటీ ద్వారా డిపాజిట్లు సేకరించి అనేక పథకాల ద్వారా రుణాలు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం అరుంధతి గ్రూపు రుణ పథకంలో 893 గ్రూపుల (2,679 మంది మహిళలు)కు రూ.7.79 కోట్లు, పురుషుల స్వయం ఉపాధికి వశిష్ఠ పథకంలో 389 గ్రూపుల(1,167 మంది)కు రూ.3.52 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. పురోహితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పురోహిత మిత్ర పథకంలో 209 గ్రూపుల(836 మంది)కు రూ.3.34 కోట్లు, రెండోసారి రుణాలుగా 160 గ్రూపుల(640 మంది)కు రూ.5.12 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. అర్చక మిత్ర పథకం ద్వారా అర్చకులకు రూ.0.82 కోట్లు, సత్యదేవ సేవామిత్ర పథకం ద్వారా అన్నవరం వ్రత పురోహితులకు రూ.1.08 కోట్లు, బ్రాహ్మణుల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు 264 మందికి రూ.5.23 కోట్లు బ్రాహ్మణ బిజినెస్ లోన్ ఇచ్చామన్నారు. బ్రాహ్మణ ప్రైవేటు టీచర్లకు ఆచార్య మిత్ర, జర్నలిస్టులకు సమాచార మిత్ర పథకాల్లో రుణాలు ఇస్తున్నామన్నారు. ఎంప్లాయి పర్సనల్, మార్ట్‌గేజ్, విద్యాభారతి వంటి రుణాలు కూడా ఇచ్చినట్టు తెలిపారు. సభ్యుల నుంచి డిపాజిట్ల సేకరణలో రూ.30 కోట్ల మైలురాయిని అధిగమించడం గర్వకారణమని పేర్కొన్నారు.

టీడీపీ అక్రమాలపై చర్యలు తీసుకోండి

- ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోంది
- మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలు సేకరిస్తోంది
- తెలంగాణలో ఓట్లున్నవారిని రాష్ట్రంలో ఓటర్లుగా చేరుస్తోంది
- ఇందుకోసం టీడీపీ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది
- మేనిఫెస్టో పేరుతో టీడీపీ నేతలు ఇంటింటికీ ప్రమాణపత్రాలు ఇస్తున్నారు
- తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న కోనేరు సురేశ్‌పై చర్యలు తీసుకోండి
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు మాజీ మంత్రి పేర్ని నాని వినతి


మాట్లాడుతున్న పేర్ని నాని. పక్కన నాగార్జున, అబ్బయ్య చౌదరి, జోగి రమేశ్, లేళ్ల అప్పిరెడ్డి, గౌతమ్‌రెడ్డి

సాక్షి అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో టీడీపీ భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారుల బృందానికి ఫిర్యాదు చేశారు. మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలను టీడీపీ అక్రమంగా సేకరిస్తోందన్నారు. ఆ పార్టీకి మద్దతు తెలపని ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం తప్పుడు సమాచారంతో భారీ ఎత్తున ఫామ్–7లను ఎన్నికల సంఘానికి సమర్పిస్తోందన్నారు. పైగా దొంగే దొంగ అన్నట్లు టీడీపీ నేతలే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఈసీ అధికారుల బృందం శనివారం కూడా సమీక్ష నిర్వహించింది. ఈ నేపథ్యంలో సీఈసీ బృందాన్ని మంత్రులు జోగి రమేశ్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, నవరత్న పథకాల అమలు వైస్ చైర్మన్ నారాయణమూర్తిలతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ నెల 14న సీఈసీకి చేసిన ఫిర్యాదులను మరోసారి వైఎస్సార్‌సీపీ నేతలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో టీడీపీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఇంకా ఆయన ఏమన్నారంటే..

తెలంగాణలో ఓట్లున్నవారిని ఏపీలో చేరుస్తోంది..

తెలంగాణలో ఓట్లు ఉన్న వారిని రాష్ట్రంలోనూ ఓటర్లుగా చేర్పించడానికి టీడీపీ ఆ రాష్ట్రంలో భారీ ఎత్తున శిబిరాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో ఒక ఓటు.. రాష్ట్రంలో మరో ఓటు ఉన్నవారు రాష్ట్రంలో 4.30 లక్షల మంది ఉన్నారు. వారి ఓట్లను తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాం. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాలని తప్పుడు సమాచారంతో పది లక్షలకుపైగా ఫామ్–7లను దాఖలు చేసిన టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కోనేరు సురేశ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాం. మేనిఫెస్టో పేరుతో వచ్చే ఐదేళ్లలో ఒక్కో కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరిస్తూ 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో ప్రమాణపత్రాలను ఓటర్లకు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశాం.

టీడీపీ, జనసేన చట్టవ్యతిరేక కార్యకలాపాలు..

గతంలో సేవా మిత్ర యాప్ తరహాలోనే ఇప్పుడు మై పార్టీ డ్యాష్ బోర్డ్.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని టీడీపీ అక్రమంగా సేకరిస్తోంది. టీడీపీ, జనసేన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. మేనిఫెస్టో రూపంలో కాకుండా వ్యక్తిగతంగా ఇంటింటికీ వెళ్లి టెక్నాలజీని ఉపయోగించి ప్రలోభాలకు గురిచేస్తున్నాయని ఎన్నికల అధికారుల బృందానికి వివరించాం. వైఎస్సార్‌సీపీ ఓటర్లను గుర్తించి వారి ఓట్లను తొలగించడానికి టీడీపీ నేతలు దరఖాస్తు చేస్తున్నారు. తెలంగాణలో ఓట్లు ఉన్నవారిని సోషల్ మీడియా ద్వారా హోటల్స్‌కి పిలిపించుకుని రాష్ట్రంలో ఓట్లు ఎలా నమోదు చేసుకోవాలో చెబుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సీఈసీ బృందానికి ఫిర్యాదు చేశాం.

ఒకరికి ఒక ఓటే మా విధానం

ఒకరికి ఒక ఓటు ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ విధానం. తెలంగాణలో ఓటు ఉన్నవారు ఏపీలోనూ ఓటు నమోదు చేసుకుంటున్నారు. ఒక వ్యక్తి రెండు చోట్లా ఓట్లు కలిగి ఉండటం నేరం. రాష్ట్ర అధికార యంత్రాంగం మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలు మానేసి ఎన్నికల ఫిర్యాదులపై విచారణలో నిమగ్నం కావాలనే టీడీపీ తప్పుడు ఫిర్యాదులు చేసింది. టీడీపీకి చెందిన కోనేరు సురేశ్ 10 లక్షలకు పైబడి దొంగ ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం ఇందుకు నిదర్శనం. వాటిని ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు పంపి విచారణకు ఆదేశించింది. కోనేరు సురేశ్ తప్పుడు ఫిర్యాదు చేశారని జిల్లా కలెక్టర్లు ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చారు. కోనేరు సురేశ్ తప్పుడు ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఆశ్చర్యపోయారు.

వ్యూహం.. ఒక వాస్తవం

- సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ


ప్రీ రిలీజ్ వేడుకలో మంత్రులు రోజా, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, దర్శకుడు రాంగోపాల్ వర్మ, ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2019 వరకు కుట్రలు– ఆలోచనల మధ్య జరిగిన రాజకీయమే 'వ్యూహం' చిత్రమని సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ చెప్పారు. రాజకీయాలను ప్రజలు చూసే కోణం నుంచే ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ చిత్రంలో ఎలాంటి కల్పితాలు లేవని, పాత్రల పేర్లు సైతం రాజకీయ నాయకుల వాస్తవ పేర్లతోనే తెరకెక్కించామని స్పష్టం చేశారు. విడుదలను ఆపేందుకు పన్నిన కుట్రలను సైతం ఛేదించుకుని ఈ నెల 29న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని ప్రకటించారు. రామదూత క్రియేషన్స్ బ్యానర్‌పై దాసరి కిరణ్‌కుమార్ నిర్మించిన 'వ్యూహం' చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ 'జగ గర్జన' పేరుతో విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. వ్యూహం సినిమాలో షాట్ వన్‌ను ఎంపీ నందిగం సురేష్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ వెన్నుపోటుతోనే ఫేమస్ అయిన చంద్రబాబు ఇప్పటికీ తన రాజకీయ సౌలభ్యం కోసం ఎన్టీఆర్ అభిమానులను అప్పుడపుడు వాడుకుంటున్నారని చెప్పారు. ఈ చిత్రం ద్వారా తన పరువు పోతుందని, విడుదల ఆపాలని లోకేశ్ కోర్టుకెళ్లడం పెద్ద జోక్ అన్నారు. తెల్లారి లేస్తే లోకేశ్ అందర్నీ పచ్చి బూతులు తిడితూ అవమానించడం ఇతరుల పరువు తీయడం కాదా.. అని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్‌ను రంగుల రాజాగా అభివర్ణించారు. తెలంగాణ ఎన్నికల్లో బర్రెలక్కకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ పవన్‌కళ్యాణ్‌కు లేదని ఎద్దేవా చేశారు. బట్టలూడదీస్తాం.. రోడ్డు మీద ఈడ్చి తంతాం.. కోస్తాం.. అంటూ పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, లోకేశ్ ప్రతి రోజూ మాట్లాడుతుంటారని, ఇలాంటి వ్యాఖ్యలు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ సైతం మాట్లాడరని ఆయన చెప్పారు. మంత్రులు రోజా, అంబటి రాంబాబు, జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత రాష్ట్రంలో జరిగిన కుట్ర రాజకీయాలను, కాంగ్రెస్‌తో చేతులు కలిపి చంద్రబాబు పన్నిన పన్నాగాలను, బాబు హయాంలో జరిగిన ప్రజాధనం దోపిడీని ఈ చిత్రంలో తెరకెక్కించారని తెలిపారు. నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, స్టార్ క్రికెటర్ అంబటి రాయుడు, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, శివకుమార్, అదీప్‌రాజు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి ప్రసంగించారు.

బ్యాడ్మింటన్ అండర్–17లో రాష్ట్ర విద్యార్థుల ప్రతిభ



బాలుర విభాగంలో ఏపీ బృందానికి ద్వితీయ స్థానం

సాక్షి, అమరావతి: 67వ జాతీయ స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్–17 విభాగంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రతిభ చూపి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో జరుగుతున్న పోటీల్లో రాష్ట్ర విద్యార్థులు తలపడి రజత పతకం సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు పగడాల బాల ప్రణయ్, వై.జోయల్ నిఖిల్ ప్రకాష్, కొర్లల శ్రీకర్ వెంకట ప్రణీత్, ఆకుల త్రిలోక్, రాపేటి పార్థివ్‌లను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలు

- వాటిని పరిశీలించండి
- ఎన్నికల సంఘానికి టీడీపీ వినతి

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని.. వాటిని పరిశీలించాలని టీడీపీ కేంద్ర ఎన్నికల సంఘానికి విన్నవించింది. ఈ మేరకు విజయవాడ వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను శనివారం ఆ పార్టీ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, బొండా ఉమ, వర్ల రామయ్య కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు కొందరు పరిశీలకులు సహకరించారని ఆరోపించారు. కొందరు అధికారులు ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా కుల సంఘాల సమావేశాలకు హాజరవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాలకు చెందిన అధికారులను ఓటర్ల జాబితాల పరిశీలకులుగా నియమించాలని కోరారు. కొందరు పోలీసు అధికారుల తీరు సరిగా లేదని, తమ పార్టీ నేతలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. వీటన్నింటినీ ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఎన్నికల్లో అక్రమాలకు తావివ్వొద్దు

- ఒకే డోర్ నంబర్‌తో పదుల సంఖ్యలో ఓటర్లు
- ఇప్పటినుంచే చర్యలు చేపట్టండి
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు జనసేన వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే ఏడాది నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకి తావు లేకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితాలో అనేక లోపాలు బయటపడుతున్నాయని, వాటిని సవరించాలని కోరింది. ఈ మేరకు శనివారం విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను జనసేన పార్టీ నేతలు బొనబోయిన శ్రీనివాస యాదవ్, పోతిన వెంకట మహేష్, గాదె వెంకటేశ్వరరావు కలిశారు. రాష్ట్రంలో జీరో డోర్ నంబర్ ఇళ్లు లక్షల్లో ఉన్నాయని.. వాటి పేరుతో భారీగా ఓట్లు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ చేపట్టాలన్నారు. అదే విధంగా ఒకే డోర్ నంబర్‌తో పదుల సంఖ్యలో ఓటర్లు ఉన్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకి ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హత లేదనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే వలంటీర్లను కూడా ఎన్నికలకు దూరంగా ఉంచాలని కోరారు.

బాబు, లోకేశ్‌కు సిగ్గూశరం లేవు

- ప్రశాంత్ కిషోర్‌ను డెకాయిట్ అని దూషించి ఆయననే తెచ్చుకున్నారు
- అవసరమైతే ఎవరి కాళ్లయినా పట్టుకుంటారు
- జనం గుండెల్లోనే సీఎం జగన్
- పీకే, రాబిన్ శర్మ, సునీల్ ఎవరొచ్చినా మా పార్టీకి ఏం కాదు
- వేయి మంది పీకేలు వచ్చినా ఏం చేయలేరు
- వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, జోగి రమేశ్

సాక్షి, అమరావతి: చంద్రబాబు, లోకేశ్ గత ఎన్నికల సమయంలో ప్రశాంత్ కిశోర్‌ను ఉద్దేశించి బీహార్ డెకాయిట్ అని, బీహార్ వాడికి ఇక్కడేం పని అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని గుర్తు చేశారు. 'ఆయన పీకే కాదు బీడీ (బీహార్ డెకాయిట్)' అన్నారన్నారు. అంతేకాకుండా 'పీకే ఇక్కడకొచ్చి ఏం చేస్తాడు.. ఏమీ చేయలేడు' అంటూ తండ్రీకొడుకులు ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేశారన్నారు. పీకే తోక కత్తిరిస్తామంటూ చంద్రబాబు నోటికొచ్చినట్లు మాట్లాడారని గుర్తు చేశారు. ఈ మేరకు పేర్ని నాని శనివారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ తీరుపై ధ్వజమెత్తారు. వారిద్దరికీ సిగ్గూ, శరం లేవన్నారు. 'వైఎస్సార్‌సీపీలో ఉన్న నేతలపై నమ్మకం లేకే పీకేను తెచ్చుకున్నామంటూ ఆనాడు మమ్మల్ని హేళన చేశారు. ఇవన్నీ ఇప్పుడు ఎందుకు గుర్తు చేస్తున్నామంటే.. చంద్రబాబు, లోకేశ్ ఎంతగా దిగజారిపోతారో అందరూ గుర్తించాలి. అవసరమైతే వారిద్దరూ ఎవరి కాళ్లయినా ఎలా పట్టుకుంటారో ప్రజలంతా తెలుసుకోవాలి' అని పేర్ని నాని కోరారు.

ఎంతమంది పీకేలు వచ్చినా పీకేదేం లేదు..

'ఒకప్పుడు బీహార్ డెకాయిట్ అంటూ ప్రశాంత్ కిశోర్‌ను దూషించి ఇప్పుడు ఆయనే టీడీపీకి వ్యూహకర్తగా కావాలంటూ చంద్రబాబు, లోకేశ్ ఢిల్లీ వెళ్లి ఆయనను బ్రతిమిలాడి తెచ్చుకున్నారు. అంటే వారికి టీడీపీ మనుగడపై నమ్మకం లేదని స్పష్టమవుతోంది. మేము ఛీ కొడితే బయటకు పోయిన వాడిని బ్రతిమలాడి తెచ్చుకున్నారు. రాబిన్ శర్మ, ప్రశాంత్ కిషోర్, సునీల్ కనుగోలు ఇలా ఎవరిని తెచ్చుకున్నా మాకేం కాదు. జనం గుండెల్లో జగన్ ఉన్నంత వరకు ఎవరూ వచ్చినా మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఎంతమంది పీకేలు వచ్చినా పీకేది ఏమీ లేదు. ప్రశాంత్ కిషోర్ మా దగ్గర జీతానికే పని చేశాడు.. ఇప్పుడూ అదే చేస్తాడు' అని పేర్ని నాని మండిపడ్డారు.

వేయి మంది పీకేలు వచ్చినా ఏమీ కాదు: మంత్రి జోగి రమేశ్

'ఆ పీకే(పవన్ కళ్యాణ్) అయినా, ఈ పీకే (ప్రశాంత్ కిషోర్) అయినా టీడీపీని బతికించే పరిస్థితి లేదు. ఇప్పటివరకూ ఒక పీకే ఏమీ పీకలేక పోయాడు.. మళ్లీ ఇంకో పీకే వచ్చాడు. ఇలాంటి పీకేలు వేయి మంది వచ్చినా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరు.. టీడీపీని బతికించలేరు. పవన్ పైన, పార్టీ కార్యకర్తల పైన బాబు, లోకేశ్‌లకు నమ్మకం లేదు. 2019లో చంద్రబాబుని ప్రజలు పీకేశారు. 2024లో టీడీపీ, జనసేనలను మొత్తంగా పీకేస్తారు. చంద్రబాబు భవిష్యత్కే గ్యారెంటీ లేదు.. ప్రజలకు ఏం గ్యారెంటీ ఇస్తారు' అని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ధ్వజమెత్తారు.

శారదా పీఠంలో ఘనంగా అద్వైతానందేంద్ర ఆరాధన


అద్వైతానందేంద్ర సరస్వతి చిత్ర పటానికి పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ గురువు, జ్ఞానమూర్తి అద్వైతానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆరాధన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పీఠంలో అద్వైతానందేంద్ర చిత్రపటానికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముష్టి భీమశంకరం ఘనాపాటి, ముక్కామల సుబ్రహ్మణ్యం, హనుమాన్‌శర్మలను ఘనంగా సత్కరించారు. భక్తులు, పీఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

• తెలంగాణ

అంకుర ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

- రోగులు, సహాయకులు సురక్షితం

గోల్కొండ (హైదరాబాద్): హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని అంకుర ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సాయంత్రం ఆరు గంటలకు భవనంలోని 8వ అంతస్తు నుంచి భారీగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగతో అగ్ని కీలలు బయటకు వ్యాపించాయి. నిమిషాల్లోనే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది ఇన్‌పేషంట్లను వెంటనే బంజారాహిల్స్‌లోని అంకుర ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అధికారులు చెప్పారు. మొత్తం ఐదు ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చాయని అగ్నిమాపక శాఖ డీజీపీ జి.వి.నారాయణరావు తెలిపారు. ఆ సమయంలో ఆసుపత్రిలో 30 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. వారిని అంబులెన్స్‌లలో బంజారాహిల్స్‌లోని అంకుర ఆసుపత్రికి తరలించారు. ఇన్‌పేషంట్లకు, వారి సహాయకులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఆయన బాధపడువాని బాధను తృణీకరింపలేదు.
దానిని చూచి ఆయన అసహ్యపడలేదు. అతనికి తన ముఖమును దాచలేదు.
వాడాయనకు మొఱ్ఱపెట్టగా ఆయన ఆలకించెను.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.6.35 వరకు, తదుపరి త్రయోదశి తె.5.31 వరకు (తెల్లవారితే సోమ వారం), **నక్షత్రం:** కృత్తిక రా.9.45 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.59 నుండి 11.31 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.05 నుండి 4.53 వరకు, **అమృతఘడియలు:** రా.7.06 నుండి 9.0.1 వరకు, హనుమద్వ్రతం.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.28
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

పీకే అండ్ పీకే ఫార్ములా!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ముసుగు జారిపోయింది. ఇప్పుడంతా తేటతెల్లం. చంద్రబాబు కోసం పవన్ కల్యాణ్ చేత చంద్రబాబే ఏర్పాటు చేయించిన 'స్పెషల్ పర్పస్ వెహికిల్' (ఎస్‌పీవీ) జనసేన. అది ప్యాకేజీ ఫీజుతో కాంట్రాక్టుపై పనిచేస్తున్నదని వైఎస్సార్‌సీపీ నాయకులు చాలాకాలంగా విమర్శలు చేస్తున్నారు. ఏడెనిమిదేళ్లుగా జనసేన కోసం జీవితాలను ధారబోసి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్న యువకులు ఇంకో అడుగు ముందుకు వేసి చెబుతున్న మాట – 'చంద్రబాబు సినిమాలో... జనసేన ఓ ఐటమ్ సాంగ్ మాత్రమే!'

కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్ చెబుతున్న మాటలు జనసేన కార్యకర్తల్లోని అనుమానాలను బలపరుస్తున్నాయి. 'రాజకీయ వ్యూహం నాకు వదిలేయండి. నేనేం చేసినా ప్రశ్నించవద్దు. తెలుగుదేశం పార్టీతో పొత్తును వ్యతిరేకించేవాళ్లు పార్టీలో ఉండనవసరం లేదు. తెలుగుదేశం పార్టీతో పొత్తు పదేళ్లు కొనసాగవలసిన అవసరం ఉన్నది'. ఈ రకమైన సుభాషితాలు విశదం చేస్తున్న విషయమేమిటి? తెలుగుదేశంతో ఇంకో పదేళ్ల పాటు పొత్తుకు డీల్ కుదిరిందనే కదా!

ఈ డీల్ వల్ల జనసేనకు ఒనగూరే ప్రయోజనమెంత? ఎన్ని అసెంబ్లీ సీట్లు దక్కనున్నాయి. ముఖ్యమంత్రి పదవి జనసేనకు ఎన్నేళ్లు... టీడీపీకి ఎన్నేళ్లు? ఇటువంటి ప్రశ్నలు అడగొద్దనే ఉద్దేశంతోనే సొంత పార్టీ అభిమానుల ముందరి కాళ్లకు పవన్ ముందుగానే బంధనాలు వేశారు. దాటవేత పద్ధతిలో సొంత పార్టీ వారిని ఏమార్చుతూ వచ్చారు. 'ముందుగా సీట్లు గెలవాలి. ఎక్కువ సీట్లు గెలిస్తేనే కదా ముఖ్యమంత్రి పదవిని అడగగలం... ముందు ఎక్కువ సీట్లలో జనసేనను గెలిపించండ'ని కార్యకర్తల పైనే పవన్ ఎదురుదాడి చేస్తూ వచ్చారు. సరే, పొత్తులో భాగంగా మనం ఎన్ని సీట్లలో పోటీ చేయబోతున్నామని కార్యకర్తల ప్రశ్న. ముఖ్యమంత్రి పదవి దక్కేంతగా మెజారిటీ సీట్లు తీసుకోబోతున్నామా? పోనీ హరిరామజోగయ్య వంటి శ్రేయోభిలాషులు చెబుతున్నట్టుగా కనీసం 60 సీట్లు?

జనసేనకు అంత సీన్ లేదని తెలుగుదేశం పార్టీ కో-పైలట్‌గా భావించుకుంటున్న లోకేశ్‌బాబు కుండబద్దలు కొట్టారు. గత ఎన్నికల్లో లోకేశ్ ఒక్క సీట్లోనే ఓడిపోతే పవన్ రెండుచోట్లా ఓడిపోయారు. అందువల్ల ఆ మాత్రం చులకన భావం లోకేశ్‌కు సహజం. కచ్చితంగా 150 సీట్లలో తెలుగుదేశం అభ్యర్థులే ఉంటారని తాజాగా ఒక వెబ్ చానల్ ఇంటర్వ్యూలో లోకేశ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పదవి షేరింగ్ అనే సమస్యే రాదనీ, అటువంటి ప్రస్తావనే రాలేదనీ, చంద్రబాబే తమ ముఖ్యమంత్రి అభ్యర్థనీ లోకేశ్ ఆ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉండాలని పవన్ కూడా అంగీకరించినట్టు లోకేశ్ వెల్లడించారు.

లోకేశ్‌బాబు ఇంటర్వ్యూ సారాంశం ప్రకారం గరిష్ఠంగా 25 అసెంబ్లీ సీట్లను జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నది. అందులో కూడా సగంమంది అభ్యర్థులకు కొత్తగా జనసేన తీర్థమిచ్చి టీడీపీ సమకూర్చుతుందని విశ్వసనీయ సమాచారం. మిగిలిన పది, పన్నెండుమంది ఎంపికను కూడా టీడీపీ నాయకత్వం ఆమోదించవలసి ఉంటుంది. ఇంత అవమానకరమైన ఒప్పందానికి ఏ రాజకీయ పక్షమైనా ఒప్పుకుంటుందా? ఇంకేదో మనకు తెలియని కోణం ఉన్నందువల్లనే ఇటువంటి పొత్తులు సాధ్యమవుతాయి. ఏమిటా కోణం? అదో సింగపూర్ రహస్యమంటారు జనసేన వ్యవహారాలు బాగా తెలిసినవాళ్లు. చిదంబర రహస్యం గురించి విన్నాం గానీ ఈ సింగపూర్ రహస్యం ఏమిటో అంతుపట్టడం లేదు. చంద్రబాబుకు సింగపూర్‌తో వ్యాపార సంబంధాలు చాలాకాలం నుంచి ఉన్నాయనేది బహిరంగమే. బహుశా రాజకీయ లావాదేవీలను కూడా అక్కడి నుంచి నరుక్కొస్తారేమో!

ఈ కోణాల సంగతీ, కుంభకోణాల సంగతీ పక్కన పెడదాం. వైసీపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని చెప్పుకొని, రాష్ట్రంలో ఉన్న మరో బలమైన సామాజికవర్గపు ఆకాంక్షలతో ఊపిరిపోసుకున్న పార్టీ నిజస్వరూపం ఇలా వెల్లడైతే దాన్ని నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటి? జనసేన నాయకత్వాన్ని గుడ్డిగా నమ్ముకుంటూ వస్తున్న క్షేత్రస్థాయి జనసేన కార్యకర్తల్లో చాలామందికి లోకేశ్‌బాబు తాజా ఇంటర్వ్యూ కళ్లు తెరిపించి ఉండాలి. వారి మనోభావాలనే హరిరామ జోగయ్య లేఖ రూపంలో పవన్ కల్యాణ్‌కు చేరవేశారు. 'లోకేశ్ చెప్పిన మాటలకు మీ ఆమోదం ఉన్నదా' అని లేఖలో జోగయ్య ప్రశ్నించారు. 'మీరు ముఖ్యమంత్రి కావాలనీ, అధికారం చేపట్టడం ద్వారా బడుగు బలహీన వర్గాలు యాచించే స్థితి నుంచి శాసించే స్థాయికి రావాలనీ కలలు కంటున్న జనసైనికుల కలలు ఏం కావాలనుకుంటున్నార'ని కూడా ఆయన ప్రశ్నించారు. చివరకు 60 సీట్లకు తగ్గకుండా పొత్తులో భాగంగా దక్కించుకోవాలని పవన్ కల్యాణ్‌కు ఆయన సూచించారు.



లోకేశ్‌బాబు ఇంటర్వ్యూ సారాంశం ప్రకారం గరిష్ఠంగా 25 అసెంబ్లీ సీట్లను జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నది. అందులో కూడా సగం మంది అభ్యర్థులకు కొత్తగా జనసేన తీర్థమిచ్చి టీడీపీ సమకూర్చుతుందని విశ్వసనీయ సమాచారం. మిగిలిన పది, పన్నెండుమంది ఎంపికను కూడా టీడీపీ నాయకత్వం ఆమోదించవలసి ఉంటుంది. ఇంత అవమానకరమైన ఒప్పందానికి ఏ రాజకీయ పక్షమైనా ఒప్పుకుంటుందా? ఇంకేదో మనకు తెలియని కోణం ఉన్నందువల్లనే ఇటువంటి పొత్తులు సాధ్యమవుతాయి. ఏమిటా కోణం? అదో సింగపూర్ రహస్యమంటారు జనసేన వ్యవహారాలు బాగా తెలిసినవాళ్లు. చిదంబర రహస్యం గురించి విన్నాం గానీ ఈ సింగపూర్ రహస్యం ఏమిటో అంతు పట్టడం లేదు. చంద్రబాబుకు సింగపూర్‌తో వ్యాపార సంబంధాలు చాలాకాలం నుంచి ఉన్నాయనేది బహిరంగమే. బహుశా రాజకీయ లావాదేవీలను కూడా అక్కడి నుంచి నరుక్కొస్తారేమో!

పవన్ కల్యాణ్‌తో వ్యవహరించే తీరుపై పెదబాబు, చినబాబుల అభిప్రాయాల్లో కొద్దిగా తేడాలున్నాయట! కనీసం 30 సీట్లన్నా ఇవ్వకపోతే జనసైనికులకు సర్దిచెప్పడం కష్టమన్న పవన్ వైఖరి పట్ల చంద్రబాబు ఒకింత సానుభూతిగా ఉన్నట్టు సమాచారం. అయితే ఆ సీట్లు 20 దాటకూడదని లోకేశ్‌బాబు గట్టి పట్టుదలతో ఉన్నారు. చంద్రబాబు జైలుకెళ్లిన సందర్భంలో అరెస్టు భయంతో చినబాబు ఢిల్లీలో తలదాచుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రశాంత్ కిశోర్‌తో (పీకే) స్నేహం కుదిరింది. ఎన్నికల్లో ఈసారి తమకు వ్యూహకర్తగా పనిచేయాలని పీకేను లోకేశ్ అడిగారట! ఇప్పటికే పీకే టీమ్‌లో పనిచేసిన రాబిన్‌సింగ్ తెలుగుదేశం వ్యూహకర్తగా పనిచేస్తున్నారు.

ఢిల్లీలో జరిగిన భేటీ సందర్భంగానే పవన్ కల్యాణ్‌ను అతిగా ఊహించుకోవద్దనీ, అతనికి కాపు సామాజికవర్గంలో కూడా పెద్దగా బలం లేదనీ పీకే లోకేశ్‌కు చెప్పినట్టు తెలిసింది. జనసేనకు ఎన్ని ఎక్కువ సీట్లిస్తే అంత ఎక్కువ నష్టం జరుగుతుందని తన అభిప్రాయంగా చెప్పారట! అయితే వ్యూహకర్తగా పనిచేయడానికి తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, తన సమాచారం ప్రకారం వైసీపీ మరోసారి గెలిచే అవకాశాలున్నట్టు చెప్పారట! అప్పటినుంచీ పీకేను వ్యూహకర్తగా ఒప్పించడం కోసం లోకేశ్ రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు.

పీకే సలహా మేరకు 20 లోపు స్థానాలకే జనసేనను పరిమితం చేయాలని లోకేశ్ పట్టుదలగా ఉండడంతో విషయం తెలిసిన పవన్ కల్యాణ్ పాదయాత్ర ముగింపు సభకు తాను రానని బెట్టు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు సభకు రావడానికి అంగీకరించిన పవన్ మొండికేయడంతో చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లి అనునయించారట! ఇతరత్రా ఒప్పందాల సంగతి తెలియదు గానీ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 25కు పెంచి ఇస్తామని బాబు హామీ ఇచ్చినట్టు తెలిసింది. జనసైనికుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుందని భయపడినప్పటికీ ఆ సంఖ్యకు ఒప్పుకోక తప్పలేదు. ఆ బాడీ లాంగ్వేజ్‌లో కూడా అప్పటి వాతావరణ ప్రభావం కనిపించింది. చంద్రబాబును సాగనంపడానికి బయటకొచ్చిన పవన్ దూరంగా నిలబడి ఉండగా నాదెండ్ల మనోహర్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ బాబుకు వీడ్కోలు చెప్పడం కనిపించింది.

ఎట్టకేలకు లోకేశ్ పాదయాత్ర ముగింపు సభకు పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఆ సభకు పెట్టుకున్న పేరు విజయోత్సవ సభ. లైవ్‌లో కార్యక్రమాన్ని చూసిన వారంతా ఏకగ్రీవంగా చెప్పిన మాట ఏమిటంటే – అది విజయోత్సవ సభ కాదు, సంతాప సభలా ఉన్నదని! పోనీ పాదయాత్ర తొలి రోజున చనిపోయిన తారకరత్న సంతాప సభగా దాన్ని మార్చారా అంటే అదీ లేదు. అతని పేరు తల్చుకున్నవారే లేరు. కానీ వేదిక మీదున్న నాయకుల ముఖాలు మాత్రం దీనంగా వేలాడుతూ కనిపించాయి. అందుకు సభ ఫెయిల్యూర్ ఒక కారణం కావచ్చు. ఆరు లక్షలమందిని సమీకరించి ఒక బలమైన ముద్ర వేయాలని టీడీపీ గట్టిగా సంకల్పించింది. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. ఏం జరిగిందో తెలియదు. సభకు నలభై నుంచి యాభైవేల మంది వరకు వచ్చి ఉంటారని తేలింది. చంద్రబాబు ప్రసంగించే సమయంలో పట్టుమని పదివేల మంది లేరు. ఇదీ రాష్ట్రంలో తెలుగుదేశం – జనసేనల ఉమ్మడి ప్రభావం. ఇక సంతాప వాతావరణానికి రెండో కారణం – పొత్తులో కత్తుల వ్యవహారం కావచ్చు.

జనసేన శ్రేణుల్లో ఒకపక్క అసంతృప్తి రాజుకుంటున్న తరుణంలోనే హఠాత్తుగా ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ ఊడిపడ్డారు. బీజేపీ తరఫున రాజ్యసభలో ఉన్న సీఎమ్ రమేశ్‌కు చెందిన ప్రైవేట్ విమానంలో లోకేశ్, కిలారు రాజేశ్‌లతో కలిసి ఆయన విజయవాడకు వచ్చారు. చంద్రబాబును కలుసుకున్నారు. రకరకాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ భేటీపై ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం రెండు రకాలుగా ఉన్నది. తెలుగుదేశం – జనసేన కూటమి మాత్రమే వైసీపీతో తలపడటానికి సరిపోదనీ, ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ – కమ్యూనిస్టులను కూడా కలుపుకొని వెళ్లాలని చెప్పడానికే చంద్రబాబును పీకే కలిశారని ఒక సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఇంతకంటే వింత ఇంకోటి ఉండదు. వచ్చింది బీజేపీ ఎంపీ విమానంలో! రాచకార్యం కాంగ్రెస్ కోసం!!

జనసేన శ్రేణుల్లో ఒకపక్క అసంతృప్తి రాజుకుంటున్న తరుణంలోనే హఠాత్తుగా ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ ఊడిపడ్డారు. బీజేపీ తరఫున రాజ్యసభలో ఉన్న సీఎమ్ రమేశ్‌కు చెందిన ప్రైవేట్ విమానంలో లోకేశ్, కిలారు రాజేశ్‌లతో కలిసి ఆయన విజయవాడకు వచ్చారు. చంద్రబాబును కలుసుకున్నారు. రకరకాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ భేటీపై ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం రెండు రకాలుగా ఉన్నది. తెలుగుదేశం – జనసేన కూటమి మాత్రమే వైసీపీతో తలపడటానికి సరిపోదనీ, ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ – కమ్యూనిస్టులను కూడా కలుపుకొని వెళ్లాలని చెప్పడానికే చంద్రబాబును పీకే కలిశారని ఒక సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఇంతకంటే వింత ఇంకోటి ఉండదు. వచ్చింది బీజేపీ ఎంపీ విమానంలో! రాచకార్యం కాంగ్రెస్ కోసం!!

ఇప్పటికే టీడీపీ కోసం పనిచేస్తున్న రాబిన్‌సింగ్ టీమ్ పూర్వాశ్రమంలో ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోనే పనిచేసినందున... వారితో మాట్లాడి సలహాలిచ్చేందుకు రావలసిందిగా లోకేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు వచ్చాడని మరో సమాచారం. చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశానికి రాబిన్‌సింగ్ టీమ్ కూడా హాజరైంది. గతంలో వైసీపీ విజయం కోసం పనిచేసిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు తమవైపున పనిచేస్తున్నాడని మైండ్ గేమ్ ఆడేందుకే ఈ భేటీని ఏర్పాటు చేసినట్టు వినపడుతున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం మానేశానని ప్రశాంత్ కిశోర్ గతంలోనే చెప్పారు. కానీ పేరు వాడుకుని మైండ్ గేమ్ ఆడాలనుకోవడం నదిలో కొట్టుకొని పోయేవాడు గడ్డిపోచను చూసి ఆశపడిన చందం!

ఇప్పటికే టీడీపీ కోసం పనిచేస్తున్న రాబిన్‌సింగ్ టీమ్ పూర్వాశ్రమంలో ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోనే పనిచేసినందున... వారితో మాట్లాడి సలహాలిచ్చేందుకు రావలసిందిగా లోకేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు వచ్చాడని మరో సమాచారం. చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశానికి రాబిన్ సింగ్ టీమ్ కూడా హాజరైంది. గతంలో వైసీపీ విజయం కోసం పనిచేసిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు తమవైపున పనిచేస్తున్నాడని మైండ్ గేమ్ ఆడేందుకే ఈ భేటీని ఏర్పాటు చేసినట్టు వినపడు తున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం మానేశానని ప్రశాంత్ కిశోర్ గతంలోనే చెప్పారు. కానీ పేరు వాడుకుని మైండ్ గేమ్ ఆడాలనుకోవడం నదిలో కొట్టుకొనిపోయేవాడు గడ్డిపోచను చూసి ఆశపడిన చందం! వ్యూహకర్తలే ఎన్నికల్లో గెలిపించేట్లయితే పార్టీలను మూసేసుకుని నాయకులు వ్యూహకర్తలనే ఆశ్రయించేవారు. అంబటి రాంబాబు చెప్పినట్టు మెటీరియల్ మంచిది కానప్పుడు మేస్త్రీ ఏం చేస్తాడు?

ఈ పీకే భేటీ సంగతేమోగానీ, ఈ పరిణామం మన పీకే (పవన్ కల్యాణ్) పీకకు చుట్టుకుంటుందేమో చూడాలి. అసలే పార్టీ నుంచి వరసగా జారుకుంటున్నారు. కీలకమైన కాపు సామాజికవర్గం నేతలే తాము ఈ పార్టీలో ఇమడగలిగే పరిస్థితి లేదని బహిరంగంగానే కామెంట్లు చేస్తున్నారు. పాతిక సీట్లతోనే పార్టీ నేతలను ఒప్పించలేని పరిస్థితి ఉన్నది. ఇప్పుడు కాంగ్రెస్, లెఫ్ట్ కూడా తోడైతే వాళ్లకిచ్చే నాలుగు సీట్లు కూడా తన ఖాతా లోంచే కోత పడతాయి. పైగా బీజేపీ మీద అపారమైన అభిమానాన్ని కురిపిస్తూ ఎన్డీఏ కూటమి సభ్యుడిగా చేరిన పవన్ 'ఇండియా' కూటమిని అంగీకరిస్తారా? ఆ పరిస్థితి ఎదురైతే తెగతెంపులు చేసుకుని బీజేపీతో కలిసి పోటీ చేస్తారా? తెగతెంపులు చేసుకునేంత సాధారణమైన సంబంధమే తెలుగుదేశంతో ఉన్నదా? ఇవన్నీ సందేహాలే. తెలుగుదేశం పార్టీ 'ఇండియా' కూటమిలో చేరే అవకాశం లేదనే అనుకుందాం. ఎందుకంటే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏనే వస్తుందని బాబుతో పీకే చెప్పినట్టు సమాచారం. అసలే బీజేపీ అంటేనే బాబు ఝడుసుకుంటున్నారు. మరో దారి లేకపోతే తప్ప 'ఇండియా' కూటమిలో చేరే నిర్ణయాన్ని బాబు తీసుకోలేరు. కేవలం సలహాలు ఇవ్వడానికే పీకే బాబును కలిశాడనుకుందాము. ఆయన సలహా మేరకు కుదించిన సీట్లతో జనసైనికులను మన పీకే సంతృప్తిపరచగలరా? పదేళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న ఆశావహుల ఆగ్రహాన్ని అదుపు చేయగలరా? తనకు ముఖ్యమంత్రి పదవి అవసరం లేదనీ, చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలనీ బహిరంగంగా ప్రకటించి కాపు సామాజికవర్గం ఆకాంక్షలపై నీళ్ల చల్లి పార్టీని నిలబెట్టుకోగలరా?

vardhelli1959@gmail.com

ఎల్.కె. అద్వానీ (బీజేపీ అగ్రనేత)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇన్విటేషన్ ఇవ్వడం కోసం ఇల్లు వెతుక్కుంటూ వస్తారు ఎవరైనా! ఇన్విటేషన్ ఇవ్వకుండా ఉండటం కోసం ఢిల్లీలోని '30, పృథ్వీరాజ్ రోడ్డు'లో నేనుంటున్న ఇంటిని వెతుక్కుంటూ వచ్చారు చంపత్ రాయ్! రామజన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఆయన. వీహెచ్‌పీ లీడర్.

లోపల హాల్లో ఉన్నాన్నేను.

"నాన్నగారూ! చంపత్ అంకుల్ వచ్చారు..." అంటూ, చంపత్‌ని నేనున్న చోటుకు నడిపించుకుని వచ్చింది ప్రతిభ.

నిజానికి నడిపించుకుని రావడానికి ఆయనేమీ నడవలేని స్థితిలో లేరు. నా 96 ఏళ్ల వయసులో నేను నడవలేని స్థితిలో ఉండి ఉంటానని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తూ ఉండటం వల్లనో ఏమో, నా స్థితికి తగినట్లుగా తన స్థితిని మార్చుకోవడం కోసం నా దగ్గరికి వస్తున్నప్పుడు తన నడక వేగాన్ని తన 77 ఏళ్ల వయసుకు తగని విధంగా బాగా ఎక్కువగా తగ్గించుకున్నట్లున్నారు! విశ్వహిందూ పరిషత్ నుండి వచ్చేవాళ్లు ఇలా 'మార్గదర్శక్ మండల్' పెద్దల్ని గౌరవించడం మామూలే. బతికుండగా



అటల్ బిహారి వాజ్‌పేయిని కూడా వారు తరచూ ఇలాగే గౌరవిస్తుండేవారు. ఇప్పుడు నా దగ్గర్నుంచి '6, రైసినా రోడ్డు'లోని మురళీ మనోహర్ జోషీ ఇంటికి వెళ్లాక అక్కడ ఆయన్ని కూడా ఇలాగే గౌరవిస్తారు.

"రండి చంపత్‌జీ! కూర్చోండి" అన్నాను.

చంపత్ చేతుల్లో పసుపు రాసిన ఎరుపు రంగు కవర్లు ఉన్నాయి. వెంటనే వాటిల్లోంచి ఒక కార్డు తీసి నాకేమీ ఇవ్వలేదు ఆయన.

"పంచాల్సిన కార్డులు ఇంకా చాలా ఉన్నాయి అద్వాణీజీ! జనవరి 16న ప్రాణ ప్రతిష్ఠ పెట్టుకున్నాం..." అన్నారు!

పెట్టుకోవడమా!!

ప్రాణ ప్రతిష్ఠను ఆయన శ్రీరాముడికి, వీహెచ్‌పీకి... లేదా శ్రీరాముడికీ, శ్రీ నరేంద్ర మోదీజీకి మధ్య మాత్రమే జరిగే వంశవృక్ష మహోత్సవంలా నిర్వహించదలచినట్లున్నారు!

"మీరు అంత దూరం రాగలిగితే మంచిదే కానీ, రాకపోవడమే మంచిదేమో అద్వాణీజీ. పైగా ఎముకలు కొరికే ఈ చలిగాలులొకటీ..!" అన్నారు చంపత్.

నాకర్థమైంది. ఆయన నన్ను రావద్దని అనడం లేదు. రావాల్సిందేననీ అనడం లేదు.

నవ్వుతూ ఆయన వైపు చూశాను.

"నాకెప్పుడూ ఒకటి అనిపిస్తుంటుంది అద్వాణీజీ... గొప్పవాళ్లంతా ఒక వరుసలో జన్మిస్తారని! మీరు నవంబర్‌లో జన్మించారు. వాజ్‌పేయి డిసెంబర్‌లో జన్మించారు. జోషీజీ జనవరిలో జన్మించారు..." అన్నారు చంపత్!

"మంచి పరిశీలన..." అన్నాను నవ్వుతూ.

"వస్తాను అద్వాణీజీ! ఇంకా అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, మాధురీ దీక్షిత్, రామ్‌దేవ్ బాబా, అంబానీ బ్రదర్స్ మరికొంత మంది నా వాటాగా మిగిలిపోయారు..." అన్నారు చంపత్ రాయ్, పైకి లేస్తూ!

మరి నేను, జోషి ఎవరి వాటాలో ఉన్నట్లు?!

"చంపత్‌జీ! నాకైదేనా చెప్పాలని వచ్చి చెప్పకుండా వెళ్లిపోతున్నారా? అని అడిగాను చంపత్‌ని... ఇవ్వాలని వచ్చి ఇవ్వకుండా పోతున్నారా అని అడిగితే బాగోదని!

"అదే చెప్పబోతున్నా అద్వాణీజీ! నేను వెళ్లాక ఎవరైనా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి ఇన్విటేషన్ ఇస్తే తీసుకోండి కానీ, రాలేనని మాత్రం చెప్పకండి. ట్రై చేస్తానని చెప్పండి. ఇది చెప్పడానికే వచ్చాను..." అని కార్డులు లెక్క చూసుకుంటూ నడక వేగం పెంచారు చంపత్.

చంపత్ చెప్పినట్లే వీహెచ్‌పీ నుంచి అలోక్ కుమార్, రామ్‌లాల్, కృష్ణగోపాల్ వచ్చి, కార్డులు ఇచ్చి వెళ్లారు! వాళ్లటు వెళ్లగానే జోషీకి ఫోన్ చేశాను.

"జోషీజీ! కార్డు ఇవ్వకుండా రమ్మని చెప్పడం, రమ్మని చెప్పకుండా కార్డు ఇవ్వడం.. రెండిట్లో ఏది మన 'మార్గదర్శక్ మండల్'లోని వారికి గొప్ప గౌరవం?" అని అడిగాను.

జోషీ నవ్వారు. "అది అడగడానికే మీకు ఫోన్ చేయబోతున్నాను అద్వాణీజీ... ఈలోపు మీరే నాకు ఫోన్ చేశారు..." అన్నారాయన.

ఈ – కామర్స్ వర్తక శకంలో...

సందర్భం



దాసరి ఇమ్మానియేలు

వస్తువులు లేదా సేవలు కొనుగోలు చేసే విపణిలో ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగదారులే. మారుతున్న కాలాన్ని బట్టి నేడు సామాన్యుడు సైతం అంతర్జాలంలో వస్తువులు, సేవలు కొనుగోలు చేస్తున్నారు. డిజిటల్ రూపంలో నగదు చెల్లింపుల లావాదేవీలు పెరుగుతున్నాయి. ఇది ఎంతో ఉపయుక్తంగా ఉన్నా.. నేరస్థులకు నగదు దోచుకునేందుకు దగ్గరిదారిగా మారింది. గత ఏడాది మనదేశంలో 14 లక్షల సైబర్ నేరాలు జరగడం దీనికి తార్కాణం.

'వినియోగదారుల రక్షణ చట్టం –2019'లో 'ఈ-కామర్స్' లావాదేవీలను స్పష్టంగా నిర్వచించడం జరిగింది. 'డిజిటల్ లేదా ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ ఉత్పత్తులతో సహా వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం' ఈ-కామర్స్‌గా నిర్వచించబడింది.

'మీకు లాటరీలో బహుమతి వచ్చింద'నీ; 'కారు, టీవీ, మోటార్ సైకిల్ గెలుచుకున్నార'ంటూ తప్పుడు ప్రకటనల ద్వారా సైబర్ నేరస్థులు రెచ్చిపోతున్నారు. నిరుద్యోగులే కాదు ఇందులో ఉన్నత చదువులు చదువుకున్న వైద్యులు, ఇంజనీర్లు సైతం చిక్కుకుంటున్నారు. ఇటీవల హైదరాబాదుకు చెందిన యువ వైద్యునికి రోజుకు రూ. 5 వేలు సంపాదించవచ్చంటూ రూ. 20 లక్షల రూపాయలు కాజేసిన ఘటన తెలిసిందే. గ్యాస్ ఏజెన్సీలు ఇస్తా మనీ; హోటళ్ళకు, సినిమాలకు రేటింగ్ ఇస్తామనీ, వ్యాపారంలో భాగస్వామ్యం అనే ప్రకటనలతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారు. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక-2021 ప్రకారం చూస్తే, గత ఐదేళ్ళలో సైబర్ నేరాల సంఖ్య 141 శాతం పెరిగింది.

న్యాయమైన వాణిజ్య పద్ధతుల్లో ఆర్థికంగా నష్టం చేకూర్చడం, వినియోగదారులను మోసం చేయడం ద్వారా వినియోగదారుల హక్కులకు ఆటంకం కలిగించే సంస్థలు/కంపెనీలు/వ్యాపారుల గురించి ప్రజలకు తెలియజెప్పడం కోసం భారత్ 1986 డిసెంబర్ 24న 'వినియోగదారుల రక్షణ చట్టా'న్ని తెచ్చింది. ఆ రోజును ప్రతి ఏడాదీ 'జాతీయ వినియోగదారుల హక్కుల దినం'గా పాటిస్తున్నారు. భద్రత హక్కు, ఎంచుకునే హక్కు, సమాచారం పొందే హక్కు, వినే హక్కు, పరిహారం కోరుకునే హక్కు, వినియోగదారుల విద్య హక్కులను పరిరక్షించడానికీ, వినియోగదారుల ప్రయోజనాలకు హాని కలిగించే లేదా తప్పుదారి పట్టించే ప్రకటనలకు సంబంధించిన విషయాలను నియంత్రించడానికీ 2020 జూలై 20 నుండి 'సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ' (సీసీపీఏ) స్థాపించబడింది. చెల్లుబాటు అయ్యే ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్ఐ) మార్క్ లేని వస్తువులను కొనుగోలు చేయకుండా వినియోగదారులను హెచ్చరిస్తూ ఈ సంస్థ రెండు భద్రతా నోటీసులను కూడా జారీ చేసింది.

ఆన్‌లైన్ షాపింగ్ చేసే చాలా మంది వ్యక్తులు తప్పుడు లేదా తప్పుదారి పట్టించే ప్రకటనలు, లోపభూయిష్ఠ ఉత్పత్తులు, ఉత్పత్తుల నకిలీ డెలివరీలు, అసురక్షిత ఉత్పత్తులు, చెల్లింపు సమస్యలు, భద్రత- గోప్యతా సమస్యలు, ఏకపక్ష ఒప్పందాలు వంటి వాటి కారణంగా బాధితులుగా మారారు. కానీ, అధికార పరిధుల సమస్యల కారణంగా చట్టాలను సరిగా అమలు చేయకపోవడం వల్ల బాధిత వినియోగదారులను రక్షించడంలో చట్టాలు విఫలమవుతున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలతో వ్యవహరించేటప్పుడు నేటి జనాభా ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలక్ట్రానిక్ ఒప్పందాలను నియంత్రించేందుకు వినియోగదారుల రక్షణ చట్టం –2019లో అనేక అంశాలు చేర్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినియోగదారుల రక్షణ చట్టం– 2019ని బలోపేతం చేసేందుకు పాఠశాలలో విద్యార్థులతో సుమారు 6,000 వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటు చేయడం జరిగింది. వినియోగదారుల వ్యవహారాలపై, ఆహార, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వారికి అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు ఈ చట్టంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుండే చట్టంపై అవగాహన కలిగించేందుకు 'మేము సైతం' అనే పుస్తకాన్నీ, సుమారు 10 రకాలైన గోడపత్రాలను పౌర సరఫరాల శాఖ రూపొందించింది. తూనికలు కొలతల శాఖ వారు 3 రకాలైన గోడపత్రాలను రూపొందించడం జరిగింది. గోడపత్రాలనూ పాఠశాలతో పాటు గ్రామ/వార్డు సచివాలయాలలో, పెట్రోలు బంకులలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరింతగా ఈ చట్టం పట్ల అవగాహన ప్రజలలో కల్పించేందుకు 'మేలుకొలుపు' అనే మాస పత్రికను కూడా పౌర సరఫరాల శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం పట్ల ప్రజలందరికీ అవగాహన ఉంటే కొనుగోలు చేసే వస్తువులు / సేవలు / ఆన్‌లైన్ లావాదేవీలలో జరిగే నష్టాలకు పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

వ్యాసకర్త ఏపీ వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ । 90599 90345 (నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం)

జ్యోతిర్గముడు

చుక్కల దివిలోపల ఎం
చక్కగ పూచిన సుమంపు చుక్కలొ యనగా
దిక్కుల జీవన వర్షపు
చుక్కలొ యన రాలె దూత చుక్కలు భువిలోన్

పరలోకం తోటలో చక్కగా పూచిన చుక్కలేమో అన్నట్టుగా... నాలుగు దిక్కుల్నీ పోషించడానికై కురిసిన వర్షపు చుక్కలేమో అన్నట్టుగా... దివినుండి భువిపైకి దూతలు చిన్నగా దిగారు అనేది ఇందులోని భావం.

ప్రభువు పుట్టిన సందర్భంలో జరిగిన దూతల రాక, అటు పారమార్థిక భూషణాల్నీ, ఇటు సంబంధ పోషణాల్నీ ముడేసుకొని ఉంది. దైవ మానుష స్వరూపుడైన ప్రభువు అవతార రహస్యం కూడా ఇందులో ధ్వనిస్తూ ఉంది.

ఇంతకూ ప్రభువు దేవుడా? మానవుడా? ఆయనలో ఇద్దరూ ఉన్నారు. అంటే రెండు స్వభావాలూ ఉన్నాయి. దైవ పుత్రుడు. మానవకన్య మరియమ్మ. మానవుణ్ణి దేవునిగా తనలా మార్చేయ డానికై వచ్చాడు. ఆయన చూస్తే గుణ త్రయ స్వభావుడు. (త్రిమూర్తి స్వరూపుడు)

'ట్రినిటీ' త్రిత్వైక స్వభావం... తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ దేవునిగా క్రైస్తవులు నమ్ముతారు. ఆయన అద్భుతాలు చేసినపుడు దైవ స్వభావం, హింసింపబడి మరణించినపుడు మానవ స్వభావాలు కనిపిస్తాయి. రెండూ ఎందుకయ్యా అంటే, మానవ జీవితాల్ని మహోన్నతంగా తీర్చిదిద్దడానికి ఒక ఆదర్శ ప్రయోగం చేసి చూపిన మహనీయుడు క్రీస్తు ప్రభువు. ఆయన పలికిన ప్రతి పలుకూ ఒక వెలుగుల వర్షమే! ఆయన ప్రసంగం వింటే అమృతం త్రావిన చిరంజీవులే! ఆయన చేసి చూపిన మార్గం మానవాళికి ఒక మహోన్నత సత్య మార్గం. తమస్సును చీల్చుకొంటూ లోకానికి ఉషస్సు పంచిన జ్యోతిర్గముడు ప్రభువు.

– బెర్నార్డ్ రాజు



కరుణోదయం

డిసెంబర్ ఇరువది ఐదున
ప్రియ బాల యేసు పుట్టె
పశువుల పాక తొట్టెలోన!

నవ జాత శిశువులోని
దివ్య తేజమును కాంచి
మేరీమాత మరి మరీ మురిసె!

మానవ రూపాన ధరణిలో
కరుణామయుడు జన్మించాడని
దేవ దూతలు దివ్యవాణిని పలికిరి!

తార చూపిన దారిలో యోజనాలు నడిచి
జ్ఞానులు వచ్చిరి నజరేయుడు దరికి!

– జి. సూర్యనారాయణ

ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అరాచకం

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,182వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



తాడికొండ: ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని చంద్రబాబు రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,182వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి ప్రసంగించారు. 14 ఏళ్ల చంద్రబాబుకు అధికారమిస్తే పేదలను నిరుపేదలుగా మార్చి, కొంతమంది వ్యక్తులు, పెట్టుబడిదారులకు ఊడిగం చేసి రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన మోసాలు కప్పిపుచ్చుకునేందుకు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో బాబు సొంత డబ్బా కొట్టుకోవడం దుర్మార్గమన్నారు. కులవాదమే అజెండాగా రాష్ట్రంలో రాజకీయాలు చేసిన బాబును చూసి ఈసడించుకున్న ప్రజలు గత ఎన్నికల్లో విసిరి పారేసినా తిరిగి అధికారం కోసం అందరి కాళ్లు పట్టుకొని ప్యాకేజీ పార్టీలను వెంటబెట్టుకొని తప్పుడు మార్గంలో గెలిచేందుకు యత్నిస్తున్నాడని విమర్శించారు. ఆయన రాజకీయాలకు ఇక చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అరటికి ప్రభుత్వం అధిక ప్రోత్సాహం

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఉద్యాన పరిశోధన స్థానం లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కొవ్వూరు: అరటి సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ అరటికి ప్రాధాన్యతనిస్తూ ఈ ఏడాదిని అరటి సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానంలో శనివారం 'అరటి సంవత్సరం' ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కాకాణి మాట్లాడుతూ 2023–24ను అరటిసాగు ప్రోత్సాహక సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా 42 సంస్థల్లో రైతులకు అరటి రకాలపై శిక్షణ అందించామన్నారు. ఉద్యాన పంటల్లో అరటి సత్ఫలితాలను అందిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా పథకాన్ని కాదని రాష్ట్రంలో అన్ని పంటలకు బీమా సదుపాయం కల్పించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నామని, ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం చెల్లిస్తున్నామని వివరించారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం వైస్ చాన్సలర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ అరటిసాగులో సేంద్రీయ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులకు ఏటా 13 లక్షల వరకు టిష్యూకల్చర్ అరటి మొక్కలను అందిస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయిలో అరటి రైతులకు అవగాహన కల్పించామన్నారు. రాష్ట్రంలో అరటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. తొలుత అరటి పరిశోధన స్థానంలో అరటి, కంద, పెండలం ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ను మంత్రి ప్రారంభించారు. పలువురు సైంటిస్టులు, యూనివర్సిటీ అధికారులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి ముఠా గుట్టురట్టు

రూ.30 లక్షల విలువైన 7.22 కిలోలు, రూ.23.50 లక్షల నగదు స్వాధీనం



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): లిక్విడ్ గంజాయి తయారీ ముఠా గుట్టురట్టయింది. ఈ ముఠాలో కీలకమైన వ్యక్తిని అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలంలోని అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.30 లక్షల విలువైన లిక్విడ్ గంజాయితోపాటు రూ.23.50 లక్షల నగదు, తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. మండలంలోని లోతుగెడ్డ బ్రిడ్జి మీదుగా శనివారం లిక్విడ్ గంజాయి తరలిస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణకు సమాచారం వచ్చింది. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో ఎనిమిది ప్యాకెట్ల లిక్విడ్ గంజాయి (7.227 కిలోలు)ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఆ వ్యక్తి జి.మాడుగుల పంచాయతీ అలగం గ్రామానికి చెందిన ఓలంగి రాజారావుగా గుర్తించినట్టు అదనపు ఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ తెలిపారు. అనంతరం విచారణ చేపట్టగా గొప్పుగొడుసులు గ్రామానికి చెందిన రాంబాబు, ఓలంగి రాజారావు ఈ లిక్విడ్ గంజాయిని కిలోల ప్యాకెట్లుగా తయారు చేసి తమిళనాడు, కర్నాటకకు చెందిన వ్యక్తులకు చింతపల్లి మండలం, సిరిపురం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి ద్వారా విక్రయించేవారు. ఈ క్రమంలోనే ఆ ప్యాకెట్‌లను విక్రయించేందుకు వస్తున్న రాజారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మహిళా 'ముద్ర'

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం

- మొత్తం 68 కోట్ల మంది ఓటేస్తారని అంచనా
- అందులో 33 కోట్లు మహిళా ఓటర్లే.. ఇది 49 శాతం
- 2029 నాటికి పోలింగ్‌లో పురుషులను దాటిపోనున్న మహిళా ఓటింగ్
- 2047లో మహిళల ఓటింగ్ 55 శాతానికి పెరుగుతుందని అంచనా
- 2024 నుంచి అత్యధికంగా మహిళలే పోలింగ్‌లో పాల్గొంటారు
- 2024లో మహిళా ఓటర్లలో 67.6 శాతం మంది ఓట్లు వేస్తారు
- 2029లో మహిళా ఓటర్లలో 71.4 శాతం, 2047లో 86.3 శాతం ఓట్లు వేస్తారు
- 1951 నుంచి ఎన్నికల పోలింగ్ శాతం సరళితో ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



సాక్షి, అమరావతి: దేశ ఎన్నికల క్షేత్రంలో మహిళల పాత్ర పెరుగుతోంది. స్త్రీ శక్తి మద్దతు లేనిదే ఏ పార్టీ లేదా ఏ నాయకుడూ విజయం సాధించలేరన్నంతగా ఓటింగ్‌లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర కీలకం కానుంది. ఆ తర్వాత 2029 నుంచి స్త్రీలదే ఆధిపత్యం. ఇది మహిళలు సాధించిన సాధికారత. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించిన విషయమిది. 1951 నుంచి ఎన్నికల పోలింగ్ శాతం సరళితో 2047 వరకు పోలింగ్‌లో మహిళా ఓటర్ల సంఖ్య ఎలా పెరుగుతుందో ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వివరించింది.

2014 లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో పురుషులకన్నా మహిళా ఓటర్లు తక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. ఈ ఎన్నికల పోలింగ్‌లో పురుష ఓటర్లు 67.01 శాతం ఓట్లేయగా, మహిళా ఓటర్లు 67.18 శాతం పాల్గొన్నట్లు ఆ నివేదిక తెలిపింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పురుష ఓటర్లతో మహిళా ఓటర్లు దాదాపుగా సమానంగా ఉంటారని పేర్కొంది. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి 2047 ఎన్నికల వరకు మహిళా ఓటర్లదే హవా. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే వారి సంఖ్య 68 కోట్లకు చేరుతుందని, అందులో 33 కోట్ల మహిళా ఓటర్లుంటారని అంచనా. ఇది మొత్తం పోలింగ్‌లో 49 శాతం. 2029 ఎన్నికల నుంచి పోలింగ్‌లో పాల్గొనే మహిళల సంఖ్య పెరుగుతూ పోతుందని, పురుష ఓటర్ల సంఖ్య తగ్గుతుందని నివేదిక వెల్లడించింది. 2024లో ప్రతి 100 మంది మహిళా ఓటర్లలో 67.6 శాతం ఓట్లు వేస్తారని, -2029లో ప్రతి 100 మంది మహిళా ఓటర్లలో 71.4 శాతం ఓట్లు వేస్తారని, 2047లో ప్రతి వంద మంది మహిళా ఓటర్లలో 86.3 శాతం ఓట్లు వేస్తారని నివేదిక తెలిపింది.

1951 ఎన్నికల్లో 8 కోట్ల మంది మాత్రమే ఓట్లు వేసినట్లు నివేదిక పేర్కొంది. 2009 ఎన్నికల్లో పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య 42 కోట్లకు పెరగ్గా, ఇందులో 19 కోట్ల మంది మహిళలున్నారు. 2014 ఎన్నికల్లో 55 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోగా అందులో 26 కోట్ల మంది మహిళలున్నారని నివేదిక తెలిపింది. 2019 ఎన్నికల్లో 62 కోట్ల మంది ఓట్లు వేయగా అందులో 30 కోట్ల మంది మహిళలని తెలిపింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 68 కోట్ల మంది ఓట్లు వేస్తారని, అందులో 33 కోట్ల మంది మహిళా ఓటర్లుంటారని నివేదిక పేర్కొంది.

ప్రస్తుత పోలింగ్ సరళిని పరిశీలిస్తే 2029 ఎన్నికల్లో 73 కోట్ల మంది ఓట్లు వేస్తారని, ఇందులో 37 కోట్లు మహిళలుంటారని అంచనా వేసింది. 2047 నాటికి 115 కోట్ల మంది ఓటర్లు నమోదవుతారని అంచనా వేయగా అందులో 80 శాతం మంది.. అంటే 92 కోట్ల మంది పోలింగ్‌లో పాల్గొంటారని అంచనా వేసింది. ఇందులో మహిళల ఓటింగ్ 55 శాతానికి పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

మహిళా ఓటర్లదే పెద్ద పాత్ర

భారత దేశ రాజకీయ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని, అలాగే లోక్‌సభ, రాష్ట్రాల ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర గత దశాబ్దంలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా నివేదిక వ్యాఖ్యానించింది. గతంలోకంటే ఇప్పుడు ఎన్నికల్లో మహిళా ఓటర్లు చాలా పెద్ద పాత్ర పోషిస్తారని నివేదిక పేర్కొంది. 1991 నుంచి పురుష, మహిళా ఓటర్ల మధ్య అంతరం తగ్గుతూ వస్తోందని తెలిపింది. 1991లో ఈ అంతరం పది శాతానికి పైగా ఉండగా 1996 నుంచి 2004 వరకు నాలుగు ఎన్నికల్లో 8.4 శాతానికి తగ్గిందని తెలిపింది. గత ఐదేళ్లలో రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటింగ్ శాతం పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. గత ఐదేళ్లలో 23 ప్రధాన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 18 రాష్ట్రాల్లో పురుష ఓట్ల పోలింగ్ శాతం కన్నా మహిళా ఓట్ల పోలింగ్ శాతం అత్యధికంగా ఉందని నివేదిక తెలిపింది. ఈ 18 రాష్ట్రాల్లో పది రాష్ట్రాల్లో అవే ప్రభుత్వాలు తిరిగి ఎన్నికయ్యాయని నివేదిక పేర్కొంది.

1971 నుంచి 2019 వరకు లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పోలైన పురుషులు, మహిళల ఓట్ల శాతం

సంవత్సరం	పురుష ఓట్ల శాతం	మహిళల ఓట్ల శాతం	మొత్తం పోలైన ఓట్ల శాతం
1971	60.8	48.9	55.2
1977	65.6	54.9	60.5
1980	62.2	51.2	56.9
1984	68.5	59.3	64.1
1989	66.1	57.3	61.9
1991	60.7	50.6	55.9
1996	62.1	53.4	57.9
1998	65.9	57.7	62.0
1999	64.0	55.6	60.0
2004	62.0	53.8	58.0
2009	60.2	55.8	58.1
2014	67.0	65.5	66.4
2019	67.01	67.18	67.1

ప్రతిభ గల కళాకారులకు అవార్డులు

రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని

పాత గుంటూరు: గత టీడీపీ హయాంలో సిఫార్సులకే అత్యధిక ప్రాధాన్యం ఉండేదని, అనర్హులకే ఉత్తమ అవార్డులు లభించేవని, ముఖ్యమంత్రి బావమరిదో, అల్లుడో చెప్పిన వారికే న్యాయనిర్ణేతలు అవార్డులు ప్రకటించేవారని ప్రముఖ సినీ నటుడు, రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి విమర్శించారు. శనివారం గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక, రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. సభకు సంస్థ ఎండీ టి.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పోసాని మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కళాకారులకు జరిగిన అన్యాయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో కష్టపడి, అర్హత సాధించే కళాకారులకు అవార్డులు అందజేయాలని సూచించినట్టు తెలిపారు. ఆ మేరకు ప్రతిభ గల కళాకారులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. గతంలో నంది నాటకోత్సవాలు చూడాలన్నా, కళాకారులు ప్రదర్శనలు చేయాలంటే హైదరాబాద్ రవీంద్రభారతికి రావాల్సి ఉండేదని, కళాకారుల కష్టాన్ని నాటి సీఎం వైఎస్సార్ గుర్తించి అన్ని జిల్లాల్లో ఆడిటోరియాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కళాకారుల విలువను పెంచేందుకే ఆ మహనీయుడి పేరుతో వైఎస్సార్ రంగస్థలం పురస్కారం ఐదు లక్షల రూపాయలతో అందిస్తున్నట్టు తెలిపారు. 27 మంది సీనియర్ కళాకారులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన

పారదర్శకతకు పెద్దపీట: మంత్రి చెల్లుబోయిన

ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రసంగిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసి, ప్రతిభ కలిగిన కళాకారులను ప్రోత్సహించేందుకే నంది నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అంతరించిపోతున్న కళలు, టీవీ, సినిమా, యూట్యూబ్ రూపంలో ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో పేద వర్గాలకు చెందిన నటులను గుర్తించి వారి ప్రతిభ ఆధారంగా అవార్డులు అందిస్తున్నట్టు చెప్పారు. 73 అవార్డులను దక్కించుకోవడం కోసం 38 నాటక సమాజాలు, 1200 మంది కళాకారులు నాటక ప్రదర్శనల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. టీడీపీ హయాంలో నాటక రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, వసతి ఏర్పాట్లు సైతం చేయకుండా కళాకారులను ఇబ్బందుల గురిచేశారని మండిపడ్డారు. కళా రంగాన్ని ప్రోత్సహించి, కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ సందర్భంగా తొలి రోజు ప్రదర్శించిన నాలుగు నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

తరతరాలకు సమగ్ర భూ సర్వే ఫలాలు

లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి



శాశ్వత భూ హక్కు పత్రాన్ని చూపుతున్న జస్టిస్ లక్ష్మణరెడ్డి

బి.కొత్తకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న శాశ్వత భూ హక్కు పథకం' ద్వారా చేస్తున్న సమగ్ర భూ సర్వే ఫలాలు తరతరాలకు లభిస్తాయని ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి అన్నారు. ఆయన శనివారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం చెన్నరాయునిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ పాలన తర్వాత మొదటిసారిగా ప్రభుత్వం భూ సర్వే చేపట్టడం రైతాంగానికి ఎంతో లాభదాయకమన్నారు. రైతులు ఆ రోజుల్లో నోటి మాటగా ఇంత విస్తీర్ణమని భూములు కొన్నారని, కొలతలు వేసి, భూ యజమాన్య హక్కులపై విచారించలేదన్నారు. ప్రస్తుత సర్వేతో పక్కాగా కొలతలు వేసి భూమికి శాశ్వత హక్కులను కల్పిస్తారని, ఒకసారి ఇచ్చిన యాజమాన్య హక్కుపత్రాల వల్ల తరాలు మారినా రికార్డులు మార్చేందుకు వీలుకాదని స్పష్టంచేశారు. ఒకరి భూమికి మరొకరికి హక్కులు కల్పించలేరని, మోసంతో క్రయవిక్రయాలకు ఆస్కారం ఉండదన్నారు. లోకాయుక్త చొరవతో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షలు పరిహారం చెల్లించేందుకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. అదేవిధంగా కుటుంబంలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి మరణిస్తే ఆ ఉద్యోగాన్ని కుటుంబంలో పెళ్లికాని తమ్ముడు, చెల్లెలుకు ఇచ్చేందుకు అడ్డంకిగా ఉన్న 'యంగర్' పదాన్ని తొలగించాలని లోకాయుక్త కోరడంతో ప్రభుత్వం ఇందుకనుగుణంగా జీవో జారీ చేసిందని వివరించారు.

తిరుపతిలో యంగ్ బర్డ్ వాచర్స్ క్యాంప్

యువతకు పక్షి శాస్త్రంపై అవగాహన



పక్షులను వీక్షిస్తున్న పక్షి ప్రేమికులు

సాక్షి, అమరావతి: యువ పక్షి ప్రేమికుల కోసం ఐఐఎస్ఈఆర్(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) తిరుపతి క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే యంగ్ బర్డ్ వాచర్స్ శిబిరం శనివారం ప్రారంభమైంది. పక్షుల పట్ల ఆసక్తి ఉన్న యువకులకు పక్షి శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఈ రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌ను ఐఐఎస్ఈఆర్ ఏర్పాటు చేసింది. ఐఐఎస్ఈఆర్‌కి చెందిన ఆముర్తూర్ రామమూర్తి, రాబిన్ విజయన్, రాజా బండిలు ఈ శిబిరానికి డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న యువత కోసం నిర్వహిస్తున్న శిబిరంలో పక్షి శాస్త్రంపై మాస్టర్ క్లాసులు, పక్షులను పరిశీలించే విధానంతో పాటు వాటికి సంబంధించి కొన్ని రహస్య అసైన్‌మెంట్లు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా క్యాంప్‌నకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ రామమూర్తి మాట్లాడుతూ దేశంలో వర్ధమాన పక్షుల సమాజం ఉందని, 40 వేల మందికి పైగా బర్డ్ వాచర్లు 25 లక్షల మిలియన్ల ఈ-బర్డ్ చెక్ లిస్టులను సిటిజన్ సైన్స్ ప్లాట్‌ఫారమ్‌లలో నిరంతరం పోస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. వీరంతా ఇప్పటి వరకు 1365 పక్షి జాతులను రికార్డు చేశారని పేర్కొనారు. కానీ పక్షి శాస్త్రంలో వృత్తిపరమైన పరిశోధకుల సంఖ్య ఇంకా పరిమితంగా ఉందని చెప్పారు. ఆ పరిమితమైన పక్షి ప్రేమికులే తమకున్న ప్రాథమిక అవగాహనతో పక్షులను గుర్తిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతకు పక్షి శాస్త్రం, ప్రకృతిలో పక్షుల పాత్ర గురించి తెలియజెప్పడం కోసం ఐఐఎస్ఈఆర్ క్యాంపస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

• తెలంగాణ

దేశరక్షణలో సీఐఎస్ఎఫ్ కృషి కీలకం

- సీఐఎస్ఎఫ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జగ్బీర్‌సింగ్
- ఎన్ఐఎస్ఎలో 317 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్
- ఆకట్టుకున్న విన్యాసాలు

జవహర్ నగర్(హైదరాబాద్): విద్రోహశక్తుల నుంచి దేశాన్ని కాపాడుకునే క్రమంలో సీఐఎస్ఎఫ్ చేస్తున్న కృషి కీలకమని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) జగ్బీర్ సింగ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేట పరిధిలోని సీఐఎస్ఎఫ్‌కు చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఎ)లో 16వ బ్యాచ్‌కు చెందిన 19 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 1వ బ్యాచ్‌కు చెందిన 298 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జగ్బీర్‌సింగ్ మాట్లాడుతూ ఉగ్రవాదం, చొరబాటు వాదం వంటి సవాళ్లకు ఎదురొడ్డి శత్రువులపై పైచేయి సాధించడం కోసం సీఐఎస్ఎఫ్ అధికారులు తమను తాము సన్నద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 3 బెటాలియన్‌లతో ప్రారంభమైన సీఐఎస్ఎఫ్ ప్రస్తుతం దేశరక్షణ కోసం బలంగా తయారైందన్నారు. అనంతరం ఇండోర్, అవుట్‌డోర్, తుపాకీ కాల్పులతో పాటు ఆల్ రౌండ్ బెస్ట్ విభాగాల్లో అగ్రగామిగా నిలిచిన ట్రెనీలకు బహుమతులను జగ్బీర్‌సింగ్ అందజేశారు. పాసింగ్ అవుట్ పరేడ్ చేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల నివేదికను ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మాన్యూయేల్ సమర్పించారు. ఎన్ఐఎస్ఎ దీక్షాంత్ పరేడ్‌లో జవానుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ విన్యాసాలు చేస్తూ గాలిలో కాల్పులు జరపడం, ఆయుధాలను గాలిలోకి ఎగురవేసి తిరిగి అందుకునే విన్యాసాలు అబ్బురపరిచాయి.

ఇండియా కూటమితోనే పొత్తులు : సీపీఐ

జగన్‌కు వ్యతిరేకంగా వెళ్లాలనేదే మా ఉద్దేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో జగన్‌ను ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలసి ఎన్నికల్లో పోటీ చేయాలనేది తమ ఉద్దేశమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. పోల్ మేనేజ్‌మెంట్‌కు భయపడి టీడీపీ.. బీజేపీ పొత్తు కోసం తహతహలాడుతోందని విమర్శించారు. ఇండియా కూటమే తెలంగాణలో విజయం సాధించిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమితో అనుకూలంగా ఉండేవారితోనే తమ పొత్తులు ఉంటాయన్నారు. ఈ మేరకు నారాయణ శనివారం ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందా అంటే.. అది బీజేపీయేనని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో అనుబంధంగా ఉండే పార్టీలకు ప్రజలు ఓటు వేయరన్నారు. మోదీని వ్యతిరేకిస్తే తమకు ఎక్కడ ఇబ్బందులు వస్తాయో అనే భయంలో రాజకీయ పార్టీలు ఉన్నాయన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని మండిపడ్డారు. పార్లమెంట్‌ని కాపాడలేని బీజేపీ దేశాన్ని ఎలా కాపాడుతుందని నిలదీశారు. పార్లమెంట్‌పై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందనేది తన అనుమానమన్నారు. దీనిపై ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఇండియా కూటమికి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతుంది కాబట్టే ఎన్నికల గిమ్మిక్‌లో భాగంగా పార్లమెంట్‌పై దాడి అనే గేమ్ ఆడారని ఆరోపించారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు ఆద్యుడు అయిన ఎల్కే అద్వానీని అయోధ్యకు ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు.

వచ్చే ఏడాది 27.50 కోట్ల 'ఉపాధి' పని దినాలు

- వచ్చే వేసవిలో పెద్దఎత్తున పనుల కల్పనకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక
- వ్యవసాయ పనులు దొరకని గ్రామీణ పేదలకు సొంత గ్రామాల్లో పనులు
- నాలుగున్నరేళ్లలో ఏటా రూ.5 వేల నుంచి రూ.6 వేల కోట్ల లబ్ధి
- 2024–25 గరిష్ఠంగా రూ.7,480 కోట్ల మేర పేదలకు లబ్ధి పొందే అవకాశం

ఐదేళ్లలో ప్రభుత్వం గ్రామీణ పేదలకు కల్పించిన పనులు వివరాలు

ఆర్థిక ఏడాది	పనులు పొందిన కుటుంబాల సంఖ్య (లక్షల్లో)	కల్పించిన పని దినాల సంఖ్య (కోట్లలో)	కూలీలు పొందిన లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	40.37	20.02	4,215.16
2020-21	47.72	25.93	5,951.40
2021-22	46.81	24.17	5,180.04
2022-23	45.84	23.95	5,100.85
2023-24 (2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ 22వరకు)	43.88	21.61	5,366.06



సాక్షి, అమరావతి: రానున్న 2024–25 ఆర్థిక ఏడాదిలో గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకంలో పెద్దఎత్తున పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం 27.50 కోట్ల పనిదినాలతో పాటు పనుల కల్పన ద్వారా గరిష్ఠంగా రూ.7,480 కోట్ల మేర పేదలు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కరోనా విపత్కర సమయంతోపాటు నాలుగున్నర ఏళ్లుగా రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఏటా రూ.5 వేల కోట్ల నుంచి రూ.6 వేల కోట్ల మధ్య నేరుగా లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం, రానున్న ఏడాదిలో అంతకు మించి పనులు కల్పించనుంది. వ్యవసాయ పనులు తక్కువగా ఉండే వేసవిలో పెద్దఎత్తున పనులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా కొత్త పనులు గుర్తింపు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

రాష్ట్రమంతటా పనుల కల్పన

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మంతటా ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఒక్కో గ్రామంలో గడచిన మూడేళ్ల కాలంలో ఉపాధి హామీ పథకంలో పనులకు హాజరైన వారి గణాంకాలను అంచనాలుగా తీసుకుని, ఆయా గ్రామాల్లో వచ్చే ఏడాదిలో గతం కంటే ఎక్కువ పని దినాలే పనులు కల్పించేందుకు వీలుగా గ్రామాల్లో ఎక్కడికక్కడ కొత్త పనులు గుర్తించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ ప్రక్రియలో ఒక్కో గ్రామంలో అంచనాల కన్నా 10నుంచి 25 శాతం మేర అదనంగా కొత్త పనులను గుర్తిస్తున్నారు. గ్రామాల వారీగా 2024–25 ఆర్థిక సంవత్సరపు ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు కల్లా పూర్తి చేసేలా గతంలోనే ఆదేశాలు ఇచ్చినట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

ట్రాక్టర్-బస్సు ఢీ... నలుగురి దుర్మరణం

- ఒకరికి గాయాలు
- మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షల బీమా వర్తింపు
- అనంతపురం జిల్లా కల్లూరు వద్ద ఘటన



ట్రాక్టరును ఢీకొని దెబ్బతిన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

గార్లదిన్నె: ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కండ్లపల్లి చిన్న తిప్పయ్య(47), పసులోరు శ్రీరాములు(42), కండ్లపల్లి నాగార్జున(32), మామిళ్లపల్లి శ్రీనివాసులు(27), పసులోరు హరికృష్ణ సమీప బంధువులు. కల్లూరు నుంచి బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు బయలుదేరారు. పామిడి పెన్నానది బ్రిడ్జి సమీపంలోకి రాగానే బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (ఎన్ఎల్ 023041) ముందు వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసులుతో పాటు బియ్యం బస్తాలపై కూర్చొన్న చిన్నతిప్పయ్య, శ్రీరాములు, నాగార్జున కుడివైపు పడడంతో వారి మీదుగా బస్సు వెళ్లింది. శరీరాలు నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు పడిన హరికృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన హరికృష్ణను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి బస్సు యజ మాని పరిహారం చెల్లించే వరకు ఊరుకునేది లేదని మృతుల బంధువులు ఆందోళన చేపట్టారు. అనంతరం వారికి పోలీసులు సర్దిచెప్పారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.5లక్షలు అందించనున్నట్టు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. మృతుల కుటుంబాలను గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు.

నౌకపై డ్రోన్ దాడి

21 మంది భారత సిబ్బంది క్షేమం

న్యూఢిల్లీ: సౌదీ అరేబియా నుంచి మంగళూరుకు ముడి చమురుతో వస్తున్న వాణిజ్య నౌకపై డ్రోన్ దాడి జరిగింది. భారత్‌లోని వేరావల్‌కు నైరుతి దిశలో 200 నాటికల్ మైళ్ల దూరంలో అరేబియా సముద్రంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలోని 22 మంది సిబ్బందిలో 21 మంది భారతీయులే. ఘటన కారణంగా నౌకకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని భారత మిలటరీ వర్గాలు తెలిపాయి. నౌకపై డ్రోన్ దాడి జరిగిందన్న సమాచారం ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్(యూకేఎంటీవో)కు అందింది. ఆ మేరకు భారత నేవీని అప్రమత్తం చేయడంతో ఆ ప్రాంతానికి పి-81 గస్తీ విమానాన్ని పంపించారు. డ్రోన్ దాడితో నౌకలో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. సిబ్బందికి హాని జరగలేదని సైనిక వర్గాలు తెలిపాయి.

చొరబాటుయత్నం భగ్నం.. కశ్మీర్లో ఉగ్రవాది హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి(ఐబీ) జరిగిన చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టినట్లు ఆర్మీ తెలిపింది. అఖ్నూర్ సెక్టార్‌లోని ఖౌర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటాక సరిహద్దు కంచెను దాటి భారత్‌లోకి ప్రవేశించేందుకు నలుగురు సాయుధ ఉగ్రవాదులు ప్రయత్నించారు. నిఘా వ్యవస్థల ద్వారా విషయాన్ని గుర్తించిన బలగాలు అప్రమత్తమై కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. మిగతా వారు మృతదేహాన్ని లాక్కెళ్లినట్లు అక్కడ లభించిన ఆనవాళ్లను బట్టి తేలిందని ఆర్మీ తెలిపింది.

కుటుంబాన్ని కూల్చేశారు

ఇజ్రాయెల్ దాడిలో పాలస్తీనాలో 76 మంది సజీవసమాధి

రఫా(గాజా స్ట్రిప్): హమాస్ మెరుపుదాడికి ప్రతీకారంగా మెల్లగా దాడులు మొదలెట్టిన ఇజ్రాయెల్ రోజురోజుకూ రెచ్చిపోతోంది. అమాయక పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకుంటోంది. శనివారం ఇజ్రాయెల్ సేనల నిర్దయ దాడులకు ఒక ఉమ్మడి కుటుంబం నిట్టనిలువునా కుప్పకూలింది. గాజా సిటీలో జరిపిన దాడుల్లో ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మాజీ ఉద్యోగి 'అల్-మగ్‌రాబీ' ఉమ్మడి కుటుంబంలో ఏకంగా 76 మంది కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు. నుసేరాత్ పట్టణ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో స్థానిక టీవీ పాత్రికేయుడు మొహమ్మద్ ఖలీఫా ఉమ్మడి కుటుంబం బలైంది. ఈ దాడిలో 14 మంది కుటుంబసభ్యులు మరణించారు. మొత్తం దాడుల్లో 90 మందికి పైగా మరణించారని గాజా పౌరరక్షణ విభాగం అధికార ప్రతినిధి వెల్లడించారు.

కుమావత్‌కు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో అలజడి కేసు నిందితుడు మహేశ్ కుమావత్ కస్టడీని కోర్టు జనవరి 5వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీ పోలీసుల వినతి మేరకు స్పెషల్ కోర్టు జడ్జి హర్దీప్ కౌర్ శనివారం ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఈ కేసులో మిగతా నిందితులు లలిత్ ఝా, మనోరంజన్, సాగర్ శర్మ, అమోల్ ధన్‌రాజ్ షిండే, నీలమ్ దేవి కస్టడీని ఇప్పటికే పొడిగించడం తెలిసిందే.

752 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 752 కేసులు నమోదు కాగా కరోనా బారినపడిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ ఏడాది మే 21వ తేదీ తర్వాత ఒకే రోజుల్లో 752 కొత్త కేసులు వెలుగు చూడటం ఇదే మొదటిసారని శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదేవిధంగా, యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కు చేరుకుంది. 24 గంట వ్యవధిలో కేరళలో ఇద్దరు, రాజస్తాన్, కర్ణాటకలో ఒక్కరు చనిపోయారు.

ట్రంప్‌కు ఊరట

వాషింగ్టన్: 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నించినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపే అంశాన్ని త్వరగా తేల్చాలంటూ వచ్చిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికిప్పుడు దీనిపై విచారణ జరపలేమని తేల్చిచెప్పింది. 2024 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు ట్రంప్ తన ప్రయత్నాలు వేగవంతం చేశారు. తనపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను వాయిదా వేయాలని పదేపదే కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కీలకమైన ఈ పరిణామం చోటుచేసుకుంది. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన కోర్టు చేపట్టే కీలకమైన విచారణపైనా దీని ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు.

యూపీ ఎమ్మెల్యేపై వేటు

లఖ్‌నవూ: అత్యాచార ఆరోపణలపై ఇటీవల 25 ఏళ్ల జైలు శిక్ష పడ్డ ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌పై అనర్హత వేటు పడింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేసినట్టు అసెంబ్లీ వర్గాలు శనివారం వెల్లడించాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్ల, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడ్డ ప్రజాప్రతినిధులు తమ పదవిని కోల్పోతారు. శిక్షా కాలం ముగిశాక మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారు. రామ్‌దులార్ దుద్ధి అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

2 గర్భసంచులు 2 రోజులు 2 ప్రసవాలు

అమెరికా మహిళ అరుదైన రికార్డు


కెల్సీ హాచర్

అద్భుతాలకే అద్భుతంగా చెప్పదగ్గ ఈ ఉదంతం అమెరికాలో జరిగింది. అలబామాకు చెందిన కెల్సీ హాచర్ అనే 32 ఏళ్ల మహిళ పురిటి నొప్పులతో డిసెంబర్ 19న యూనివర్సిటీ ఆఫ్ అలబామాలోని బర్మింగ్‌హాం ఆస్పత్రి (యూఏబీ)లో చేరింది. 10 గంటల పురిటి నొప్పుల తర్వాత సాధారణ కాన్పులో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. కానీ పురిటి నొప్పులు మాత్రం అలాగే కొనసాగాయి. మరో 10 గంటల తర్వాత సిజేరియన్ ద్వారా మరో ఆడపిల్లకు జన్మనిచ్చి అబ్బురపరిచింది. కెల్సీకి రెండు గర్భసంచులుండటం, రెండింట్లోనూ ఒకేసారి గర్భధారణ జరగడం వల్ల ఈ అద్భుతం సాధ్యమైంది. మహిళల్లో ఇలా రెండు గర్భసంచులుండే ఆస్కారమే కేవలం 0.3 శాతమట! వారిలోనూ రెండింట్లోనూ ఒకేసారి గర్భం ధరించే ఆస్కారమైతే 10 లక్షల్లో ఒక్క వంతు మాత్రమేనట! అరుదైన ఈ జంట అద్భుతాలు రెండూ కలిసి రావడంతో కెల్సీ ఇలా అత్యంత అరుదైన రికార్డును సొంతం చేసుకుంది!!

కెల్సీకి రెండు గర్భసంచులు ఉన్నట్టు 17వ ఏట బయట పడింది. కానీ పెళ్లి తర్వాత తొలి కాన్పుల్లోనూ సాధారణంగా ఒక్కొక్కరే పుట్టారు. ఈసారీ అలాగే జరగనుందని నెల తప్పినప్పుడు కెల్సీ అనుకుందట. ''కానీ అల్ట్రా సౌండ్ చేయిస్తే రెండు గర్భసంచుల్లోనూ పిండాలున్నట్టు తెలిసి చెప్పలేనంత థ్రిల్‌కు లోనయ్యా. అసలలాంటిది సాధ్యమని మొదట నమ్మకమే కుదర్లేదు'' అని సంబరంగా చెప్పుకొచ్చిందామె! అక్కణ్నుంచి కెల్సీ తన అసాధారణ జంట గర్భధారణ గాథను ఇన్‌స్టాగ్రాంలో రెగ్యులర్‌గా ఎప్పటికప్పుడు పంచుకుంటూ వచ్చింది. చూస్తుండగానే నెలలు నిండటం, ఆస్పత్రిలో చేరడం, వరుసగా రెండు రోజుల్లో ఇద్దరు పాపాయిలకు జన్మనిచ్చి రికార్డులకెక్కడం చకచకా జరిగిపోయాయి. ఈ అరుదైన కాన్పుల కోసం ఆస్పత్రి డబుల్ ఏర్పాట్లు చేయడం విశేషం! డబుల్ మానిటరింగ్, డబుల్ చార్టింగ్ మొదలుకుని కాన్పు కోసం రెండింతల సిబ్బందిని నియమించడం దాకా అన్నీ 'రెట్టింపు స్పీడు'తో జరిగాయి. ఇద్దరు పాపాయిలూ గర్భంలో ఆరోగ్యంగా పెరిగినట్టు కాన్పు చేసిన వైద్య బృందానికి సహ సారథ్యం వహించిన ప్రొఫెసర్ రిచర్డ్ డేవిస్ తెలిపారు. ''ఒకే గర్భసంచిలో రెండు పిండాలు పెరిగిన బాపతు సాధారణ గర్భధారణ కాదిది. పిల్లలిద్దరూ ఒకే అపార్ట్‌మెంట్‌లో వేర్వేరు ఫ్లాట్లలో మాదిరిగా ఎవరి గర్భసంచిలో వారు స్వేచ్ఛగా ఎదిగారు'' అని చెప్పుకొచ్చారు. ''డిసెంబర్ 19న రాత్రి 7.45 గంటలకు తొలి పాప పుట్టింది. 10 గంటల పై చిలుకు పురిటి నొప్పుల తర్వాత డిసెంబర్ 20న ఉదయం 6.10 గంటలకు సిజేరియన్ చేసి రెండో పాపను బయటికి తీశాం. ఇంతటి అరుదైన ఘటనకు సాక్షులుగా నిలిచామంటూ మా వైద్య బృందమంతా కేరింతలు కొట్టాం'' అని వివరించారు.

తొలి మూడు కాన్పులు సాధారణమే...

- సాక్షి, నేషనల్ డెస్క్

పిల్లల బుల్లి రికార్డు...!

నవజాత శిశువులు కూడా రికార్డుల విషయంలో తమ తల్లికి ఏ మాత్రమూ తీసిపోలేదు. వేర్వేరు గర్భసంచుల్లో పెరగడమే గాక ఏకంగా వేర్వేరు పుట్టిన రోజులున్న అత్యంత అరుదైన కవలలుగా రికార్డులకెక్కారు. అంతేకాదు, వీరు ఎవరికి వారు వేర్వేరు అండం, వీర్య కణాల ఫలదీకరణ ద్వారా కడుపులో పడటం మరో విశేషం! ఇలాంటి కవలలను ఫ్రాటర్నల్ ట్విన్స్‌గా పిలుస్తారని ప్రొఫెసర్ రిచర్డ్ తెలిపారు. మొత్తానికి రికార్డులు సృష్టించడంలో తల్లికి తీసిపోమని పుట్టీ పుట్టగానే నిరూపించుకున్నారంటూ అంతా ముక్కున వేలేసుకుంటున్నారు!

బంగ్లా మహిళ బంపర్ రికార్డు!

ఇలాంటి అరుదైన 'జంట జననాలు' అత్యంత అరుదే అయినా అసలు జరగకుండా పోలేదు. 2019లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఇలాంటి ఘటన దీన్ని తలదన్నేలా ఉండటం విశేషం! రెండు గర్భసంచుల్లోనూ గర్భం దాల్చిన ఓ మహిళ తొలి కాన్పు తర్వాత ఏకంగా నెల రోజుల తర్వాత రెండో పాపాయికి జన్మనిచ్చిందట! ఆ పురుళ్లు పోసిన వైద్యుడు అప్పట్లో ఈ వింతను బీబీసీతో పంచుకున్నాడు.

సగానికి పైగా ఓట్లు మనకే పడాలి

బీజేపీ పదాధికారుల సమావేశంలో నేతలకు మోదీ దిశానిర్దేశం



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని మోదీ పార్టీ పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మరిన్ని ఓట్లను ఒడిసిపట్టాలని పార్టీ సీనియర్ నేతలకు సూచించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ పార్టీ జాతీయ పథాధికారుల సమావేశం ఇందుకు వేదికై ంది. రెండురోజులపాటు సాగిన ఈ సమావేశం శనివారం ముగిసింది. నేషనల్ ఆఫీస్ బేరర్స్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇతర సంస్థాగత విభాగాల సారథులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశంలో చర్చకొచ్చిన ఇతరత్రా అంశాలను విశ్వసనీయ వర్గాలు శనివారం వెల్లడించాయి. ''త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల సమరంలో సగానికిపైగా ఓట్లు బీజేపీకే దఖలుపడాల్సిందే. పోలింగ్‌లో పార్టీ ఓటు షేర్ కనీసం 10 శాతమైనా పెరగాల్సిందే. 2019లో బీజేపీ 37శాతానికిపైగా ఓటు షేరు సాధించింది. ఎన్‌డీఏ కూటమి దాదాపు 45 శాతం ఓటుషేరు సాధించింది. 2014 నుంచి చూస్తే కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు ఒక్క బీజేపీకే పడ్డాయి. దృఢ కార్యదీక్షతో ఎన్నికల క్షేత్రంలో అవిశ్రాంతంగా పనిచేయండి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 303 నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. అయితే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో అంతకుమించిన చోట్ల మన పార్టీ విజయభేరీ మోగించాలి. ఆ బాధ్యత మీదే. జనం మెచ్చిన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చొచ్చుకుపొండి. తప్పుడు ఆరోపణలతో విష ప్రచారం చేసే విపక్ష పార్టీల ఆటకట్టించండి. అందుకోసం కేంద్ర ప్రభుత్వం పూర్తిచేసిన ప్రాజెక్టులు, పనులు, వాస్తవ గణాంకాలతో ప్రజలకు నిజానిజాలకు తెలియజెప్పండి'' అని బీజేపీ నేతలకు మోదీ సూచించారు.

నాలుగు 'కులాలను' కలుపుకొని పొండి

'దేశంలో నాలుగే కులాలున్నాయి. మహిళలు, యువత, రైతులు, పేదలు. ప్రచారంలో భాగంగా ఈ నాలుగు కులాలను కలిసి వారి కష్టాలకు పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నించండి. అద్భుత ఫలితాలు, ప్రజాదరణ పొందిన కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లండి' అని మోదీ సూచించారు. కేంద్రంలో బీజేపీ హయాంలో అమలవుతున్న కేంద్ర పథకాలు, వాటి లబ్ధిదారుల విజయగాథలను తెల్సుకుంటూ, ప్రజల్లో పథకాల అవగాహన పెంచుతూ ముందుకు సాగుతున్న ' వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'ను మరింతగా విజయవంతంగా చేయడంపైనా సమావేశంలో నేతలు చర్చించారు. ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగబోయే అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి వేడుకలను మరింత బాగా నిర్వహించడం, తదితరాలూ సమావేశంలో చర్చకొచ్చాయి. మూడు రాష్ట్రాల ఎన్నికల్లో నమోదైన విజయం.. సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో విజయానికి శుభసూచకమని నేతలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారని వార్తలొచ్చాయి. బూత్ కమిటీలను పటిష్టవంతంచేస్తేనే ఎక్కువ మంది ఓటర్లను మనం చేరుకోగలమని నేతలు చెప్పినట్లు వార్తలొచ్చాయి. ''మూడు రాష్ట్రాల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాం. ఇక సార్వత్రిక సమరంలోనూ హ్యాట్రిక్ కొట్టబోతున్నాం'' అని నేతల ముందు మోదీ విశ్వాసం వ్యక్తంచేశారని తెలుస్తోంది. ''మన ప్రదర్శన చూసి విపక్షాలు కంగుతినాలి'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారట. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ ఘన విజయంపై ఆ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు పార్టీని పొగుడుతూ ప్రసంగించారు. వచ్చే నెలలో అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవం సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి బాగా కలిసొస్తుందని నేతలు ఆశాభావం వ్యక్తంచేశారు.

హిందూ ఆలయంపై విద్వేష రాతలు

- అమెరికాలోని నెవార్క్‌లో ఘటన
- విద్వేష నేరంగా కేసు నమోదు

న్యూయార్క్/గాంధీనగర్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని ప్రముఖ హిందూ ఆలయంపై దాడి జరిగింది. దుండగులు ఆలయ గోడపై భారత వ్యతిరేక అభ్యంతరకర చిత్రాలతోపాటు ఖలిస్తాన్ అంటూ కలర్ స్ప్రే చేశారు. పోలీసులు ఈ ఘటనను విద్వేష నేరంగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. నెవార్క్‌లోని స్వామి నారాయణ్ మందిర్ హిందూ ఆలయంపై అభ్యంతరకర చిత్రాలు(గ్రాఫిటీ) ఉన్నాయంటూ శుక్రవారం ఉదయం తమకు ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసు అధికారులు వాటిని పరిశీలించారు. గ్రాఫిటీని రెచ్చగొట్టే చర్యగా ఆలయ పెద్దలు పేర్కొన్నారని పోలీసులు వెల్లడించారు. కావాలనే ఎవరో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని చెప్పారు. విద్వేష నేరంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ తదితరాలతో ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనను అమెరికా విదేశాంగ శాఖ, శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత్ కాన్సులేట్ కార్యాలయం తీవ్రంగా ఖండించాయి. గతంలోనూ భారత దౌత్య కార్యాలయాలపై ఇలాంటి దాడులు జరిగాయి. జూలైలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాన్సులేట్ కార్యాలయంపై ఖలిస్తాన్ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. అమెరికా, కెనడాల పౌరసత్వమున్న ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూపై హత్యాయత్నం వెనుక భారత ప్రమేయముందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఉపేక్షించరాదు: జై శంకర్

ఈ ఘటనపై విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వెలుపల ఉగ్రవాదం, వేర్పాటువాదాలను ఉపేక్షించరాదని డిమాండ్ చేశారు.

మానవ అక్రమ రవాణా ఆరోపణలు.. భారతీయులున్న విమానాన్ని ఆపేసిన ఫ్రాన్స్

పారిస్: మానవ అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై ఫ్రాన్సు అధికారులు నిలిపివేసిన విమానంలోని భారతీయులకు కాన్సులర్ అనుమతి లభించిందని అక్కడి భారత దౌత్య కార్యాలయం తెలిపింది. యూఏఈలోని దుబాయ్ నుంచి 303 మంది భారతీయులతో నికరాగ్వా వైపు వెళుతోంది. ఆ విమానం గురువారం ఇంధనం కోసం ఫ్రాన్సులోని చలోన్స్-వట్రీ విమానాశ్రయంలో దిగింది. అప్పటికే మానవ అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారం అందుకున్న అధికారులు ఆ విమానాన్ని దిగ్బంధించారు. అందులోని ప్రయాణికులందరికీ విమానాశ్రయంలోని టెర్మినల్ భవనంలో బస ఏర్పాట్లు చేశారు. వారందరి వద్దా ఉన్న ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నారు. వారంతా దుబాయ్‌లో ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? నికరాగ్వా వెళ్లేందుకు అవసరమైన పత్రాలున్నాయా? వంటి విషయాలను ఆరా తీస్తున్నారు. విమానంలోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. 21 నెలలు మొదలుకొని 17 ఏళ్ల వరకు వయసున్న 13 మంది మైనర్లు విమానంలో ఉన్నారని, వీరిలో కొందరు ఒంటరిగా ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ప్రయాణికులందరికీ ఫ్రాన్సు ప్రభుత్వం కాన్సులర్ అనుమతి మంజూరు చేసిందని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మానవ అక్రమ రవాణాతో తమకు సంబంధం లేదని లెజెండ్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి పేర్కొన్నారు. ప్రయాణికులంతా దుబాయ్‌లో పనిచేస్తున్న వారేనని భావిస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థ ఖాతాదారు కోసమే ఆ సర్వీసును నడిపినట్లు తెలిపారు. వీరంతా నికరాగ్వా చేరి, అక్కడ్నుంచి దొంగచాటుగా అమెరికా లేదా కెనడాలో ప్రవేశించేందుకే పథకం వేశారని భావిస్తున్నారు.

పైలట్‌కు 'ఛత్తీస్' బాధ్యతలు

ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌ల బాధ్యతల్లో మార్పు చేసిన ఏఐసీసీ



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ రాజస్తాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్‌కు పార్టీలో కీలక పదవి అప్పగించింది. ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సభ్యులుగా, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సీడబ్ల్యూసీ భేటీ జరిగిన రెండు రోజులకే ఇలా పలువురు ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌ల బాధ్యతలను మార్చడం గమనార్హం. ఢిల్లీ, హరియాణా ఇన్‌చార్జ్ బాధ్యతలను దీపక్ బబారియాకు అప్పగించారు. కుమారి సెల్జాను ఉత్తరాఖండ్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. మాణిక్కం ఠాగూర్‌ను అండమాన్ అండ్ నికోబార్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా నియమించారు. జార్ఖండ్ ప్రధాన కార్యదర్శి జీఏ మిర్‌కు పశ్చిమబెంగాల్ బాధ్యతలూ అప్పగించారు. జితేంద్ర సింగ్‌కు మధ్యప్రదేశ్ బాధ్యతలు కట్టబెట్టారు. మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా రమేశ్ చెన్నితల, బిహార్ ఇన్‌చార్జ్‌గా మోహన్ ప్రకాశ్ నియమితులయ్యారు. మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లకు ఇన్‌చార్జ్‌గా చెల్లకుమార్ ఎంపికయ్యారు. అజయ్ కుమార్‌కు తమిళనాడు, పుదుచ్చేరి అదనపు బాధ్యతలు ఇచ్చారు. జమ్మూకశ్మీర్ ఇన్‌చార్జ్‌గా భరత్‌సిన్హ్ సోలంకీ, హిమాచల్, చండీగఢ్ ఇన్‌చార్జ్‌గా రాజీవ్ శుక్లా, రాజస్తాన్ ఇన్‌చార్జ్‌గా సుఖ్‌జిందర్ సింగ్ రణ్‌ధావా, పంజాబ్ ఇన్‌చార్జ్‌గా దేవేందర్ యాదవ్, గోవా, డామన్, డయ్యూ, దాద్రానగర్, హవేలా ఇన్‌చార్జ్‌గా మాణిక్‌రావు ఠాకరేను నియమించారు. త్రిపుర, సిక్కిం, మణిపూర్, నాగాలాండ్‌లకు గిరీశ్ చోదంకర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. తెలంగాణ ఇంఛార్జ్‌గా దీపా దాస్‌మున్షీ, ఏపీకి మాణిక్కం ఠాగూర్‌ను నియమించారు.

ప్రియాంక చేజారిన యూపీ

ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాం. దీని తప్పించడం గమనార్హం. ప్రియాంక గాంధీకి ప్రధాన కార్యదర్శి పదవి ఉన్నాసరే ఆమెకు ఎలాంటి పోర్ట్‌ఫోలియో కేటాయించలేదు. అవినాశ్ పాండేకు ఉత్తరప్రదేశ్ బాధ్యతలను కట్టబెట్టారు. అజయ్ మాకెన్ పార్టీ కోశాధికారిగా ఉంటారు.

ఆ చెక్కులు వెనక్కిచ్చేస్తాం

'ర్యాట్ హోల్' గని కార్మికుల నిరసన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని సిల్కియారా వద్ద సొరంగంలో గత నెలలో 17 రోజుల పాటు చిక్కుబడిపోయిన 41 మంది కార్మికులను రక్షించడంలో కీలకమైన 12 మంది ర్యాట్-హోల్' గని కార్మికులు నిరసన తెలుపుతున్నారు. ''అన్ని రకాల యంత్రాలు విఫలమైన వేళ.. మేం ఎలాంటి షరతులు పెట్టకుండా ప్రాణాలనొడ్డి మార్గం తయారు చేశాం. సొరంగం లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా వెలుపలికి తెచ్చాం. ఇందుకుగాను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేవలం రూ.50 వేల చొప్పున చెక్కులిచ్చింది. మాకీ ప్రతిఫలం సరిపోదని చెప్పాం. అధికారుల నుంచి, ఇప్పటికీ జవాబులేదు. ఈ చెక్కులు మాకొద్దు. మేమందరం వాపసు చేస్తాం'' అని మైనర్లలో ఒకరైన వకీల్ హసన్ పీటీఐకి తెలిపాడు. ప్రభుత్వం తమకు శాశ్వత ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశాడు.

ముగ్గురు పౌరుల అనుమానాస్పద మృతి

కశ్మీర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- ఆర్మీయే చంపిందని ఆరోపణలు
- కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు: ప్రభుత్వం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంఛ్, రాజౌరీల్లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విచారణ కోసమని తీసుకెళ్లి ముగ్గురు పౌరులను ఆర్మీ అధికారులు చంపేశారంటూ పార్టీల నేతలు, స్థానికులు నిరసనకు దిగారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలకు పరిహారం అందజేస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపింది. సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. విచారణకు పూర్తిగా సహకరిస్తామని ఆర్మీ ప్రకటించింది. వదంతులు వ్యాపించకుండా పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ నెల 21న పూంఛ్ జిల్లాలో ఆర్మీ వాహనాలపై ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులు అసువులు బాయడం తెలిసిందే. అనంతరం ఆర్మీ అధికారులు 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు శుక్రవారం రాత్రి శవాలై కనిపించారు. వారిని చిత్రహింసలు పెట్టిన వీడియోలు బహిర్గతమయ్యాయి. ఇది ఆర్మీ అధికారుల పనేనని స్థానికులు ఆరోపించారు. తీవ్ర గాయాలపాలైన నలుగురిని అధికారులు ఆస్పత్రికి తరలించారు.

హిజాబ్‌పై ఆలోచిస్తున్నాం

స్పష్టంచేసిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

మైసూరు: రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో హిజాబ్ ధారణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంపై మాత్రమే రాష్ట్ర సర్కార్ లోతుగా ఆలోచిస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టంచేశారు. రాష్ట్రస్థాయిలో విస్తృతస్థాయిలో సంప్రతింపులు జరిపిన తర్వాతే ఈ అంశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. శనివారం మైసూరులో మీడియాతో ఆయ మాట్లాడారు. ' హిజాబ్‌పై నిషేధాన్ని ఇంకా అమల్లోకి తేలేదు. ఈ విద్యాసంవత్సరంలోనే అమలుచేయాలా వద్దా అనే దానిపై ఇంకా సంప్రతింపులు కొనసాగుతున్నాయి'' అని చెప్పారు. కర్ణాటకవ్యాప్తంగా విద్యాలయాల్లో మతపరమైన వస్త్రాలు ధరించడంపై ఎలాంటి ఆంక్షలు లేవుకదా. అయినా ఎలాంటి వస్త్రాలు ధరించాలి, ఎలాంటి ఆహారం తినాలి అనేది పూర్తిగా వ్యక్తిగతం'' అని శుక్రవారం వ్యాఖ్యలుచేసిన ఆయన మరుసటిరోజే ఇలా విరుద్ధంగా మాట్లాడటం గమనార్హం. మరోవైపు ప్రభుత్వ చర్యల ఫలితంగా విద్యాసంస్థల్లోని లౌకిక వాతావరణం దెబ్బతినే ప్రమాదముందని బీజేపీ ఆందోళనవ్యక్తంచేసింది. '' రాష్ట్రాల్లోని విద్యా వాతావరణాన్ని సీఎం చెడగొడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయన బుజ్జగింపు రాజకీయలకు పాల్పడుతున్నారు'' అని కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర ఆరోపించారు.

తేజస్వీకి ఈడీ తాజా సమన్లు

న్యూఢిల్లీ: ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వేమంత్రిగా ఉన్నకాలంలో కొందరి భూములు రాయించుకుని వారికి రైల్వేలో గ్రూప్-డీ ఉద్యోగాలు ఇచ్చారన్న కేసులో ఆయన కుమారుడు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కు పాత్ర ఉందంటూ ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరోసారి సమన్లు జారీచేసింది. జనవరి ఐదో తేదీన తమ ఆఫీస్‌కు రావాలని తేజస్వీకి సూచించింది. డిసెంబర్ 22వ తేదీనే రావాలని గతంలో సమన్లు జారీచేయగా ఆయన రాలేదు. దీంతో మళ్లీ సమన్లు ఇచ్చారు. ఇదే కేసులో డిసెంబర్ 27వ తేదీన హాజరుకావాలని లాలూకు సైతం ఈడీ సమన్లు పంపడం తెల్సిందే. ' సమన్లలో కొత్తదనం ఏదీలేదు. ఇప్పటికే ఎన్నోసార్లు ఈడీ ఆఫీస్‌కెళ్లాను. ఇదో రొటీన్ పనిలా తయారైంది' అని తేజస్వీ వ్యాఖ్యానించారు. యూపీఏ-1 హయాంలో 2004-2009 కాలంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఆ కాలంలో కొందరికి వేర్వేరు రైల్వేజోన్లలో గ్రూప్-డీ ఉద్యోగాలిచ్చి, లాలూ కుటుంబసభ్యుల, వారికి చెందిన ఏకే ఇన్ఫోసిస్టమ్స్ సంస్థ పేరు మీదకు ఆ లబ్దిదారుల భూములను బదలాయించారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న అమిత్ కాత్యాల్‌ను ఈడీ ఇటీవల అరెస్ట్‌చేసింది. ఈ సంస్థ రిజిస్ట్రేషన్ అడ్రస్‌లో ఉన్న ఇల్లు లాలూదేనని ఈడీ పేర్కొంది. లబ్ధిదారుల భూముల బదలాయింపు సంస్థలోకి జరిగాక ఆ వాటాలను 2014 ఏడాదిలో లాలూ కుటుంబసభ్యుల పేరు మీదకు బదిలీ చేశారని ఈడీ చెబుతోంది. ఈ ఉదంతంపై గతంలో సీబీఐ నమోదుచేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ కొత్తగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తోంది.

ఈడీ ఎదుటకు కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: 2011లో కొందరు చైనీయులకు వీసాల జారీకి సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. ఈడీ అధికారులు ఈ నెల 12, 16వ తేదీల్లో కూడా కార్తీకి సమన్లు పంపారు. అయితే, అవసరమైన పత్రాల సేకరణకు సమయం కావాలంటూ ఆయన విచారణకు హాజరుకాలేదు. పంజాబ్‌లో ఏర్పాటవుతున్న ఒక విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల కాంట్రాక్టును చైనా కంపెనీ తీసుకుంది. ఈ కంపెనీ గడువులోగా పనులను పూర్తి చేయలేదు. దీంతో, 263 మంది చైనా సిబ్బందికి దేశంలో ఉండేందుకు అవసరమైన వీసాలను మళ్లీ మంజూరు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వీసాల మంజూరు కోసం 2011లో కేంద్ర హోం మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంకు రూ.50 లక్షలు ముట్టినట్లు సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ప్రశ్నించేందుకే ఈడీ అధికారులు కార్తీకి నోటీసులు పంపారు. అయితే, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరంను వేధించే చర్యల్లో భాగంగానే తనపై కక్షగట్టారని కార్తీ ఆరోపిస్తున్నారు. ఒక్క చైనీయుడి వీసా మంజూరుకు కూడా తాను ఎన్నడూ సాయపడలేదన్నారు. కార్తీ చిదంబరంపై ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసుల్లో మనీలాండరింగ్ ఆరోపణల కింద ఇప్పటికే ఈడీ దర్యాప్తు చేస్తోంది.

జనవరి ఆరున కక్ష్యలోకి ఆదిత్యఎల్1

ఇస్రో చైర్మన్ సోమనాథ్ అంచనా

అహ్మదాబాద్: భగభగమండే భానుడి వాతావరణం, సూర్యుడిలో సంభవించే స్వల్ప మార్పులు భూగోళంపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలు చూపుతాయనే అంశాలను అధ్యయనం చేసేందుకు ఇస్రో ప్రయోగించిన అంతరిక్షనౌక ఆదిత్య ఎల్-1 జనవరి ఆరో తేదీన తన కక్ష్యలోకి చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అంచనావేశారు. శుక్రవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒక ఎన్‌జీవో ఏర్పాటుచేసిన 'భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. '' భూమి నుంచి సూర్యుడి వైపుగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రాంజియాన్ పాయింట్(ఎల్) కక్ష్యలోకి ఆదిత్య ఎల్-1 జనవరి ఆరో తేదీన చేరుకుంటుందని భావిస్తున్నాం. ఆరో తేదీన ఎల్1 పాయింట్‌లోకి చేరగానే వ్యోమనౌక మరింత ముందుకు వెళ్లకుండా వ్యతిరేకదిశలో ఇంజిన్‌ను మండిస్తాం. దాంతో అది ఆ కక్ష్యలో స్థిరంగా కుదురుకుంటుంది. ఆ కక్ష్యలోనే తిరుగుతూ సూర్య వాతావరణ విశేషాలపై అధ్యయనం మొదలుపెడుతుంది. వచ్చే ఐదేళ్లపాటు సూర్యుడిపై సంభవించే పరిణామాలను విశ్లేషించనుంది. స్పేస్‌క్రాఫ్ట్ తన కక్ష్యలో కుదురుకున్నాక సౌరగాలులు, సౌర ఉపరితలంపై మార్పులు తదితరాల డేటాను ఒడిసిపట్టి భారత్‌కు మాత్రమేకాదు యావత్ ప్రపంచానికి పనికొచ్చే సమాచారాన్ని ఆదిత్య ఎల్1 అందించనుంది'' అని సోమనాథ్ చెప్పారు. '' ప్రధాని మోదీ ఉద్బోధించినట్లు అమృతకాలంలో భారత్ 'భారతీయ స్పేస్ స్టేషన్' పేరిట సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నాం' అని వివరించారు.

నితీశ్ చేతికి జేడీయూ పగ్గాలు!

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ త్వరలో జనతాదళ్(యునైటెడ్, జేడీయూ) పార్టీ పగ్గాలు చేపడతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్‌ను తొలగించేందుకు ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో ఈ నెల 29వ తేదీన జరిగే పార్టీ జాతీయ కార్యవర్గం సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. లలన్ స్థానంలో కొత్త వారికి బాధ్యతలివ్వడం కంటే కూడా స్వయంగా అధ్యక్ష బాధ్యతలు చేపడితేనే పార్టీలో అంతర్గత సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని నితీశ్‌కు సన్నిహితులు సలహా ఇచ్చినట్లు భావిస్తున్నారు. లలన్ సింగ్ పనితీరు ముఖ్యంగా ఆయన ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌తో సన్నిహితంగా ఉండటం నితీశ్‌కు రుచించడం లేదని చెబుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ముంగేర్ స్థానం నుంచే ఈసారి ఆర్జేడీ టిక్కెట్‌పై పోటీకి దిగాలని లలన్ భావిస్తున్నట్లు కూడా ఊహాగానాలు వస్తున్నాయి. జాతీయ స్థాయిలో కీలకంగా ఉండాలని భావిస్తున్న నితీశ్..అందుకు తగ్గట్లుగా లలన్ సింగ్ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమైనట్లు కూడా నితీశ్ అనుకుంటున్నట్లు సమాచారం. అందుకే, ఆయనకు ఉద్వాసన పలకాలనే నిర్ణయానికి నితీశ్ వచ్చినట్లుగా తెలుస్తోంది.

డార్క్‌వెబ్‌లో 'బీఎస్ఎన్ఎల్' యూజర్ల డేటా

చోరీ చేసిన హ్యాకర్ • ఆన్‌లైన్‌లో పలు వివరాలు ప్రత్యక్షం

న్యూఢిల్లీ: బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ వినియోగదారుల సమాచారాన్ని చోరీచేసిన ఓ హ్యాకర్ ఆ వివరాలను ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టాడు. దీంతో ఆయా కస్టమర్ల గోప్యతకు విఘాతం కలిగింది. తనను 'పెరిల్'గా పేర్కొన్న ఓ హ్యాకర్.. డార్క్‌వెబ్‌లో ఆ సమస్త వివరాలను పొందుపరిచాడు. దీంతో యూజర్ల గుర్తింపు బహిర్గతమవడంతోపాటు వారి సమాచారం సాయంతో మరో ఆర్థిక మోసం, ఆన్‌లైన్‌మోసానికి ఆస్కారం ఏర్పడింది. దాదాపు 29 లక్షల వరుసల డేటాను సంపాదించానని హ్యాకర్ తన డార్క్‌వెబ్ పేజీలో పేర్కొన్నాడు. శాంపిల్‌గా మొదట 32,000 లైన్ల డేటాను అందరికీ కనిపించేలా పెట్టాడు. ఆయా బీఎస్ఎన్ఎల్ ఫైబర్, ల్యాండ్‌లైన్ యూజర్ల పేరు, ఈమెయిల్ ఐడీ, బిల్లుల సమాచారం, ఫోన్ నంబర్లు, ఇతర వ్యక్తిగత డేటాను వెబ్‌సైట్‌లో విక్రయానికి పెట్టాడు. కస్టమర్ ఇన్ఫర్మేషన్, నెట్‌వర్క్ వివరాలు, ఆర్డర్లు, హిస్టరీ అందులో ఉన్నాయి. డేటా చోరీతో వెంటనే అప్రమత్తమై తమ యూజర్ల డేటా రక్షణకు బీఎస్ఎన్ఎల్ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు పెరిగాయి. ' ఇది బీఎస్ఎన్ఎల్‌కు, దాని వినియోగదారులపై విస్తృతస్థాయిలో దుష్పరిణామాలు చూపిస్తుంది' అని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కనిష్క్ గౌర్ ఆందోళన వ్యక్తంచేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 24 : డిసెంబర్ : 2023

ఎక్కడికీ వెళ్లకపోయినా కోవిడ్ వచ్చింది

మైసూరు: మైసూరు జిల్లాలో పలువురికి కోవిడ్ సోకింది, అయితే వారు ఎక్కడా దూరప్రాంతాలకు ప్రయాణించకపోయినా వైరస్ రావడం గమనార్హం. కోవిడ్ కేసులు విస్తరిస్తున్న తరుణంలో 60 ఏళ్ల పైబడిన వారు మాస్కు తప్పనిసరిగా ధరించాలని జిల్లా కలెక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. శనివారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఏడు కోవిడ్ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఆ ఏడు మంది ఎలాంటి ప్రయాణాలు చేయలేదన్నారు. మైసూరులో రోజూ ముమ్మరంగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోగ లక్షణాలుంటేనే టెస్టులు చేస్తారన్నారు. సరిహద్దు జిల్లా ప్రాంతాల్లో నిఘాను పెంచినట్లు తెలిపారు. కొత్త ఏడాది వేడుకలపై ఎలాంటి నిర్బంధం లేదన్నారు.

న్యూస్‌రీల్

వరుస సెలవులు

- ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ట్రాఫిక్ జామ్



బారులు తీరిన వాహనాలు

దొడ్డబళ్లాపురం: వీకెండ్, క్రిస్మస్ నేపథ్యంలో బెంగళూరు నివాసులు సొంత ఊర్లకు, టూర్లకు వాహనాలలో బయలుదేరడంతో బెంగళూరు, మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై శనివారం తెల్లవారుజాము నుండే వాహనాలు బారులు తీరడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బెంగళూరు నుండి మైసూరుకు వెళ్లే టోల్ వద్ద అయితే 5 కిలోమీటర్ల పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాలా వాహనాలకు ఫాస్ట్‌ట్యాగ్ లేకపోవడం ఉన్నా రీచార్జ్ అయిపోవడంతో టోల్ వద్ద సిబ్బంది ఫీజు వసూలు చేస్తుండడంతో మరింత ఆలస్యం అయ్యింది. వాహనాలు భారీగా రోడ్డెక్కడంతో ఎక్స్‌ప్రెస్‌వేపై పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అలర్ట్ చేసారు.

కేరళ సరిహద్దుల్లో కోవిడ్ కట్టడి చర్యలు

మైసూరు: రాష్ట్రంలో కోవిడ్ మహమ్మారి జేఎన్-1 విస్తరిస్తున్న నేపథ్యంలో కేరళ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు వైద్య ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. శనివారం మైసూరు జలదర్శిని గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మంత్రి మాట్లాడుతూ... కేరళ తర్వాత కర్ణాటకలో కోవిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కేరళ తర్వాత అత్యధికంగా ఆర్టీపీసీఆర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి ఐదు వేల పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేరళ సరిహద్దు జిల్లాలు అయిన మంగళూరు, కొడగు, చామరాజనగర, మైసూరు జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

మైసూరు: మైసూరు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థాపించిన కర్మాగారాల్లో స్థానికులకు తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పించాలని సీఎం సిద్ధరామయ్య సూచించారు. శనివారం నగరంలో జరిగిన వివిధ కర్మాగారాల అధినేతలు, యజమానులతో సమావేశంలో సీఎం మాట్లాడారు. స్థానికుల్లో నైపుణ్యం కలిగిన వారు లభించని స్థితిలో మాత్రమే బయట నుంచి ఉద్యోగులను తెచ్చుకోవాలని సీఎం సిద్ధరామయ్య అన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతోనే కర్మాగారాల స్థాపనకు అనుమతులిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలు కొరవడితే వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు తీసుకోవాలని కోరారు.

టికెట్ రాకుంటే స్వతంత్రంగా పోటీ : సుమలత

మండ్య: వచ్చే లోకసభ ఎన్నికల్లో బీజేపీ నుంచి టికెట్ లభిస్తే మండ్య నుంచి పోటీ చేస్తానని, ఒకవేళ రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎంపీ సుమలత అంబరీశ్ శనివారం స్పష్టం చేశారు. మద్దూరు తాలూకా కేఎం దొడ్డి గ్రామంలో అంబరీశ్ మద్దతుదారుల సమావేశంలో పాల్గొని మీడియాతో మాట్లాడుతూ... మండ్య తన కర్మభూమి అని, ఈ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయాలనేది కోరిక అని చెప్పారు. తన పోటీపై ఎలాంటి వదంతులు వచ్చినా అభిమానులు పట్టించుకోవద్దని, మండ్య నియోజకవర్గం నుంచే పోటీ చేయబోతున్నట్లు తెలిపారు. మార్చి తర్వాత తుది నిర్ణయం ప్రకటిస్తానని ఆమె చెప్పారు.



ముక్కోటి ఏకాదశి సందర్భంగా మంగళూరులోని వెంకటరమణ స్వామి ఆలయంలో అలంకారం

దర్శన భాగ్యం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం బెంగళూరు ఇస్కాన్ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం



బెంగళూరులోని కోటి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠవాసున్ని దర్శించుకున్న భక్తజనం



హంపీ సమీపంలో అంజనాద్రి పర్వతంపై హనుమ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మళ్లీ హిజాబ్ హీట్

- నిషేధం ఎత్తివేస్తామన్న సీఎం సిద్దు
- భగ్గుమన్న ప్రతిపక్ష బీజేపీ నేతలు
- విభజన రాజకీయాలని ధ్వజం
- నిషేధం తొలగించలేదని తాజాగా సీఎం వివరణ



సీఎం సిద్దు



హిజాబ్ రద్దు సమయంలో ఉడుపి జిల్లాలోని ఓ పాఠశాలలో పోలీసు బందోబస్తు (ఫైల్)

శివాజీనగర: విద్యాలయాల్లో హిజాబ్/ బుర్కా నిషేధం మళ్లీ చర్చనీయాంశమైంది. నిషేధాన్ని ఎత్తివేశామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించడం కారణం. బీజేపీ నాయకులు హిజాబ్ నిషేధ రద్దు ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించారు. సిద్దరామయ్య సమాజాన్ని విభజించేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. దీంతో రాష్ట్రంలో మళ్లీ హిజాబ్ అనుకూల- వ్యతిరేక సంఘర్షణ ఆరంభమైనట్లయింది. సుమారు ఏడాది కిందట అప్పటి బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో ముస్లిం బాలికలు హిజాబ్ లేదా బుర్కా ధరించరాదని నిషేధించడం తెలిసిందే. ఫలితంగా కొన్నిరోజుల పాటు తీవ్ర అలజడి నెలకొంది.

విషబీజాలు నాటే యత్నం

మాజీ సీఎంలు యడియూరప్ప, బసవరాజ బొమ్మై, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర, బీజేఎల్పీ నేత ఆర్.అశోక్, మాజీ మంత్రి సీ.టీ.రవి, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌తో పాటుగా బీజేపీకి చెందిన అనేకమంది నాయకులు సీఎం ప్రకటనపై మండిపడుతూ హిజాబ్ నిషేధాన్ని తొలగిస్తే తీవ్ర పోరాటం చేపడతామని హెచ్చరించారు. శనివారం ఢిల్లీలో బీవై విజయేంద్ర, హిజాబ్ నిషేధం రద్దు తీర్మానం ఖండనీయమని, సిద్దరామయ్య మతాల మధ్య విష బీజం నాటే పనులను చేస్తున్నారు. యువజనులను మతం ఆధారంతో విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. విద్యా రంగాన్ని కలుషితం చేసే పనికి సీఎం పూనుకొంటున్నారన్నారు. ఎవరూ కూడా హిజాబ్ నిషేధాన్ని రద్దు చేయాలనే డిమాండ్ చేయలేదని, బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. విద్యాలయాల్లో యూనిఫాం ఉండాలని, అల్పసంఖ్యాకుల కోసం ఇలా మాట్లాడారని విమర్శించారు.

సీఎం మాటల వెనుక కుట్ర: అశోక్

సిద్దరామయ్య వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్ర ఉందని ఆర్.అశోక్ ఆరోపించారు. హఠాత్తుగా ఈ విషయాన్ని లేవనెత్తడం వెనుక మర్మమేమిటన్నారు. గ్యారంటీ పథకాల వల్ల ఖజానా ఖాళీ అయ్యింది. సమస్యల చక్రవ్యూహంలో ఇరుక్కొన్న సీఎం హిజాబ్ విషయాన్ని ప్రస్తావించి ప్రజలను తప్పుదారి పట్టించాలనుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల మనస్సుల్లో ఐక్యత పెంచడానికి పాఠశాలల్లో మాత్రమే యూనిఫాంని తప్పనిసరి చేసి హిజాబ్ నిషేధించారు, బయట హిజాబ్‌ను ధరించవచ్చు అని బీజేపీ నేత సీటీ రవి అన్నారు. ఇష్టమొచ్చినట్లుగా చేసేందుకు సీఎం సిద్దమయ్యారా అనేది స్పష్టం చేయాలన్నారు.

అబ్బే.. అప్పుడే కాదు: సీఎం

మైసూరు: గత బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో హిజాబ్ ధరించరాదని నిషేధించింది, మా ప్రభుత్వం ఆ ఆదేశాలను వెనక్కు తీసుకుందని సీఎం సిద్దరామయ్య అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లాలోని నంజనగూడులో ఈ మేరకు ప్రకటించడం తెలిసిందే. కానీ ప్రతిపక్షం నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆయన మెత్తబడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ హిజాబ్‌పై నిషేధాన్ని రద్దు చేయలేదని, తన సమాధానాన్ని మీడియా మరోరకంగా రాసిందని అన్నారు. దీంతో వివాదాన్ని చల్లారే యత్నం చేశారు.

ముందు తరాలకు తెలుగు వారసత్వం



ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

శివాజీనగర: తెలుగు భాష-సంస్కృతులను కాపాడుకోవటంతో పాటు, ఘనమైన తెలుగు వారి వారసత్వాన్ని ముందు తరాలకు అందించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బెంగళూరు వేదికగా రాష్ట్రేతర తెలుగు సమాఖ్య 9వ జాతీయ భాషా సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. తెలుగు నేలకు ఆవల తెలుగు భాషాభివృద్ధికి సేవలు అందిస్తున్న తెలుగు సంస్థలన్నింటినీ ఒకే తాటి మీదకు తీసుకొచ్చిన రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ఆశయాన్ని అభినందించిన ఆయన, తెలుగు సమాజ నిర్మాణానికి సంగీత, సాహిత్య, భాషాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం ముదావహమని తెలిపారు. మన భావాలను తెలియజేయడానికి మాతృ భాషకు మించిన వారధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు బుద్ధప్రసాద్, ఆర్.సుందరరావు, పీ.వీ.పీ.సీ.ప్రసాద్, కే.కోటేశ్వరరావు, ఏ.రాధాకృష్ణరాజు, గంగరాజు, ఆదికేశవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశీయ రైతులను ఆదుకోవాలి



యశవంతపుర: విదేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను మన మార్కెట్‌లోకి అనుమతించటం వల్ల దేశంలోని రైతులకు కష్టాలు వచ్చాయని, దిగుమతి ఉత్పత్తులపై పన్నులు విధించి దేశీయరైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ ఏక్తా అధ్యక్షుడు లక్విందర్‌సింగ్ అలోక్ డిమాండ్ చేశారు. బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో శనివారం కిసాన్ మోర్చా ప్రపంచ రైతు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మన దేశంలోకి దిగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై పన్నులు విధించడం లేదు. దీంతో విచ్చలవిడిగా పంట ఉత్పత్తులు వస్తూ, మనదేశ రైతుల పంటలకు ధరలు దక్కడం లేదని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శనీశ్వర సన్నిధిలో ఏకాదశి శోభ



హారతి అందుకుంటున్న భక్తులు

పావగడ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పావగడలోని ప్రసిద్ధ శ్రీ శనీశ్వరాలయానికి భక్తజనం పోటెత్తారు. స్వామివారికి తైలాభిషేకం, నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో నవగ్రహ దేవతల పూజా మంత్రాలను పఠించారు. అర్చకులు సత్యనారాయణ శాస్త్రి నవగ్రహ పూజలు, శీతలాంబదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అగ్నికుండంలో భక్తజనం నల్ల వత్తులు, నువ్వుల నూనె, నల్ల వస్త్రాలు సమర్పించి ప్రదక్షణలు చేశారు. అలాగే శని దోష నివారణ పూజలు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు.

క్రిస్మస్ వెలుగులు



త్వరలోనే క్రిస్మస్ నేపథ్యంలో శనివారం రాత్రి బెళగావిలోని ఓ చర్చికి అలంకారం

మద్యం తాగలేదని ప్రాణం తీశాడు

బనశంకరి: మద్యం మత్తులో కోపం లేదా అభిమానం .. ఏది ఎక్కువైనా ప్రమాదమే. మందు పార్టీలో మద్యం ఎక్కువ సేవించలేదని కోపగించుకుని స్నేహితున్ని హత్య చేశాడు. ఈ ఘటన నగరంలోని బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ నెల 18వ తేదీన జితేంద్రసింగ్ (24)ను మిత్రుడు బాబూలాల్‌సింగ్ మద్యం తాగడానికి తీసుకెళ్లాడు. జితేంద్రసింగ్ కొంచెమే తాగాడు, కానీ నీ కోసమే ఈ మందు పార్టీ అని, ఎక్కువగా తాగాలని బాబూలాల్ బలవంతం చేశాడు. నాకు మద్యం వద్దంటూ గదిలో దూరంగా వెళ్లి జితేంద్రసింగ్ కూర్చున్నాడు. మళ్లీ అక్కడకు వెళ్లిన బాబూలాల్ మద్యం తాగాలని గొడవకు దిగాడు, స్కార్ఫ్ వంటి బట్టతో గొంతుకు వేసి లాగడంతో జితేంద్రసింగ్ ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భయపడిన బాబూలాల్ అతని మృతదేహాన్ని సమీపంలో పొదల్లో పడేసి ఉడాయించాడు. విషయం తెలిసి బాగలూరు పోలీసులు బాబూలాల్‌ను శనివారం అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ఉత్తరాది వలస కూలీలని తెలిసింది.

ఆదమరిస్తే కరెంటు షాకే





బెంగళూరులోని జయనగరలో మనిషికి తాకేలా ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్, మరో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె లేకపోవడంతో పశువుల సంచారం

- సిలికాన్ సిటీలో 16 వేల షాకింగ్ స్పాట్లు గుర్తింపు
- చేతికందేలా ట్రాన్స్‌ఫార్మర్లు, జంక్షన్లు
- ఐదేళ్లలో 70 మంది మృత్యువాత

బనశంక: బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఇటీవల రోడ్డుపై విద్యుత్ తీగ తెగిపడి తల్లీబిడ్డ కరెంటు షాక్‌తో దహనం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. అంతకుముందు వర్షాల్లో స్కూటర్ మీద వస్తున్న మహిళ కరెంటు పోల్‌ను పట్టుకుని షాక్‌తో చనిపోయింది. ఇటువంటి ప్రమాదాలు సిటీలో తరచూ ఏదో ఒకచోట జరుగుతున్నాయి. ఏటా వేలాది కోట్ల రూపాయల బడ్జెట్ కలిగిన బెస్కాం- విద్యుత్‌శాఖ చిన్న చిన్న మరమ్మతులు కూడా నిర్వహించక సామాన్య ప్రజలు బలైపోతున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. బీబీఎంపీ పరిధిలో ఇంకా 16,791 చోట్ల ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి దగ్గర జాగ్రత్తగా లేకపోతే కరెంటు షాక్‌ను చవిచూడడం ఖాయం. కమర్షియల్ స్ట్రీట్, ఎంజీ రోడ్డు వంటి రద్దీ ప్రాంతాల్లోనూ నడుస్తూ ఉంటే చేతికి అందేలా ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు తీగలు దర్శనమిస్తాయి.

వేలాడే తీగలు

ఇక ఇళ్లకు కరెంటు కనెక్షన్లు, వీధి దీపాల వినియోగం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. ఎక్కడ చూసినా వేలాడుతున్న కరెంటు తీగలు, చిన్నారుల చేతులకు అందే ఎత్తులో జంక్షన్ బాక్సులు, టెర్మినేషన్ బాక్సులు నగరవ్యాప్తంగా కనిపిస్తాయి. అందులో కొత్త లేఔట్లు, మురికివాడల్లో విద్యుత్ స్తంభాల పరిస్థితి అయోమయంగా ఉంది. విద్యుత్ పోల్స్‌కి మద్దతుగా అమర్చిన వైర్లు కేబుల్స్ రోడ్ల మీదకు వచ్చి ప్రజలకు ప్రమాదకరంగా మారాయి.

వైట్‌ఫీల్డ్‌లో తల్లీకూతురు మృతితో ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమయ్యాక బెస్కాం మేలుకుంది. సార్వజనీక స్థలాల్లో ప్రమాదకర స్థితిలోనున్న వైర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు గురించి సమీక్ష చేపట్టింది. నిర్లక్ష్యానికి గురైన 23,187 విద్యుత్ షాకింగ్ స్పాట్స్‌ను ఇందులో గుర్తించారు. 6,396 స్పాట్స్‌లో అత్యవసరంగా మరమ్మత్తులు చేపట్టారు.

పాత వైర్లు, వ్యవస్థలు

బీబీఎంపీ పరిధిలోని 11 కేవీ విద్యుత్ సామర్థ్యం కలిగిన 9,057 కిలోమీటర్లు హెచ్‌టీ, 8,937 కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లు ఉన్నాయి. జనావాసాల్లోని అనేక లైన్లు దశాబ్దాల క్రితం నాటివి. అవి తరచూ తెగి పడడం వల్ల విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నగరంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను బెస్కాం, వీధి దీపాల నిర్వహణ, వాటికి కరెంటు కనెక్షన్లు, ఎల్‌టీడీ బాక్సుల నిర్వహణను పాలికె చూస్తుంది. రెండు విభాగాలూ సమర్థంగా పనిచేస్తే విద్యుత్ ప్రమాదాలను తగ్గించవచ్చు.



వైట్‌ఫీల్డ్‌లో కరెంటు వైర్లకు బలైన తల్లీబిడ్డ (ఫైల్)

5 ఏళ్లలో 70 మంది...

గత ఐదేళ్లలో బెస్కాం నిర్లక్ష్యంతో బెంగళూరులో 81 మంది విద్యుత్ షాక్ తగలడంతో వీరిలో 70 మంది అకాల మృత్యువాత పడ్డారు. 2023లో బెస్కాం విద్యుత్ వైర్ల ప్రమాదంలో 8 మంది ప్రజలు మరణించగా, 2022లో 22 మందికి విద్యుత్ షాక్ తగలగా 19 మంది చనిపోయారు. వలయాలవారీగా చూస్తే షాకింగ్ స్పాట్స్ బెంగళూరు ఉత్తరలో 452, తూర్పులో 1490, పశ్చిమలో 4572, దక్షిణలో 10,277 ఉన్నాయి.

లోకాయుక్త వలలో పురసభ ఈఓ



ఆఫీసు వద్ద లోకాయుక్త సిబ్బంది

మండ్య: ఒక స్థలానికి సంబంధించి ఖాతా మార్పు కోసం ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ మండ్య పురసభ ఈఓ రాణి, రెవెన్యూ అధికారి గిరీశ్‌లు లోకాయుక్తకు చిక్కారు. మండ్య చాముండేశ్వరి నగరలో నివాసం ఉండే ప్రశాంత్ అనే వ్యక్తికి చెందిన స్థలం తనతో పాటు తల్లి పేరిట ఉంది. ఇటీవల తల్లి చనిపోవడంతో ఆ స్థలాన్ని తన పేరిట మార్చాలని ప్రశాంత్ అక్టోబర్‌లో పురసభలో అర్జీ ఇచ్చాడు. పని జరగాలంటే రూ.1.80 లక్షల లంచం ఇవ్వాలని రాణి, గిరీశ్‌లు అతన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రశాంత్ లోకాయుక్తను ఆశ్రయించాడు. శనివారం మధ్యాహ్నం కార్యాలయంలోనే వారిద్దరూ లంచం తీసుకుంటుండగా డీఎస్పీ సునీల్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది దాడి చేసి అరెస్టు చేశారు.

గ్యాస్ గీజర్ వాయువు లీక్.. మహిళ మృతి

బనశంకరి: వేడి నీళ్ల కాచుకునే గ్యాస్ గీజర్ లీక్ కావడంతో తల్లి మృతిచెందగా కూతురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బెంగళూరు సదాశివనగరలో చోటుచేసుకుంది. రమ్యా (23) నాలుగేళ్ల కుమార్తెకు స్నానం చేయిస్తుండగా గ్యాస్ గీజర్ నుంచి కార్బన్ మోనాక్సైడ్ వాయువు లీక్ అయ్యింది. ఇంటి కిటికీలు, తలుపులు మూసి ఉంచడంతో వాయువు గాఢత అధికమైంది. ఎక్కువసేపు ఆ వాయువును పీల్చడం వల్ల తల్లి, కూతురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబీకులు ఇద్దరినీ ఎంఎస్.రామయ్య ఆసుపత్రికి తరలించగా రమ్యా మృతి చెందింది, బాలికకు చికిత్స అందిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కోలారు: వైకుంఠ ఏకాదశికి శనివారం నగరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనం తెల్లవారు జాము 4 గంటల నుంచే పెద్ద ఎత్తున క్యూలో నిలుచున్నారు. వైకుంఠ ద్వారా వచ్చి స్వామి దర్శనం చేసుకుని భక్తులు తరించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలను నిర్వహించారు. పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి దర్శనం కోసం వచ్చి భక్తుల క్యూ సాయంత్రం గంటల వరకు తగ్గలేదు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అదేవిధంగా నగరంలోని వరదరాజస్వామి దేవాలయంలోను, వేణుగోపాల స్వామి దేవాలయంలో, వెంకటాపురం గ్రామంలోని 800 సంవత్సరాల నాటి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వారం ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు.

చిక్కతిరుపతిలో భక్తుల క్యూ

మాలూరు: పురాణ ప్రసిద్ధ రెండో తిరుపతిగా ప్రఖ్యాతి గాంచిన మాలూరు చిక్కతిరుపతి ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ద్వారం కింద నడిచి తరించారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వారం ద్వారా శ్రీమన్నారాయణుడు ముక్కోటి దేవతలకు దర్శనం ఇచ్చాడని ప్రతీతి. భక్తులు వైకుంఠ ద్వారం గుండా నడిచి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో స్వామి దర్శనం కోసం భక్తులకు ఆలయ సమితి సకల ఏర్పాట్లు చేసింది. భక్తులు క్యూలో నిలబడి గోవిందనామ స్మరణ చేస్తూ దైవ దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నసంతర్పణ జరిగింది. దేవాలయ ప్రధాన అర్చకులు రవి నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సకల సౌలభ్యాలను కల్పించారు. ఎంపీ మునిస్వామితో పాటు పలువురు ప్రముఖులు ఆలయానికి తరలివచ్చి దర్శనభాగ్యం పొందారు.

వేంకటరమణ స్వామికి ప్రత్యేక పూజలు

కేజీఎఫ్: తాలూకాలోని ప్రసిద్ధ గుట్టహళ్లి బంగారు తిరుపతి వెంకటరమణస్వామి దేవాలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేకపూలతో స్వామి వారిని విశేషంగా అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. లోక్‌సభ సభ్యుడు ఎస్ మునిస్వామి, తదితర ప్రముఖులు స్వామి దర్శనం చేసుకున్నారు. కేజీఎఫ్ నగరంలోని వెంకటరమణస్వామి దేవాలయం, యర్రనాగనహళ్లి వెంకటరమణ దేవాలయం, దొడ్డకంబళి వెంకటేశ్వరస్వామి దేవాలయం, బేతమంగల విజయేంద్ర దేవాలయం, కోటిలింగేశ్వర దేవాలయంలోను వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు తరలి స్వామి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం నగరంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాయంలోను, అదేవిధంగా తాలూకాలోని యరగానహళ్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. వైకుంఠ ద్వారాన్ని భక్తులు ప్రవేశించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు.


కోలారు: వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అలంకరణ


కోలారు: లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి పూజలు దృశ్యం


కోలారు: వరదరాజ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం


మాలూరు: ప్రత్యేక అలంకరణలో స్వామివారు


కేజీఎఫ్: అలంకరణలో స్వామివారు


కేజీఎఫ్: ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


కోలారు: ఆలయం వద్ద స్వామి వారి దర్శనం కోసం క్యూ కట్టిన జనం

క్లుప్తంగా

కృష్ణాపురంలో ఏకాదశి పూజలు


వైకుంఠ దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని చిన్న తిరుపతిగా పిలిచే కృష్ణాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. తొలుత స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం నుంచి వైకుంఠాన్ని దర్శించుకున్నారు. అర్చకులు నారాయణ భట్టర్ స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణాలతో మారుమోగింది.

సీడీ విడుదల


సీడీ విడుదల చేస్తున్న దృశ్యం

బనశంకరి: కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో ఖ్యాతి గడించి ప్రత్యేకంగా సుప్రభాతంలో పేరెన్నిక గల భారత రత్న డాక్టర్ ఎంఎస్ సుబ్బలక్ష్మీ మనవరాళ్లు ఎస్.ఐశ్వర్య, ఎస్.సౌందర్య వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం జేపీ.నగర తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆవరణలో ఏ2 క్లాసికల్ మ్యూజిక్ సంస్థాపకుడు, నిర్మాత గీత రచయిత పీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర సుబ్రహ్మణ్య భక్తి సంగీత సీడీని విడుదల చేశారు.

సిరిధాన్య మేళా షురూ

చింతామణి: మన పూర్వీకులు సిరిధాన్యాలను తినడం వల్ల చాలా ఆరోగ్యంగా ఉండేవారని, ప్రస్తుతం ఆధునిక యుగంలో జీవనశైలిని మార్చుకోవడంతో అనారోగ్యానికి లోనవుతున్నారని, కాబట్టి ప్రతి ఒక్కరు సిరి ధాన్యాలను సేవించాలని ఉన్నత విద్యాశాఖమంత్రి ఎంసీ సుధాకర్ అన్నారు. పట్టణంలో శనివారం జిల్లా స్థాయి సిరిధాన్యాల మేళాను ఆయన ప్రారంభించారు. పలు జిల్లాల నుంచి రైతులు పాల్గొన్నారు. పలురకాల ధాన్యాలతో పాటు వంటకాలను ప్రదర్శించారు. సీఈఓ ప్రకాష్, ఎస్పీ నాగేష్, తహశీల్దార్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ ట్రాక్ ప్రారంభం

బనశంకరి: బెంగళూరు త్వరలో దేశానికి క్రీడల నిలయం కానుందని కేంద్ర యువజన క్రీడా శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. శనివారం నగరంలోని సుభాష్ కేంద్రంలోని జాతీయ క్రీడా ప్రాధికారలో రూ.69.35 కోట్లతో నిర్మించిన పురుషులు, మహిళా క్రీడాకరుల వసతి నిలయం, సింథటిక్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. ఇక్కడ క్రీడాకారులకు ఆధునిక శిక్షణ లభిస్తుందని తెలిపారు. ట్రాక్‌ను ఖేలో ఇండియా కింద అభివృద్ధి చేశామని తెలిపారు.

నరేగ పనుల పరిశీలన


పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి తండాలో చేపడుతున్న నరేగ పనులను శనివారం జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాల దీక్ష విరమణకు ఏర్పాట్ల పరిశీలన


కొబ్బరికాయ కొట్టి వంట పనిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: అంజనాద్రి కొండపై హనుమ మాల దీక్ష విరమణకు చేపట్టిన అన్ని ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఉదయాన్నే ఎమ్మెల్యే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని కొండపైకెక్కి బాలాంజనేయ స్వామికి విశేష పూజలను చేశారు. అనంతరం ఆయన సంస్కృత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వంటశాలకు వెళ్లి పొయ్యిని వెలిగించి వంట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూరగాయలు, సరుకులు నాణ్యతగా ఉన్నాయా? అని పరిశీలించారు. అనంతరం ఆయన అక్కడే ఉండి పలు కార్యక్రమాలను తిలకించారు. కాగా అంజనాద్రి కొండను విద్యుత్ దీపాలంకరణ గావించడంతో పాటు భోజన శాలలో వంట, పార్కింగ్ వ్యవస్థ, పోలీస్ బందోబస్తు, తాగునీరు, స్నానఘట్టాలు తదితర ఏర్పాట్లను సిద్ధం చేశారు.

కోచిముల్ నియామకాలు పారదర్శకం

కోలారు: కోచిముల్ నియామకాలు పారదర్శకంగా జరిగాయని, ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని కోచిముల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శనివారం కోచిముల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కోచిముల్‌లో ఉన్న కొందరు తనపై అక్కసుతో నకిలీ జాబితాను సిద్ధం చేసి సోషల్ మీడియాలో విడుదల చేశారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. డైరెక్టర్లు ఊలవాడి నాగరాజ్, హనుమేష్, వడగూరు డి వి హరీష్, కాడేనహళ్లి నాగరాజ్, జయసింహ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

అసలైన మతతత్వ పార్టీ కాంగ్రెస్సే

కోలారు: అసలైన మతతత్వ పార్టీ కాంగ్రెస్సేనని లోక్‌సభ సభ్యుడు ఎస్ మునిస్వామి ఆరోపించారు. శనివారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య హిజాబ్‌పై నిషేధాన్ని ఎత్తేయడమే వారి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. బీజేపీని పదేపదే మతతత్వ పార్టీ అని అంటున్న సిద్దరామయ్య హిజాబ్ ఆదేశాన్ని వాపసు తీసుకుంటామని ఎలా అంటారని అన్నారు. సిద్దరామయ్య కేవలం ఒక సముదాయానికి మాత్రమే సీఎంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హిందూ సముదాయ విద్యార్థులు కేసరి శాలువాలు వేసుకుని వెళితే ప్రభుత్వం అనుమతిస్తుందా? అని ప్రశ్నించారు. ఒక్కో మతానికి చెందిన వారు ఒక్కో రకం దుస్తులు ధరించి విద్యా సంస్థలకు వెళితే సరిగా ఉంటుందా? అని నిలదీశారు. పాఠశాలలు, కళాశాలల్లో అందరు సమానం అనే భావన కలగాలనే యూనిఫాం నిబంధన విధించారని, విద్యార్థులందరూ దీనిని పాటించడం సబబుగా ఉంటుందన్నారు.

విద్యుత్ సురక్షతపై అవగాహన అవసరం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: విద్యార్థులు విద్యుత్ సురక్షతపై ప్రజలకు అవగాహన కల్గించాలని బెస్కాం ఉప విభాగ కార్యపాలక ఇంజినీర్ పి.రామతీర్థ తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యుత్ సురక్షతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులను అందించి మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకుండా రైతులకు సలహా ఇవ్వాలన్నారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే వెంటనే బెస్కాంకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ సురక్షతా చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంజినీర్లు నంజుండేశ్వర, సుదర్శన్, బీఆర్‌సీ సంయోజకురాలు కేసీ వసంత పాల్గొన్నారు.

బిందుసేద్య పరికరాల పంపిణీ


పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణానాయక్

కంప్లి: హూవిన హడగలి రైతు కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే కృష్ణానాయక్ లబ్ధిదారులకు బిందుసేద్య పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ఇకపై రైతాంగం ప్రభుత్వ వివిధ పథకాల కింద దరఖాస్తులు అందిస్తే అర్హులకు వ్యవసాయ సంబంధిత వివిధ పరికరాలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ మహ్మద్ అష్రఫ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


● **అలర్ట్**
హిందూ సంఘాలచే దత్త జయంతి, దత్త మాలా అభియాన్ కార్యక్రమాల నేపథ్యంలో చిక్కమగళూరులో పోలీసులు భద్రతను పెంచారు. శనివారం కవాతు నిర్వహించిన దృశ్యం

రైతుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం


చిత్రపటాలకు మంత్రి తదితరుల పుష్పాంజలి

రాయచూరు రూరల్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. శనివారం వీరశైవ కళ్యాణ మంటపంలో మాజీ ప్రధాని చరణ్ సింగ్ చౌదరి, పుట్టణ్ణయ్య జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. 75 ఏళ్లు గడిచినా రైతులు సమస్యల వలయం నుంచి బయటికి రాకపోవడాన్ని గుర్తు చేశారు. అధ్యక్ష స్థానం అలంకరించిన రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఆధారంగా మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఏపీఎంసీ, విద్యుత్ చట్టాలను ఉపసంహరించకుండా ఉండడాన్ని తప్పుబట్టారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కరువు సహాయక పనులకు నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. సమావేశంలో మేలుకోటె శాసన సభ్యుడు దర్శన్ పుట్టణయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్, నాయకులు బూదయ్య స్వామి, మల్లన్న, దేవరాజ్ నాయక్ తదితరులున్నారు.

సామూహిక వివాహాలు పేదలకు వరం

కంప్లి: మఠాలు, మాన్యాల్లో ఏర్పాటు చేసిన సామూహిక వివాహాలు పేద కుటుంబాలకు ఎంతో సహాయకరం అని, దుబారా ఖర్చులకు కళ్లెం వేయవచ్చని ఎమ్మెల్యే కృష్ణానాయక్ తెలిపారు. హూవిన హడగలి తాలూకా లింగనాయకనహళ్లి జంగమ క్షేత్ర మఠంలో ఏర్పాటు చేసిన సామూహిక వివాహ కార్యక్రమంలో 24 జంటలు ఒక్కటై సప్తపదిలో కాలు మోపిన వారిని ఆశీర్వదించి మాట్లాడుతూ సతిపతులు ఒకరినొకరు అర్థం చేసుకుని ఉత్తమ జీవితం సాగిస్తూ అందరికీ ఆదర్శం కావాలన్నారు.

మొరార్జీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ


కంప్లి: పట్టణంలోని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో విద్యార్థులు నిత్యం చన్నీళ్ల స్నానం చేయడం వల్ల చర్మ తదితర వ్యాధులు సోకి సుమారు 20 మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయిన సమాచారం తెలుసుకున్న రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యులు శేఖర్ ఎస్.కోసంబి శనివారం పాఠశాలను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. వసతి పాఠశాలలోని విద్యార్థులు చర్మవ్యాధి సోకి ఇళ్లకు వెళ్లిపోతే వారిపై ఎందుకు శ్రద్ధ చూపలేదని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇకపై విద్యార్థుల స్నానాలకు వేడినీళ్ల ఏర్పాటు చేయడంతో పాటు నిత్యం వారి యోగక్షేమాలు విచారిస్తూ ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చేసుకోవాలని సూచించారు.

2ఏ రిజర్వేషన్ కల్పించకుంటే పోరాటం


మాట్లాడుతున్న బసవజయ మృత్యుంజయ స్వామి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వీరశైవ లింగాయత్ పంచమసాలి వర్గానికి 2ఏ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని లింగాయత్ పంచమసాలి కూడల సంగమ పీఠాధిపతి జగద్గురు బసవజయ మృత్యుంజయ స్వామి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లింగాయత్ పంచమసాలికి 2ఏ రిజర్వేషన్ కల్పించాలని రెండేళ్ల నుంచి ఆందోళనలు, పాదయాత్రలు చేసినా సర్కార్ స్పందించలేదన్నారు. చివరికి ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై 2ఏకు బదులుగా 2డీని ప్రకటించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచమసాలి వర్గానికి 2ఏ రిజర్వేషన్ కేటాయించాలని రెండుసార్లు సీఎం సిద్దరామయ్యను కోరినా ఫలితం లేదన్నారు. ఈ విషయంపై జనవరి 14లోగా సర్కార్ అభిప్రాయాన్ని ప్రకటించక పోతే ఆందోళనలకు శ్రీకారం చుడతామన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు


ప్రారంభిస్తున్న ప్రశాంతసాగర స్వామీజీ

కంప్లి: ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపరాదని కూడ్లిగి హిరేమఠ సంస్థాన పీఠాధ్యక్షులు, మఠాధీశుల ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు ప్రశాంతసాగర స్వామీజీ తెలిపారు. కూడ్లిగిలోని హిరేమఠ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన హృద్రోగ ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి సలహా సూచనలు అందించారు. ఉద్యోగాలతో పాటు వివిధ ఒత్తిళ్లు, మారిన ఆహార పద్ధతులతో గుండె, మానసిక వ్యాధులు పెరుగుతున్నాయన్నారు.

వేడుకగా గురుకొట్టూరేశ్వర స్వామి కార్తీకోత్సవం

కంప్లి: గురుకొట్టూరేశ్వర స్వామి కార్తీకోత్సవం సందర్భంగా గురు కొట్టూరేశ్వర స్వామి మాలధారుల 25వ సంవత్సరపు ఊరేగింపు వైభవంగా జరిగింది. పత్రి బసవేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. హాలస్వామి మఠపు అభినవ హాలసిద్దేశ్వర, గద్దికేరి చరందేశ్వర స్వామీజీ ఊరేగింపును ప్రారంభించారు.

మంత్రముగ్ధం.. పుష్ప రూపం


లక్ష్మీసోమేశ్వరాలయం వద్ద పూల మొక్కలను పేర్చుతున్న సిబ్బంది


ప్యాలెస్ ఆవరణలో రూపుదిద్దుకున్న హంపీ నరసింహుడు


గజరాజు, ఒడెయార్‌ల నమూనాలు

- మైసూరు ప్యాలెస్ ఆవరణలో మ్యాగీ ఫ్లవర్ షో ఆరంభం
- పదిరోజులు నేత్రానందం

మైసూరు: కొత్త ఏడాదికి మైసూరుకు వెళ్లే సందర్శకులకు శుభవార్త. అపురూపమైన ఫల పుష్ప ప్రదర్శన ఆకట్టుకోనుంది. క్రిస్మస్ వేడుకలు, కొత్త సంవత్సరం సంబరాల నేపథ్యంలో మైసూరు నగరంలోని ప్రఖ్యాత అంబావిలాస్ ప్యాలెస్ ఆవరణ ప్రజల కోసం అరుదైన ప్రదర్శన సిద్ధమవుతోంది. ప్యాలెస్ మండలి ఆధ్వర్యంలో మ్యాగీ ఫల పుష్ప ప్రదర్శన – 2023 ఆరంభమైంది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం రాత్రి ఈ ప్రదర్శనను ప్రారంభించి ఫల పుష్ప కళాకృతులను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

ఏమేం కళారూపాలు

గుజరాత్‌లో ప్రసిద్ధి చెందిన పురాతన సోమనాథేశ్వర దేవాలయం, సీతాకోక చిలుక, హంపీ నరసింహస్వామి, ఏకశిలా రథం, మలె మహదేశ్వర విగ్రహం, బ్రాండ్ మైసూరు లోగో, ఇటీవల కన్నుమూసిన కెప్టెన్ అర్జున ఏనుగు, నాల్వడి కృష్ణరాజ ఒడెయార్, కెంప నంజమ్మణి, శ్రీకంఠదత్త ఒడెయార్ కళారూపాలను కళాకారులు కమనీయంగా రూపొందించారు. వేలాది రంగురంగు పూల తో ఇవన్నీ నిర్మాణమయ్యాయి. అనేక రకాల పక్షులు, ప్రాణుల పుష్ప రూపాలు కూడా నగరవాసులతో పాటు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. వచ్చే నెల (జనవరి) 4వ తేదీ వరకు ఫ్లవర్ షో కొనసాగుతుంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా సందర్శకులు తరలిరావడంతో శనివారం తీవ్ర రద్దీ నెలకొంది.


హంపీ ఏకశిలా రాతి రథం నమూనా


పూలతో సీతాకోక చిలుక ఆకృతిని రూపొందించిన దృశ్యం


రకరకాల పూలతో తీర్చిదిద్దిన జట్కా బండి ఆకృతి

క్లుప్తంగా

పేదలకు కంటి పరీక్షలు


కంటి అద్దాలు అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలో పేదల కోసం ఉచితంగా ఆరోగ్య ధామ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి డి.ఎస్. రూపా, లోకేష్, హనుంత రాయప్ప తదితరులు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో పురసభ సభ్యురాలు సుధా నిరంజన్, నీలమ్మ, దేవ రాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కారులో మంటలు


కాలిపోతున్న కారు

దొడ్డబళ్లాపురం: హోటల్ ముందు నిలిపి ఉన్న కారులో హఠాత్తుగా మంటలు చెలరేగి కాలిపోయిన సంఘటన రామనగర సమీపంలోని బెంగళూరు, మైసూరు పాత రహదారి మార్గంలో చోటుచేసుకుంది. మైసూరు నుండి బెంగళూరు వెళ్తున్న కుటుంబం రహదారి పక్కన ఉన్న తాజ్ హోటల్ ముందు కారు నిలిపి హోటల్లో భోజనం చేస్తుండగా హఠాత్తుగా కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా కాలిపోయింది.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత


హ్యాండ్ బ్యాగ్‌లో తరలిస్తున్న బంగారం

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో హ్యాండ్ బ్యాగ్‌లో పేస్టు రూపంలో బంగారం దాచి తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుండి వచ్చిన ప్రయాణికుడి వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లో చెకింగ్‌లో బంగారం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా 816 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఉపాధ్యాయురాలి అరెస్ట్


హెచ్ఎం లక్ష్మీదేవమ్మ

యశవంతపుర: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే మరుగుదొడ్డిని శుభ్రం చేయించిన హెచ్ఎంను పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు నగర బ్యాడరహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలోని ఆంధ్రహళ్లి ప్రభుత్వ పాఠశాల ముఖ్యోపాధ్యాయురాలు లక్ష్మీదేవమ్మను పోలీసులు అరెస్ట్ చేశారు. 6వ తరగతి విద్యార్థులచే మరుగుదొడ్డిని శుభ్రం చేయిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావటంతో సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖాధికారి (బిఈఓ) అంజనప్ప బ్యాడరహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పాటు డీడీపీఐకి ఆధారాలు సమర్పించగా ఆమెను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెల్సిందే. తాజాగా అరెస్ట్ చేసి శుక్రవారం అర్ధరాత్రి మహిళ సాంత్వన కేంద్రానికి తరలించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

యశవంతపుర: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే కన్నడ చలనచిత్ర కప్ క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. సుదీప్, శివణ్ణ, గణేశ్, డాలీ ధనంజయలతో కలిపి ఆరు జట్లు నాలుగు విభాగాలలో మ్యాచ్‌లు జరుగనున్నాయి. సురేశ్‌రైనా, హర్షల్ గిబ్స్, రాబిన్ ఉత్తప్పలాంటి క్రికెట్ ఆటగాళ్లతో పాటు కన్నడ సినిమా రంగానికి చెందిన కళాకారులు పాల్గొన్నారు. ఉదయం సాంకేతికంగా సురేశ్ రైనా, రాబిన్ ఉత్తప్ప ప్రారంభించగా, సాయంత్రం ఐదు గంటలకు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ లాంఛనంగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

నేరాలు నియంత్రించండి


మాట్లాడుతున్న ఎస్పీ మిథున్ కుమార్

శివమొగ్గ: నగరంలో ఇటీవల నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని లేదంటే చర్యలు తీసుకుంటానని అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందికి ఎస్పీ బీకే మిథున్ కుమార్ హెచ్చరించారు. ఓసీ, మట్కా, పేకాట, జూదం వంటి నేరాలు బాగా పెరిగాయని, నేరాలపై ఉదాసీనతగా ఉండొద్దని ఎస్పీ సూచించారు. తన కార్యాలయం నుంచి మారువేషంలో బృందాలను పంపిస్తానని, ఆయా కేసులను, నేరాలను పరిశీలిస్తామని, ఎక్కడైనా అక్రమాలు, ఉదాసీనత, నిర్లక్ష్యం వహించినట్లు కనిపిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- ఉత్తర ద్వార దర్శనంతో కిక్కిరిసిన ఆలయాలు
- మారుమోగిన గోవింద నామస్మరణ

బొమ్మనహళ్లి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ అగర గ్రామంలోని ప్రసిద్ధి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతపురం చంద్రమౌళి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చలి గాలులు వీస్తున్న ప్రజలు క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు లడ్డూలను పంపిణీ చేశారు.

తుమకూరులో పోటెత్తిన భక్తులు

తుమకూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కల్పతరు నాడు తుమకూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తుమకూరు వెంకటేశ్వర స్వామి ఆలయం, రంగనాథ స్వామి ఆలయం, జయనగర రింగ్ రోడ్డులోని తిరుమల నగర దక్షిణ కేహెచ్‌బీ కాలనీలోని తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయం, జయనగర పద్మావతి అమ్మ వారి ఆలయం, టీజీఎంసీ బ్యాంకు ఎదుట ఉన్న మహాలక్ష్మీ ఆలయం, శిర గేట్‌లో ఉన్న సోమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు.

దొడ్డలో వైకుంఠ ఏకాదశి సంబరాలు

దొడ్డబళ్లాపురం: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా దొడ్డ తాలూకాలో పలు దేవాలయాలు కిటకిటలాడాయి. దొడ్డ పట్టణంలోని తేరువీధిలో ఉన్న శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో శనివారం తెల్లవారుజాము నుండే భక్తులు స్వామి దర్శనం కోసం బారులుతీరారు.


అగర లక్ష్మీ వెంకటేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ

ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తిరుమల కొండమీద స్వామికి జరిగే అన్ని సేవలూ ఇక్కడ కూడా ప్రసన్న వెంకటమణస్వామికి జరుగుతాయి. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం పంపిణీ చేసారు. తాలూకాలోని తూబుగెరెలో ఉన్న వెంకటరమణస్వామి దేవాలంలోనూ భక్తులు భారీగా విచ్చేసి స్వామి దర్శనం చేసుకున్నారు.

విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మండ్య: వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని విష్ణు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నుంచే దేవాలయాల్లో పూజా విధివిధానాలు ప్రారంభం అయ్యాయి. దైవమూర్తికి ఫలపంచామృత అభిషేకం, అలంకార సేవ తదితర వివిధ ధార్మిక పూజా కార్యక్రమాలను చేపట్టారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులకు దైవదర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు.

రాచనగరిలో ఆలయాలు కిటకిట

మైసూరు: రాచనగరి మైసూరులో శనివారం ఎక్కడ చూసినా వేంకటేశ్వర స్వామి నామస్మరణ వినిపించింది. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే నగరంలోని అన్ని ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. వైకుంఠ ద్వారంలో స్వామి వారిని దర్శించుకున్నారు.


తుమకూరులో స్వామివారికి విశేష అలంకరణ


మండ్యలో ఆలయంలో పూజలు


ఆలయంలో గోపూజ


స్వామివారిని దర్శించుకుంటున్న దృశ్యం

ఆలంబగిరిలో...

చింతామణి: తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో ప్రసిద్ధ శ్రీ లక్ష్మీవెంకటరమణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ధర్మాధికారి జయరాం దంపతులు ప్రత్యేకంగా గోపూజలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


అగరలో ఉత్తర ద్వారంలో వస్తున్న భక్తులు


తుమకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో...


తుమకూరులో ఓ ఆలయం వద్ద భక్తాదులు


దొడ్డలో స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

మైసూరు: విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన ఘటన నంజనగూడు తాలూకా దేవిరమ్మనహళ్లి వద్ద జరిగింది. హరతలె గ్రామానికి చెందిన దొడ్డ గండయ్య (65) మూత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు.

మంగళ సూత్రం చోరీ : బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని 50 గ్రాముల మంగళసూత్రాన్ని దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటన హుణసూరు తాలూకా బిళికెరెలో జరిగింది. బస్సులో మైసూరుకు వెళుతున్న సమయంలో తన పక్కనే ఒక శిశువుతో కూర్చొన్న మహిళ తన దృష్టిని మళ్లించి మంగళ సూత్రాన్ని దోచుకెళ్లింది. ఈ మేరకు హుణసూరు నివాసి మీనాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూ చుట్టూ నిశ్శబ్ద ప్రాంతం

మైసూరు: మైసూరు నగరంలో ఉన్న ప్రసిద్ధ చామరాజేంద్ర మృగాలయం, కారంజీ చెరువు చుట్టుపక్కల ఉన్న రోడ్లను నిశ్శబ్ద స్థలాలు అని నగర పోలీసు కమిషనర్ ప్రకటించారు. ఆ ప్రాంతంలో అపురూపమైన ప్రాణులూ, పక్షులు ఉన్నాయని, వాటి సురక్షత కోసం జూకి వచ్చే ప్రజలు శబ్దాలు చేయరాదని తెలిపారు. వాహనాల హారన్ కూడా మోగించరాదు. భారీ శబ్దం వచ్చే వాహనాలు అటువైపు వెళ్లరాదని తెలిపారు.

కాడుగొల్ల సముదాయానికి తీపి కబురు

బనశంకరి: రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కాడుగొల్ల సముదాయం నివసిస్తున్నారని ఇతర సముదాయాలకంటే భిన్న సంస్కృతి కలిగిన వారిని ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి అర్జున్‌ముండా హామీ ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన మాజీ ప్రధాని దేవెగౌడ, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, మాజీ సీఎం కుమారస్వామి ప్రధాని నరేంద్రమోదీని కలిసి కాడుగొల్ల సముదాయాన్ని ఎస్టీ జాబితాలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానికి అందించిన లేఖను కేంద్రమంత్రి అర్జున్‌ముండాకు కూడా అందించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారు.

ఫైటర్ రవికి సీసీబీ నోటీస్

బనశంకరి: స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మల్లికార్జున అలియాస్ ఫైటర్ రవి ఇంటిపై రెండు రోజులు క్రితం ఐటీశాఖ దాడి చేశారు. శనివారం సీసీబీ పోలీసులు ఫైటర్ రవి ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. 25న విచారణకు హాజరు కావాలని సూచించారు. ఏడాదిన్నర క్రితం నమోదైన కేసుకు సంబంధించి విచారణ సమయంలో ఫైటర్ రవి పేరు వినబడింది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరుకావాలని రవికి సూచించినట్లు సమాచారం.

కేఎస్ ఆర్టీసీ అదనపు సర్వీసులు

శివాజీనగర: క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం కేఎస్ ఆర్టీసీ అదనంగా బస్సులు ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయాణ చార్జీలో పది శాతం కూడా రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంతో పాటు అంతరాష్ట్ర సర్వీసులను తిప్పనుంది. దాదాపు 1000 బస్సులను వివిధ ప్రాంతాలకు నడపనుంది. కెంపేగౌడ బస్టాండ్ నుండి ధర్మస్థల, కుక్కేసుబ్రమణ్య, శివమొగ్గ, హాసన, మంగళూరు, కుందాపుర, శృంగేరి, హొరనాడు, దావణగెర, హుబ్లీ, ధారవాడ, బెళగావి, విజయపుర, గోకర్ణ, శిరసి, కారవార, రాయచురు, కల్బుర్గి, బళ్లారి, కొప్పళ, యాదగిరి, బీదర్, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ తదతర ప్రాంతాలతో పాటు మైసూరు రోడ్డు బస్టాండ్ నుంచి మైసూరు, హుణసూరు, పిరియాపట్టణ, విరాజపేట, కుశాలనగర, మడికేరి మార్గాల వైపు కార్యచరణ. తమిళనాడు, కేరళ వైపునకు అంటే మదురై, కుంభకోణం, చెన్నై, కోయంబత్తూర్, తిరుచ్చి, పాలక్కాడ్, త్రిచూర్, ఎర్నాకులం, కోజికోడ్, క్యాలికట్ తదితర అంతరాష్ట ప్రాంతాలకు వెళ్లే బస్సులు శాంతినగర బీఎంటీసీ బస్టాండ్ నుంచి బయలుదేరుతాయి. ప్రయాణికులు సీట్లను రిజర్వు చేసుకునే సదుపాయం కూడా ఉందని పేర్కొన్నారు.

గీతోత్సవం ప్రారంభం


గీతోత్సవ కార్యక్రమంలో స్వామీజీలు, ఎస్ఆర్.రమేశ్, అశ్విని పునీత్ తదితరులు

బనశంకరి: బసవనగుడి నేషనల్ కాలేజీ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించే కోటిగీత లేఖన యజ్ఞ సమితి గీతోత్సవ కార్యక్రమాన్ని శనివారం బసవనగుడి గోవర్ధనగిరి మఠం ముందుభాగంలో అశ్విని పునీత్‌రాజ్‌కుమార్, బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్ ప్రారంభించారు. కోటిమందికి పైగా శ్రీకృష్ణుడి భక్తులు రెండు నెలలు పాటు స్వహస్తాలతో భగవద్గీత రాశారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ సుగుణేంద్రతీర్థస్వామీజీ, సుశీంద్రతీర్థస్వామీజీ సమక్షంలో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య, తేజస్విని అనంత్‌కుమార్ పాల్గొన్నారు.

చిక్కలో విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

చిక్కబళ్లాపురం: నగరంలోని కందవారపేటలో కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, వెండి కవచ అలంకరణలు చేశారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదం పంపిణీ చేసింది. అదే విధంగా చెన్నకేశవ ఆలయంలో కూడా విశేష పూజలు జరిగాయి.

కార్లు ఢీ, ఒకరి మృతి

యశవంతపుర: రెండు కార్లు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా 8 మంది గాయపడిన ఘటన శనివారం మధ్యాహ్నం ధర్మస్థల–సుబ్రమణ్య జాతీయ రహదారి మర్ధాళ వద్ద జరిగింది. ఓమ్నీ వ్యాన్ నడుపుతున్న సోమవారపేట చౌడ్లు గ్రామం కెంచుమనె గ్రామానికి చెందిన రవి (53)ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. రవి తల్లి మణియమ్మ(75), భార్య వాణి (47), కూతురు రీషా (19), కొడుకు శరణ్(10), సోదరుడు యోగేశ్ (55), భార్య నీతు (45) కూతురు నేహ(24), కొడుకు అంజన్ (14)లు కడబ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

డ్రగ్స్ విక్రేతలు అరెస్ట్

మత్తు పదార్థాలను అమ్ముతున్న ముగ్గురిని మంగళూరు బజ్జె పోలీసులు అరెస్ట్ చేశారు. సూరత్కల్‌కు చెందిన అణ్ణప్పస్వామి, కేరళ కాసరగోడు జిల్లా మంజేశ్వరకు చెందిన మోహమ్మద్ జునైద్, మంగళూరు కుళాయి ఎంకే ఆకాశ్‌లను అరెస్ట్ చేశారు. వీరు ఈ నెల 21న బజ్జె గ్రామం శాంతిగుడ్డె చెక్‌పాయింట్ వద్ద బైక్‌లో వస్తుండగా గస్తీ పోలీసులు తనిఖీ చేయగా మత్తు పదార్థాలు బయటపడ్డాయి. నిందితులను అరెస్ట్ చేశారు.

బస్సుపై పిచ్చివాని రాళ్ల దాడి

- ప్రయాణికునికి తీవ్రగాయాలు

మండ్య: మద్యం మత్తులో ఒక వ్యక్తి ఆర్టీసీ బస్సుపై రాళ్లు విసరడంతో ఒక ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండ్యలో మళవళ్లి రోడ్డు ఈద్గా మైదానం వద్ద జరిగింది.

చామరాజనగర జిల్లా కొళ్లేగాళ డిపోకు చెందిన బస్సు (కేఏ 10 ఎఫ్ 369) బస్సు బెంగళూరు నుంచి కొళ్లేగాలకు వస్తోంది. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు మళవళ్లి రోడ్డు ఈద్గా మైదానం వద్ద బస్సు వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న హందినాగ నాగరాజు అనే మతిస్థిమితం లేని వ్యక్తి బస్సుపై రాళ్లు విసిరాడు. బస్సు ఎడమ వైపు కిటికీ సీట్లో కూర్చొన్న జయకుమార్ (30) అనే ప్రయాణికుని తలకు దెబ్బలు తగిలాయి. బాధితుడు కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును నిలిపేశాడు. వెంటనే బస్సులోకి చొరబడిన హందినాగ.. అందరినీ చంపేస్తానంటూ హల్‌చల్ చేశాడు. ప్రయాణికులు అతనికి దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. కొళ్లేగాళకు చెందిన క్షతగాత్రుడు జయకుమార్‌కు మద్దూరు, మండ్య ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించి బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.


గాయపడిన ప్రయాణికుడు

హోసూరు వార్తలు..

ఆరు షాపుల్లో దొంగతనం

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో దొంగతనాలు హడలెత్తిస్తున్నాయి. దుకాణాల తాళాలు పగులగొట్టి నగదు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటనపై సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రాజేశ్వరి లేఔట్, గోవింద అగ్రహారం తదితర ప్రాంతాల్లో వెయ్యికిపైగా చిన్న, సన్నకారు పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో చిల్లర దుకాణాలు, మెడికల్స్, ఫ్యాన్సీ స్టోర్స్, సెల్‌ఫోన్ షాపులున్నాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆ ప్రాంతంలోని ఆరు దుకాణాల్లో తాళాలు పగులగొట్టి నగదు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను దోచుకెళ్లారు. యజమానులు శనివారం ఉదయం షాపులకు వెళ్లగా దొంగతనం సంగతి బయటపడింది. బాధితులు సిప్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సహాయక సామగ్రి తరలింపు

హోసూరు: తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా తుపాను వరదలతో అతలాకుతలమైంది. వేలాది మంది ఇళ్లు సహా సమస్తం కోల్పోయారు. అనేక జిల్లాల్లో ప్రజలు, పలు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమాధిపతులు తూత్తుకుడి ప్రజలకు నివారణ వస్తువులను అందజేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ద్వారా రూ. 5 లక్షల విలువ చేసే వస్తువులను గుణం ఆస్పత్రి నుంచి పంపించారు.

చెరువులో పడి బాలుడు మృతి

క్రిష్ణగిరి: ఉద్దనపల్లి సమీపంలో 12 ఏళ్ల బాలుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకొచ్చింది. వివరాల మేరకు ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వరగానపల్లి గ్రామానికి చెందిన మునిరాజ్ కొడుకు కదిర్‌వేల్ (12) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో వరగానపల్లి ప్రాంతంలోని దేవగౌండన్ చెరువులో శవమై తేలినట్లు స్థానికులు ఉద్దనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి ఆత్మహత్య

సింగారపేట సమీపంలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. క్రిష్ణగిరి జిల్లా సింగారపేట సమీపంలోని కామరాజ్‌నగర్‌కు చెందిన వినోద్‌కుమార్ (30) ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కార్గో సేవలు ప్రారంభం

యశవంతపుర: నమ్మ కార్గో ట్రక్ సేవలను నెల రోజుల్లో నూరు, ఏడాదిలోపు ఐదు వందలకు పెంచనున్నట్లు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ఆయన శనివారం బెంగళూరులో నమ్మ కార్గో ట్రక్ సేవలను ప్రారంభించి మాట్లాడారు. పీణ్యలోని రవాణాశాఖకు చెందిన మండలిని బసవేశ్వరనగర బస్టాండ్‌ను నమ్మకార్గో ట్రక్‌సేవల టరిమ్నల్‌గా మార్పు చేస్తామన్నారు. బస్టాండ్‌లోని ప్రాంతంలో వాణిజ్య కట్టడాలను నిర్మించాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు.

నమో వేంకటేశాయ



హోసూరులో వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ, ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

- ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు

హోసూరు, కెలమంగలం, క్రిష్ణగిరి: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దర్శనం కోసం తరలివచ్చారు. శనివారం వేకువ జామునే ఆలయాల ముందు బారులు తీరారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్ నగర్ ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధి పొందిన కాడువేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు. పారిశ్రామికవాడ, హోసూరు పట్టణ వాసులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కొండపై వెలసిన ఆలయంలో విశేష పూజలు జరిగాయి. రాత్రి భజనలు, నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

గుడిసెట్లు, డెంకణీకోటలో

గుడిసెట్లు తిమ్మరాయస్వామి ఆలయంలోను, సూళగిరి తాలూకా కామనదొడ్డి వద్ద వెలసిన దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన ప్రసిద్ధి పొందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు. డెంకణీకోట తేరుపేటలో వెలసిన ప్రసిద్ధి పొందిన బేటరాయస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. డెంకణీకోట, తళి, అంచెట్టి తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కెలమంగలంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.


దక్షిణ తిరుపతి ఆలయంలో..



ఆలయంలో నృత్య ప్రదర్శన


నిందితుడికి జైలుశిక్ష

కెలమంగలం: పోలీసులపై దాడి చేసిన నిందితుడికి డెంకణీకోట కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల మేరకు డెంకణీకోట పట్టణ పంచాయతీ పటాలమ్మ ఆలయ వీధికి చెందిన మాదేష్ (27) ముద్దాయి. ఇతనిపై డెంకణీకోట పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులున్నాయి. 2021లో కెలమంగలం సమీపంలోని బైరమంగలం వద్ద తిరుతున్నట్లు కెలమంగలం పోలీసులకు సమాచారం అందడంతో అతన్ని పట్టుకొనేందుకు వెళ్లిన సమయంలో కానిస్టేబుల్ శివకుమార్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని అరెస్ట్ చేశారు. ఈ కేసు డెంకణీకోట కోర్టులో విచారణ జరిగింది. శుక్రవారం సాయంత్రం కేసును విచారణ జరిపిన న్యాయమూర్తి కలైవాణి.. నిందితుడు మాదేష్‌కు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

క్యాటిల్ ఫాంలో రెండు ఏనుగులు హల్‌చల్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మత్తిగిరి క్యాటిల్‌ఫాంలో రెండు ఏనుగులు చొరబడడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కర్ణాటక రాష్ట్రం బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి తమిళనాడు సరిహద్దు గ్రామమైన గుమ్మళాపురం మీదుగా రెండు ఏనుగులు క్యాటిల్ ఫాంకు చేరుకొన్నాయి. విషయం తెలుసుకొన్న జిల్లా అటవీశాఖాధికారిణి కార్తికేయిని ఏనుగులను మళ్లించేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. 15 మందికి పైగా అటవీశాఖ బృందం ఏనుగులను మళ్లించే ప్రయత్నం చేపడుతున్నారు.


ఫాంలో సంచరిస్తున్న జంట ఏనుగులు



వైఎస్సార్ జిల్లా బద్వేలు వద్ద సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ ఉద్యోగులు, ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి

వైఎస్సార్ జిల్లాలో 'సెంచరీ' ప్యానెల్స్ పరిశ్రమ ఉత్పత్తితో పాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం



అంబేడ్కర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత.. ఆధునీకరించిన వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్ భవనాన్ని, రూ.56.70కోట్లతో నిర్మించిన అంబేద్కర్ సర్కిల్–వై జంక్షన్ రోడ్డును, 15వ ఆర్థిక సంఘం, 'కుడా' సహకారంతో నిర్మించిన కోటిరెడ్డి సర్కిల్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే జిల్లాలోని అర్హులైన 50 మంది దివ్యాంగులకు ముఖ్యమంత్రి జగన్ రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు అగ్నిమాపక విభాగం కొనుగోలు చేసిన రెస్క్యూ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ..

సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి అని సీఎం జగన్ అభివర్ణించారు. అన్ని మౌలిక సదుపాయాలతో సహా ఎకరా రూ.15 లక్షల రాయితీ ధరతో ఏపీఐఐసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల విస్తీర్ణంలో సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఏర్పాటైందన్నారు. లాంజ్ రూమ్‌లో కంపెనీకి సంబంధించిన వీడియోను తిలకించారు. సెంచురీ సంస్థ చైర్మన్ సజ్జన్ బజంకా, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ్ బజంకా సంస్థ గురించి సీఎంకు వివరించారు. అనంతరం.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలతో పాటు ఆరోగ్యకర సమాజం కోసం ఎంతోమంది వైద్యులను అందిస్తున్న రిమ్స్ (రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్).. మెడికల్ హబ్‌గా రాయలసీమకే తలమానికంగా మారిందని సీఎం జగన్ ప్రశంసించారు. జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా అత్యుత్తమ, మెరుగైన వైద్యసేవలు రిమ్స్ అందిస్తోందన్నారు. సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలకు నిత్యం ప్రాణరక్షణ కల్పిస్తూ సంజీవనిగా రిమ్స్ పేరొందిందన్నారు. రిమ్స్ బోధనాసుపత్రి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించే క్రమంలో కోట్లాది రూపాయలు వెచ్చించి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, మానసిక వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై ప్రత్యేక దృష్టిసారించి వైద్యరంగం పటిష్టత కోసం కృషిచేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

రోడ్డుమార్గాన ఇడుపులపాయకు..

అనంతరం శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఇడుపులపాయకు వెళ్లాల్సి ఉంది. అయితే, కార్యక్రమాలు ఆలస్యం కావడంతో అనుకున్న సమయానికి హెలికాపర్టర్‌లో వెళ్లలేకపోయారు. ఏవియేషన్ అధికారుల సూచన మేరకు రోడ్డు మార్గాన రాత్రి 7గంటలకు ఇడుపులపాయకు చేరుకున్నారు. రాత్రికి అక్కడ వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌లో బసచేశారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఇడుపులపాయ చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ తర్వాత నెమళ్ల పార్కు పక్కనున్న ఓపెన్ ఎయిర్ చర్చిలో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి క్రిస్మస్ వేడుకలు చేసుకుంటారు. అనంతరం.. సింహాద్రిపురం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి వెళ్తారు.

ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎంపీ అవినాష్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కడప మేయర్ కె. సురేష్‌బాబు, కుడా (కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ గురుమోహన్, ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్, జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కడప కమిషనర్ సీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీగా కడప

ఇక కడప నగరాన్ని స్మార్ట్ సిటీగా చూడాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరిందని, కడపకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కడప నగరాభివృద్ధిలో భాగంగా పారిశుధ్యం, స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యకరమైన సుందర నగరంగా తీర్చిదిద్దడంలో మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. నగరం అభివృద్ధి కోసం పెట్టిన ప్రతిపాదనలు అన్నింటికీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు కూడా చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయని.. మన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పలు ప్రధాన రహదారులకు విస్తరణ పనులు చేపట్టి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కడపను అభివృద్ధి చేసి చూపించామన్నారు. అలాగే, నైపుణ్యతకు, నాణ్యతకు నిలువెత్తు నిదర్శనం వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్ అని, పుష్కలమైన పరిపాలన వనరులకు కేంద్ర బిందువుగా రాష్ట్రంలో నిలిచిందని సీఎం అభివర్ణించారు. దీంతోపాటు.. కడప నగరానికి నడిబొడ్డున ఉన్న ఏడురోడ్ల కూడలిని ఆధునీకరించి, ప్రజలకు సౌకర్యవంతంగా, నగరానికి వన్నె తెచ్చేలా తీర్చిదిద్దారు.

రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ స్కూటర్ల పంపిణీ..



శారీరక వైకల్యాలున్న వ్యక్తులు ఎదుర్కొనే చలనశీలత సవాళ్లను పరిష్కరించడానికి, వారికి సౌకర్యవంతమైన స్వతంత్ర రవాణా మార్గాలను అందించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ స్కూటర్లను అర్హులైన వారికి పంపిణీ చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) కాంపోనెంట్ కింద జిల్లా పరిపాలన యంత్రాంగం, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో దివ్యంగుల జీవన ప్రమాణాలు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ఏడీఐపీ పథకం కింద డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నియోజకవర్గస్థాయి శిబిరాల్లో 6,509 మంది వికలాంగులకు సహాయాలు, సహాయక పరికరాలను పంపిణీ చేశారు. మొత్తం రూ.5.85 కోట్లు వెచ్చించారు.





వంద ఎకరాల విస్తీర్ణంలో 'సెంచురీ'...

బద్వేలు నియోజకవర్గ కేంద్రానికి సమీపంలో గోపవరం మండల పరిధిలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ పార్కులో అన్ని మౌలిక సదుపాయాలతో సహా ఎకరా రూ.15 లక్షల రాయితీ ధరతో ఏపీఐఐసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల విస్తీర్ణంలో సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఏర్పాటైంది. రూ.956 కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకున్న ఈ పరిశ్రమలో.. మీడియం డెన్సిటీ ఫైబర్‌బోర్డు, హై ప్రెజర్ లామినేట్స్ ఉత్పత్తిని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. చెక్క పలకలు, అలంకరణ సంబంధ వుడ్ షీట్స్ తయారీలో దేశంలోనే ప్రసిద్ధిగాంచిన సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ సంస్థ.. 2,266 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా.. ఈ ప్రాంతంలో ఏర్పాటైంది. మరోవైపు.. కంపెనీ ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకును.. బద్వేలు నియోజకవర్గ రైతుల నుండే నేరుగా కొనుగోలు చేస్తోంది. భవిష్య అవసరాల కొరతను తీర్చేందుకు ఈ కంపెనీ ద్వారా రానున్న ఎనిమిదేళ్లలో 80,000 ఎకరాల విస్తీర్ణంలో చెట్లను పెంచేందుకు స్థానిక రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే.. 1,000 మంది రైతులకు సంబంధించి 5,000 ఎకరాల్లో రాయితీ ధరతో చెట్లను నాటడానికి అవకాశం కల్పించారు. ఇక ఈ పరిశ్రమ నీటి అవసరాలకుగాను.. రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ నుండి 0.07 టీఎంసీల నీటిని కూడా కేటాయించింది. దీనికోసం.. రిజర్వాయర్ నుండి ప్లాంట్ సైట్ వరకు రూ.45 కోట్లతో వాటర్ పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. అలాగే, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ఏపీఐఐసి ద్వారా రూ.19.11 కోట్లు వెచ్చించి 132 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది.



డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి..

రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా రిమ్స్ ప్రాంగణంలో 452 పడకల సామర్థ్యంతో జీ+4 అంతస్తులతో ఏ, బీ, సీ, డీ, ఈ బ్లాకులుగా డా. వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టింది. 2,38,062.46 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఆసుపత్రి కోసం.. రాష్ట్ర ప్రభుత్వం రూ.125 కోట్లను వెచ్చించింది. అందులో రూ.75 కోట్లు నిర్మాణ పనులకు, రూ.50 కోట్లు వైద్య పరికరాల కోసం ఖర్చుచేశారు. కార్డియాలజీ, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, కార్డియో థొరాసిక్–వాస్కులర్ సర్జరీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ మొదలైన 10 సూపర్ స్పెషాలిటీ విభాగాలకు సంబంధించి వైద్యసేవలు అందనున్నాయి. సాధారణ వార్డులో 300 పడకలు, పేషెంట్ కేర్ యూనిట్లు, 100 పడకల ఐసీయూ, 12 పడకల క్యాజువాలిటీ, 40 పడకలు ఇతరులకు కేటాయించారు. అంతేకాక.. 12 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అన్ని సూపర్ స్పెషాలిటీలకు అనువైన సెంట్రల్ లాబొరేటరీ, రేడియాలజీ విభాగం, సీఎస్ఎస్‌డీ, సెంట్రల్ ఫార్మసీ, అధునాతన క్యాథ్ ల్యాబ్, అధునాతన బ్లడ్ బ్యాంక్, అధునాతన సీటీ, ఎమ్మారై స్కానింగ్ సెంటర్లను ఏర్పాటుచేశారు.


వైద్య సిబ్బందికి సెల్ఫీ తీసిస్తున్న సీఎం జగన్

డా. వైఎస్సార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్..

మానసిక రోగులకు అత్యుత్తమ ఉపశమనం కలిగించేలా.. నిపుణులైన మానసిక వైద్యులతో వైద్యం, కౌన్సెలింగ్ అందించేందుకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో.. రిమ్స్ ప్రాంగణంలో 100 పడకల మానసిక వైద్యశాలను రూ.40 కోట్లు వెచ్చించి నిర్మించారు. 97,844 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 అంతస్తుతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో 23 మంది వైద్యులు, 27 మంది నర్సింగ్ స్టాఫ్, 29 మంది పారామెడికల్ స్టాఫ్, 37 మంది ఇతర సహాయక సిబ్బంది మానసిక రోగులకు వైద్యసేవలు అందనున్నాయి.



డాక్టర్ వైఎస్సార్ క్యాన్సర్ కేర్ సెంటర్..

క్యాన్సర్ రోగులకు అధునాతన వైద్యసేవలతో సరికొత్త జీవితాన్నందించే దిశగా.. రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య సదుపాయాలతో రిమ్స్ ప్రాంగణంలోనే 100 పడకల క్యాన్సర్ కేర్ సెంటర్‌ను రూ.107 కోట్లతో నిర్మించింది. 1,58,295 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా జీ+2 అంతస్తుతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో 33 మంది వైద్యులతో పాటు ఇతర సిబ్బంది అందరూ కలిపి మొత్తం 148 సిబ్బందితో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందనున్నాయి. ఇందులో మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలున్నాయి. ఇందులో 96 పడకల సాధారణ వార్డు, ఐసీయూ, క్యాజువాలిటీ, నాలుగు పడకల మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ వార్డు అందుబాటులో ఉన్నాయి. అంతేకాక.. అధునాతన పరికరాలతో లీనియర్ యాక్సిలరేటర్, డే కేర్ ఫెసిలిటీ, పెయిన్ మరియు పాలియేటివ్ కేర్, పునరావాస సేవలు, లేబొరేటరీ, రేడియాలజీ సేవలు, బ్లడ్ బ్యాంక్ యూనిట్లు అందుబాటులో వున్నాయి.



ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి..

జిల్లాలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాంపస్‌లో ఏర్పాటైన ఎల్వీ ప్రసాద్ నేత్ర ఆసుపత్రి.. టెరిటరీ నెట్‌వర్క్‌లో 4వ తృతీయ నేత్ర సంరక్షణ కేంద్రం. ఆంధ్ర రాష్ట్రంలో మూడవది. ఏపీ ప్రభుత్వం.. ఇతర దాతృత్వ ఫౌండేషన్ల మద్దతుతో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఇక్కడ మొత్తం 66,600 చ.అ.ల విస్తీర్ణంలో 40 పరీక్షా గదులు, నాలుగు ఆధునిక ఆపరేషన్ గదులతో నిర్మితమైంది. వృద్ధులకు, పిల్లలకు ప్రత్యేక కంటి సంరక్షణ సేవల యూనిట్ మరియు అన్ని ఇతర ప్రత్యేక నేత్ర సంరక్షణ సేవలతో పాటు దృష్టి మెరుగుదల సేవలను అందిస్తుంది. రోజుకు సుమారు 400లకు పైగా ఔట్ పేషెంట్లకు పరీక్షలు, రోజుకు 60కి పైగా శస్త్రచికిత్సలు నిర్వహించే సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు.



నైపుణ్యతకు నిదర్శనం వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్..

ఆరు కోట్ల రూపాలయల డీఎంఎఫ్ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా కలెక్టరేట్ భవనాన్ని ఆధునీకరించారు. ఇందులో అన్ని విభాగాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుతో పాటు మెకానికల్, ప్లంబింగ్, ల్యాండ్‌స్కేప్ డెవలప్‌మెంట్ వంటి సేవలను పునరుద్ధరించారు. అలాగే, పరిపాలనాపరమైన, ఉద్యోగుల పునశ్చరణ శిక్షణ కోసం సమగ్రమైన జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఉంది. సభా భవన్, స్పందన హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ వంటి వేదికలలో ఓరియంటేషన్లు, శిక్షణతో సహా ఉద్యోగుల సామర్థ్య నిర్మాణ సెషన్లు ఇక్కడ నిర్వహిస్తారు.

అగ్నిమాపక ఉపకరణాల ప్రారంభోత్సవం..

వరదలు, తుపానులు మొదలైన ప్రకృతి విపత్కర సమయాల్లో ప్రజల ప్రాణాలను రక్షించే చర్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే ఉద్దేశ్యంతో.. రూ.77.423 లక్షల వ్యయంతో.. వైఎస్సార్ జిల్లా అగ్నిమాపక విభాగం కొనుగోలు చేసిన రెస్క్యూ పరికరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. వీటిలో.. రెస్క్యూ బోట్లు, వీటిని నడపడానికి ఉపయోగించే అవుట్ బోర్డ్ మోటార్లు, బాధితులను వరద నీటిలో తేలియాడేలా చేయడానికి ఉపయోగించే లైఫ్‌జాకెట్లు, లైఫ్ బాయ్స్, రెస్క్యూ బోట్‌లను శుభ్రం చేసే పోర్టబుల్ పంపులు.. రెస్క్యూ రోప్‌లు ఉన్నాయి.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 24-12-2023

దివిలో దివ్యంగా క్రిస్మస్ ట్రీ!





బెంగళూరులో దేశంలోనే పెద్దదైన క్రిస్మస్ ట్రీ

ఆకాశం అనే కాన్వాస్ అద్భుత చిత్రాలకు వేదిక. తాజా అద్భుతం విషయానికి వస్తే... అమెరికా అంతరిక్ష పరిశోధన కేంద్రం 'నాసా' ఒక చిత్రాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. నాసా వారి 'చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ' కాప్చర్ చేసిన ఈ ఫోటోలో అంతరిక్షంలో క్రిస్మస్ ట్రీ కనువిందు చేస్తోంది. భూమికి 2,500 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్ర సమూహం తాలూకు ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగు కాంతి క్రిస్మస్ ట్రీ ఆకారంలో దర్శనమిస్తోంది. పాలపుంత లోపల ఉన్న ఈ నక్షత్ర సమూహాన్ని 'ఎన్‌జీసీ 2264' అని పిలుస్తారు.

దేశంలోనే పెద్దదైన క్రిస్మస్ ట్రీ బెంగళూరులో ఉంది. వంద అడుగుల ఎత్తులో ఉన్న ఈ క్రిస్మస్ చెట్టు సత్రీ నగర్‌లోని 'ఫినిక్స్ మాల్ ఆఫ్ ఏషియా' పరిసరాల్లో ఉంది. 'సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్'గా మారింది.

మరో విశేషం ఏమిటంటే మూడుసార్లు గ్రామీ అవార్డ్ గెలుచుకున్న మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్ ఈ ట్రీ గ్రాండ్ ఓపెనింగ్ సెర్మనీ సందర్భంగా లైవ్ మ్యూజిక్ షో చేశాడు.

క్రిస్మస్ ఎనర్జీ



క్రిస్మస్ సెలబ్రేషన్స్‌కు సంబంధించి బాలీవుడ్ సెలబ్స్ సందడి సోషల్ మీడియాలో కనిపిస్తోంది. పాత, కొత్త అనే తేడా లేకుండా తారల క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఫోటోలు హల్‌చల్ చేస్తున్నాయి. తారలలో కొందరు తమ క్రిస్మస్ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. క్రిస్మస్ తన ఫేవరెట్ ఫెస్టివల్ అని చెబుతోంది బాలీవుడ్ కథానాయిక జాక్వెలిన్ ఫెర్నాండెజ్. 'క్రిస్మస్‌కు సంబంధించి బాల్యజ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. పిల్లలకు బాగా నచ్చే పండగ ఇది. నా క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఎక్కువగా బహ్రెయిన్‌లో జరిగాయి. ఎందుకంటే నేను పుట్టి పెరిగింది అక్కడే. చిన్నప్పుడు క్రిస్మస్‌కు ముందురోజు రాత్రి బొమ్మల దుకాణంలో అందమైన బార్బీ బొమ్మను చూశాను. అది నాకు బాగా నచ్చింది. అదేరోజు అర్ధరాత్రి ప్రార్థనల తర్వాత శాంటా క్లాజ్ నుంచి అచ్చం అలాంటి బొమ్మే అందింది. ఓ మై గాడ్, శాంటా ఈజ్ సో కూల్ అనుకున్నాను' అంటూ గత జ్ఞాపకాల్లోకి వెళ్లింది ఫెర్నాండేజ్. 'క్రిస్మస్ ఎనర్జీ' పేరుతో క్రిస్మస్ జ్ఞాపకాల ఫోటోలను సోషల్ మీడియా లో షేర్ చేయడంలో ముందుంటుంది శ్రద్ధా కపూర్.

వైరల్

బుల్లెట్ బాబా టెంపుల్

మన దేశంలో జాతీయ రహదారుల పక్కన ఆలయాలు కనిపిస్తుంటాయి. అయితే జోధ్‌పూర్-అహ్మదాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆలయం మాత్రం ఆసక్తికరం. ఆదిత్య కొంద్వార్ అనే



రచయిత ఈ ఆలయానికి సంబంధించి విషయాలను 'ఎక్స్'లో షేర్ చేశాడు. చాలా సంవత్సరాల క్రితం...'బుల్లెట్ బాబా' గా పిలుచుకొనే ఓమ్ సింగ్ రాథోడ్ నడుపుతున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. బైక్‌ను పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు. అయితే మరుసటి రోజు ఈ బైక్ కనిపించలేదు. అందరూ ఆశ్చర్యపోయేలా ప్రమాదం జరిగిన స్థలంలో కనిపించింది. దీంతో స్థానికులు ఈ 'బుల్లెట్ బైక్'కు పూజలు చేయడం మొదలుపెట్టారు. తరువాత ఒక ఆలయాన్ని కట్టి ఈ బుల్లెట్ బైక్‌ను విగ్రహంలా ప్రతిష్ఠించారు. కాలక్రమంలో ఇది 'బుల్లెట్ బాబా టెంపుల్'గా ప్రసిద్ధి పొందింది. రోడ్డుపై ప్రయాణం చేసేవారు ఈ ఆలయం దగ్గర ఆగి 'ఎలాంటి ప్రమాదం జరగకూడదు' అని మొక్కుకుంటూ వెళుతుంటారు.

చాయ్ సుట్ట సహృదయం

ప్రముఖ చాయ్ కంపెనీ 'చాయ్ సుట్ట' పెయిడ్ మెనుస్ట్రుయేషన్ లీవ్‌ను అమలు చేస్తోంది. ఈ సెలవు గురించి కంపెనీ ఫౌండర్ అనుభవ్ దూబే మహిళా ఉద్యోగులతో నిర్వహించిన చర్చా కార్యక్రమం తాలూకు విషయాలు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యాయి. చర్చలో పాల్గొన్న వారి నుంచి భిన్నమైన అభిప్రాయాలు వినిపించాయి. కొందరు 'సెలవు అనివార్యం కాదు' అన్నట్లుగా మాట్లాడారు. 'ఆ రోజుల్లో అసౌకర్యంగా ఉంటుంది కాబట్టి సెలవు తప్పనిసరి' అని కొందరు మాట్లాడారు. చర్చ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండోర్‌కు చెందిన ఎంటర్‌ప్రెన్యూర్, చాయ్ సుట్ట ఫౌండర్ అనుభవ్ దూబే లింక్‌డ్‌ఇన్‌లో ఇలా రాశారు... 'భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అయినప్పటికీ ఆరోగ్యకరమైన చర్చ నడిచింది. మెనుస్ట్రువల్ లీవ్ ఇవ్వాలి అనుకోవడం కఠినమైన నిర్ణయం కాదు. కొన్ని విషయాలను స్త్రీలు మాత్రమే అర్థం చేసుకోగలరు'





దయాగుణ సంపన్నుడు

పేదింటి భార్యాభర్తలు, వారి ముగ్గురు పిల్లలు ఆకలితో ఉన్నారు. 'పిల్లలు ఆకలితో ఉన్నారు. మా దగ్గర డబ్బులు లేవు. సహాయం చేయండి' అని ఆశిష్ అనే యువకుడిని అడిగారు ఆ దంపతులు. పదో పరకో వారి చేతిలో పెట్టి తన దారిని తాను వెళ్లిపోలేదు ఆశిష్. దగ్గరలో ఉన్న రెస్టారెంట్‌కు తీసుకువెళ్లి వారు కోరిన పదార్థాలు తినిపించాడు. ఆ తరువాత వారిని ఆటో ఎక్కించి డ్రైవర్‌కు తానే డబ్బులు ఇచ్చాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు సోషల్ మీడియా యూజర్‌ల నుంచి భారీ స్పందన లభించింది. పోస్ట్ చేసిన రెండు రోజుల్లోనే పదిలక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

'ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే వారి ఆకలి తీర్చడం మాత్రమే కాదు మీ ప్రయాణంలో మీరు ఒంటరి వారు కాదు అని ధైర్యం చెప్పడం కూడా' అని రాశాడు ఆశిష్.

'దయాగుణానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే వినికిడి శక్తి లేని వారు కూడా వినగలరు. కంటిచూపు లేని వారు కూడా చూడగలరు. దయాగుణాన్ని మించిన సంపద లేదు' అని ఒక యూజర్ రాశాడు.

● ముగ్గుముచ్చట

21 చుక్కలు, 11 వరకు, మధ్య చుక్క





బలుపాల సునిత సుధాకర్
పెబ్బేరు గ్రామం, వనపర్తి జిల్లా





పల్లిపాటి గాయత్రి
బాలాయపల్లి
తిరుపతి జిల్లా

19 చుక్కలు,
3 వరకు,
సరి చుక్క
3 వచ్చేవరకు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

హెల్త్

కాలితో పోలిస్తే... చేయి అన్ని దిశల్లోనూ ఎటుపడితే అటు కదిలేలా గుండ్రంగా తిరిగేలా, అనేక విధాలుగా పని చేయగలిగేలా ఉంటుంది. ఈ పనులన్నింటినీ చేసేందుకు వీలుగా భుజం దగ్గర ముంజేతి చివరి 'బంతి' వంటి భాగం... ఒక సాకెట్ (గిన్నె)లో అమరి, చేయి అన్ని దిశల్లోనూ ఫ్రీగా తిరిగేలా ఉంటుంది. భుజం కీలు ప్రాంతంలో ఏదైనా సమస్య వస్తే... తుంటి ఎముక ఆపరేషన్ మాదిరిగానే ఇక్కడా 'రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స చేస్తారు. కొంతకాలం కిందట అందుబాటులోకి వచ్చిన 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ' అనే సరికొత్త ప్రక్రియ వల్ల గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ తరహా శస్త్రచికిత్సలు మరింత సమర్థంగా, మరింత ఉపయోగకరంగా చేయడం సాధ్యమవుతోంది. 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్సపై అవగాహన కోసం ఈ కథనం.



రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ అంటే..?

తుంటి ఎముకలో ఉండే గిన్నె (సాకెట్) వంటి భాగంలో తొడ ఎముక చివరన ఉండే బంతి (బాల్) వంటి భాగం చక్కగా అమరినట్టే భుజంలోనూ ఇలాంటి అమరికే ఉంటుంది. భుజం శస్త్రచికిత్సతో పోలిస్తే తుంటిఎముక ఆపరేషన్ (హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ) గురించి ప్రజల్లో కొంత ఎక్కువే అవగాహన ఉంది. కానీ భుజం దగ్గర కీళ్ల రీప్లేస్‌మెంట్‌పై అవగాహన తుంటితో పోలిస్తే తక్కువే.

భుజం దగ్గర కీలు నిర్మాణం ఇలా...

మన ముంజేయిలో కీలకమైన ఎముక ఉంటుంది. దీన్ని 'హ్యూమరస్' అంటారు. దీని చివర్న భుజం కీలు భాగంలో ఓ బంతిలాంటి నిర్మాణం ఉంటుంది. వీపు భాగంలో చూసినప్పుడు ఒక గొడ్డలి చివరన 'బ్లేడ్' మాదిరిగా కనిపించే ఎముక... చర్మం లోపలి నుంచి కనిపిస్తూ ఉంటుంది. దీన్ని 'స్కాపులా' అంటారు. ఈ స్కాపులాలో ఉండే 'గిన్నె' (సాకెట్) వంటి ఖాళీ ప్రదేశంలో... ముంజేతి ఎముక (హ్యూమరస్) చివరన ఉండే బంతిలాంటి నిర్మాణం చక్కగా ఇమిడిపోయి... చేయి ఎటు పడితే అటు, ఎలా పడితే అలా కదిలేలా అమరి ఉంటుంది. సంక్లిష్టమైన ఈ బంతిగిన్నె కీలు చుట్టూరా కీలకమైన కండరాలు, టెండన్లు, లిగమెంట్లు, ఎముక చివరన మెత్తగా ఉండే 'కార్టిలేజ్' (మృదులాస్థి)... ఇవన్నీ ఉండి... చేతి కదలికలకు దోహదపడుతుంటాయి.



టోటల్ షోల్డర్ రీప్లేస్‌మెంట్



రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్

భుజం కీలు మార్పిడి చికిత్స ఎప్పుడు... ఎందుకు?

రోడ్డు ప్రమాదాల వంటి ఏవైనా ప్రమాదాల్లో క్షతగాత్రులకు చేతికి, భుజానికి గాయాలైనప్పుడు, క్రీడల్లో ఆటగాళ్లు గాయపడినప్పుడు, ఆర్థరైటిస్ బాధితుల్లో ఎముకలు అరుగుదల, కొందరిలో పటుత్వం తగ్గి ఎముక విరగడం, మృదులాస్థి బాగా అరిగి ఎముకల రాపిడితో నొప్పి తెలియడం... ఇలాంటి ఎన్నో సందర్భాల్లో... తుంటి ఎముక మార్పిడి లాగే... అవసరాన్ని బట్టి భుజం దగ్గరి బ్లేడులోని గిన్నె (స్కాపులా)కు బదులు కృత్రిమ గిన్నెనూ... ముంజేయి చివరన ఉండే హ్యూమరస్ 'బంతి'కి బదులు కృత్రిమ బంతిని అమర్చుతారు. ఇలా బయట నుంచి అమర్చే భాగాల్ని 'ప్రోస్థెసిస్' అంటారు. ఈ శస్త్రచికిత్సలో ఎప్పటిలాగే గిన్నెలో బంతి లోపలివైపునకు చక్కగా అమరేలా చేస్తారు. ఇలా గిన్నెలో బంతి లోపలి వైపునకు ఉండేలా చేసేదే సంప్రదాయ పద్ధతిలో చేసే స్టాండర్డ్ శస్త్రచికిత్స.



డా॥ సునీల్ అప్పింగీ
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటి?

హ్యూమరస్ చివరన ఉండే బంతి వంటి నిర్మాణం లోపలి వైపునకు కాకుండా 'రివర్స్'లో బయటకు కనిపించేలా 'అమర్చి' చేసే శస్త్రచికిత్సనే 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స అంటారు. ఎక్స్-రేలో చూసినప్పుడు ఇలాంటి శస్త్రచికిత్స చేసిన వారిలో బంతి వంటి నిర్మాణం బయటకు కనిపిస్తుంటుంది. ఇలాంటి 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స'ను మొట్టమొదటిసారిగా 1980లో నిర్వహించారు. అయితే దీనికి ఉన్న ప్రయోజనాల దృష్ట్యా ఇప్పుడిది ప్రాచుర్యంలోకి వస్తోంది.

'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స ఎందుకంటే...

వయసు గడుస్తున్న కొద్దీ ఎముకల సాంద్రత (డెన్సిటీ) తగ్గుతూ ఎముకల్లో బలం తగ్గడం మామూలే. పైగా ఆర్థరైటిస్‌తో బాధపడేవారిలో ఎముకలు పెళుసుబారడం, తేలిగ్గా విరగడం కూడా పరిపాటి. ఇదొక్కటే కాదు... సంక్లిష్టమైన భుజం కీలు దగ్గర 'రొటేటర్ కఫ్' అనే అత్యంత కీలకమైన కండరాలు భుజం కదలికలకు దోహదపడుతూ ఉంటాయి. ఈ 'రొటేటర్ కఫ్' కండరాలు ఏమాత్రం గాయపడ్డా భుజం కదలికలే మందగిస్తాయి. దాంతో చేతితో చేసే పనులన్నింటికీ తీవ్రమైన అంతరాయం కలుగుతుంది. 'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్సలో బంతి బయటకు ఉంచడం ద్వారా కీలకమైన ఈ 'రొటేటర్ కఫ్' కండరాల కదలికలకు ఏమాత్రం అంతరాయం కలిగించని విధంగా శస్త్రచికిత్సకులు అమర్చుతారు. సంప్రదాయ శస్త్రచికిత్సలో నొప్పి తీవ్రత, దాంతో భుజం కదలికలు మందగించడం వంటి సమస్యలకు అవకాశాలుంటాయి. కానీ... ఈ రివర్స్ రీప్లేస్‌మెంట్‌లో రొటేటర్ కఫ్ కండరాలకు ఇబ్బంది కలగకపోవడంతో నొప్పి తీవ్రత బాగా తగ్గిపోతుంది. అంతేకాదు... ఆ కండరాల కదలికలు సజావుగా ఉండటంతో సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయి.

శస్త్రచికిత్స ప్రక్రియ ఇలా...

సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే ఒకింత క్లిష్టమైన ఈ ప్రక్రియకు దాదాపు 90 నుంచి 120 నిమిషాల సమయం పడుతుంది. దీన్ని 'జనరల్ అనస్థీషియా' (సాధారణంగా శస్త్రచికిత్స సమయాల్లో ఇచ్చే మత్తు) ఇచ్చి నిర్వహిస్తారు. దీన్ని భుజం ముందు భాగంలో గాటు పెట్టి నిర్వహిస్తూ... అరిగిన లేదా గాయపడ్డ భాగం బయటపడగానే ఆ ప్రాంతాల్లో అరిగిన భాగాలను జాగ్రత్తగా తొలగించి, వాటిని కృత్రిమ కీళ్ల (ప్రోస్థెసిస్)తో భర్తీ చేస్తారు.

శస్త్రచికిత్స తర్వాత ఫిజియో వ్యాయామాలు అవసరం...

అటు తర్వాత క్రమంగా ఫిజియోథెరపీ సహాయంతో చేతిని కదిలించడం, తగిన వ్యాయామాలు చేయించడం అవసరమవుతుంది. క్రమంగా 2 - 3 నెలల్లో చేతి కదలికలు సాధారణ స్థాయికి వస్తాయి. రివర్స్ రీప్లేస్‌మెంట్ చికిత్స నిర్వహించిన పేషెంట్లలో దాదాపు 90% మందిలో సంప్రదాయ శస్త్రచికిత్స కంటే మెరుగైన ఫలితాలు కనిపించాయని డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాదు... ఈ తరహా సర్జరీలో నొప్పి గణనీయంగా తగ్గడమే కాకుండా... సత్ఫలితాల కాల వ్యవధి సంప్రదాయ చికిత్స కంటే ఎక్కువ కాలం పాటు (దాదాపు 10 ఏళ్ల) కనిపిస్తున్నాయన్నది డాక్టర్ల మాట. అయితే సంప్రదాయ చికిత్స కంటే 'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్సకు అయ్యే ఖర్చు ఒకింత ఎక్కువే.

శారీరకంగా వ్యక్తమయ్యే మానసిక సమస్యలు!

కొన్ని మానసిక సమస్యలు శారీరక లక్షణాలతో వ్యక్తమవుతాయి. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సింది ఏమిటంటే... ప్రతి శారీరక లక్షణమూ మానసిక సమస్య కారణంగా కాకపోవచ్చు. కానీ ఒక అంచనా ప్రకారం ఔట్ పేషెంట్ విభాగానికి వచ్చే బాధితుల్లో 15 శాతం మందికి అవి మానసిక సమస్యలతో వచ్చిన లక్షణాలు కావచ్చేమోనని వైద్యవర్గాల గణాంకాలు పేర్కొంటున్నాయి. మానసిక సమస్యలు ఇలా శారీరక లక్షణాలతో ఎందుకు కనిపిస్తాయి, అనేకసార్లు చికిత్స తీసుకున్న తర్వాత కూడా పదే పదే లక్షణాలు కనిపిస్తుంటే కొన్నిసార్లు అది మానసికమైన కారణాల వల్ల కావచ్చేమోనని ఎలా అంచనా వేయవచ్చు లాంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



మానసిక సమస్యలు అనేక శారీరక వ్యవస్థలపై తమ ప్రభావాలను చూపవచ్చు. మానసిక సమస్యల కారణంగా కొన్ని దేహ వ్యవస్థల్లో కనిపించే లక్షణాలెలా ఉంటాయో చూద్దాం.

జీర్ణవ్యవస్థ పైన...

గట్ ఫీలింగ్ అనే మాటను చాలామంది ఉపయోగిస్తుంటారు. ఫీలింగ్స్ మనసుకు సంబంధించిన భావన కదా... మరి జీర్ణవ్యవస్థ అయిన శారీరకమైన అంశంతో దాన్ని ముడిపెట్టడం ఎందుకు అని అనిపించవచ్చు. ఒక చిన్న పరిశీలనతో దీన్ని తెలుసుకోవచ్చు. 'సెరిటోనిన్' అనే స్రావం మానసిక ఉద్వేగాలకు కారణమవుతుంది. నిజానికి మానసిక అంశాలకోసం స్రవించడం కంటే... సెరిటోనిన్ అనేది జీర్ణవ్యవస్థలోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఆందోళన, వ్యాకులత జీర్ణవ్యవస్థలో మార్పులకు దారితీస్తాయి. దాంతో ఎసిడిటీ, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, విరేచనాలు, మలబద్ధకం, ఇరిటబుల్ బవెల్ సింంద్రోమ్, ఆకలి వేయకపోవడం, వెంటనే మల విసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



డా॥ శ్రీనివాస్ ఎస్‌ఆర్‌ఆర్‌వై.
సీనియర్ సైకియాట్రిస్ట్

రక్తప్రసరణ వ్యవస్థపై...

మనసుకు తీవ్రమైన దుఃఖం కలిగినప్పుడు అది గుండె, రక్తప్రసరణ వ్యవస్థ ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన దుఃఖం, ఉద్వేగాలు కొందరిలో గుండెజబ్బులకు దారితీస్తాయి. ఒకసారి గుండెపోటు వచ్చినవారిలో మానసిక సమస్యలు ఉంటే అది మళ్లీ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ. మానసిక ఒత్తిడి కలిగినప్పుడు రక్తపోటులోనూ తేడాలు రావడం తెలిసిన విషయమే.

ఒళ్లునొప్పులు...

మానసిక సమస్యలు కొన్నిసార్లు ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పుల రూపంలోనే వ్యక్తమవుతుంటాయి. మానసిక సమస్యలకూ, ఒంటినొప్పులకూ సంబంధమేమిటనే కోణంలో పరిశీలించినప్పుడు కొన్ని అంశాలు అబ్బురపరుస్తాయి. ఉదాహరణకు సెరిటోనిన్, అడ్రినలిన్ వంటి రసాయన స్రావాలు మానసిక సమతౌల్యతకు దోహదపడుతుంటాయి. ఈ రసాయనాలను 'కెమికల్ గేట్స్'గా పరిగణిస్తారు. గేట్ అనేది అనవసరమైన వాటిని రాకుండా నిరోధించడం కోసం అన్నది తెలిసిందే. అలాగే ఈ రసాయన గేట్స్... అనవసరమైన అనేక సెన్సేషన్స్‌ను నివారించి, అవసరమైన వాటినే మెదడుకు చేరవేసేలా చూస్తాయి. కానీ డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు ఉన్నప్పుడు సెరిటోనిన్ వంటి ఈ ద్రవాలు తగ్గడంతో కెమికల్ గేట్స్ తమ కార్యకలాపాలను నిర్వహించలేవు. ఫలితంగా అవసరమైనవే కాకుండా అనవసరమైన సెన్సేషన్లు కూడా ఫిల్టర్ కాకుండా మెదడుకు చేరతాయి. దాంతో డిప్రెషన్ వంటి సమస్యలున్నప్పుడు... కొద్దిపాటి నొప్పి కూడా చాలా తీవ్రంగా ఉన్నట్లు తోచవచ్చు. చిన్న నొప్పి కూడా చాలా ఎక్కువగా అనిపించవచ్చు. ఇలాంటి ఈ పరిణామాన్నే 'అన్ ఎక్స్‌ప్లెయిన్‌డ్ పెయిన్ సింండ్రోమ్' అని అంటారు. ఇలాంటప్పుడు దీర్ఘకాలిక వెన్నునొప్పి (క్రానిక్ బ్యాక్ పెయిన్), శరీరంలోని అనేక భాగాల్లో నొప్పులు, మెడనొప్పి, కండరాల నొప్పి వంటివి కలిగే అవకాశముంది.

మానసిక సమస్యలు శారీరక లక్షణాలతో వ్యక్తమయ్యేదెందుకు?

మన సమాజంలో మానసిన సమస్యలను బయటకు చెప్పుకోలేని సమస్య (స్టిగ్మా)గా చూస్తుంటారు. మానసిక సమస్య అని చెప్పుకోవడం కష్టం కాబట్టి... మనసు వాటిని శారీరక లక్షణాలుగా మార్చి వ్యక్తం చేస్తుంటుంది. అయితే ఇది కాన్షియస్‌గా జరిగే ప్రక్రియ కాదు. బాధితులకూ / పేషెంట్లకూ ఇలా జరుగుతుందని తెలియదు. అధిక ఒత్తిడి వంటి కొన్ని మానసిక సమస్యలు ఉన్నప్పుడు రోగనిరోధక వ్యవస్థ పనితీరూ తగ్గి అది శారీరక లక్షణాలుగా వ్యక్తమవుతుంది. అందుకే పరీక్షల సమయంలో లేదా పరీక్షలకు ముందు పిల్లల్లో / పెద్దల్లోనూ జ్వరాలు, జీర్ణ సమస్యలు, తలనొప్పి, కడుపునొప్పి, నిద్రలేమి... వంటి సమస్యలు కనిపిస్తుంటాయి.

ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. శరీరానికి లాగే మనసుకూ జబ్బు వచ్చే అవకాశముందని గుర్తించి, అది ఏమాత్రం తప్పు కాదని గ్రహించి, తగిన మందులు తీసుకుంటే... ఈ సమస్యలు రావడం తగ్గిపోయి, మాటిమాటికీ డాక్టర్ షాపింగ్ చేస్తూ, డబ్బు, ఆరోగ్యం వృథా చేసుకునే అవస్థలూ తగ్గుతాయి.

మెడి టిప్

చిన్నపిల్లల్లో చుండ్రు నివారణకు...



చిన్నపిల్లల్లో చుండ్రు రావడం కాస్త తక్కువే అయినా అప్పుడప్పుడు కనిపిస్తుండటం మామూలే. దీని నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలివి... ● పిల్లలకు వారానికి 3-4సార్లు తలస్నానం చేయించాలి. ● తలకు తేమనిచ్చే ఆయిల్స్, లోషన్స్ వంటివి అప్లై చేస్తుండాలి. ఒకసారి పొట్టు రాలడం తగ్గిన తర్వాత హెయిర్ ఆయిల్స్, లోషన్స్ వాడుతూ మాటిమాటికీ మాడు పొడిబారకుండా చూసుకోవాలి. ● అన్ని విటమిన్లతో పాటు ప్రత్యేకంగా విటమిన్ బీ కాంప్లెక్స్ లభ్యమయ్యే ఆహారాలు తీసుకోవాలి. అందులో జింక్ మోతాదులు ఎక్కువ ఉండటం మరింత మేలు చేస్తుంది. ● ఒకసారి డాక్టర్ సలహా తీసుకుని కెటకెనజోల్, సాల్సిలిక్ యాసిడ్, జింక్ ఉన్న షాంపూలను వారానికి 2-3 సార్లు... అలా 4-6 వారాలపాటు వాడాల్సి ఉంటుంది. ● అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులతో పాటు ఈ సమస్య చాలా తీవ్రంగా ఉన్నప్పుడు కొన్నిసార్లు సీబమ్ సెక్రిషన్స్ తగ్గించే మందుల్ని కూడా వాడాల్సి రావచ్చు.



నేటినుంచి 'అల్టిమేట్ ఖోఖో' లీగ్

రెండో సీజన్ 'అల్టిమేట్ ఖోఖో' లీగ్‌కు రంగం సిద్ధమైంది. కటక్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నేడు ప్రారంభమయ్యే ఈ టోర్నీ జనవరి 13 వరకు సాగుతుంది. మొత్తం ఆరు జట్లు ట్రోఫీ కోసం తలపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ ఒడిషా జాగర్‌నట్స్, రాజస్తాన్ వారియర్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో లీగ్ మొదలవుతుంది. నేడు జరిగే తర్వాతి మ్యాచ్‌లో ముంబై ఖిలాడీస్‌తో తెలుగు యోధాస్ టీమ్ తలపడుతుంది. గుజరాత్ జెయింట్స్, చెన్నై క్విక్ గన్స్ టోర్నమెంట్ బరిలో ఉన్న మరో రెండు జట్లు. 21 రోజుల వ్యవధిలో మొత్తం 30 మ్యాచ్‌లు జరుగుతాయి. జీఎంఆర్ గ్రూప్ యాజమాన్యానికి చెందిన తెలుగు యోధాస్ టీమ్ గత ఏడాది రన్నరప్‌గా నిలవగా... ఈ సారి టైటిల్ సాధిస్తామని యోధాస్ కెప్టెన్ ప్రతీక్ వైకర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. భారత ఖోఖో సమాఖ్య గత ఏడాది ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంతో ఈ సీజన్ కోసం అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. గత ఏడాది టీవీ, ఓటీటీలో కలిపి 164 మిలియన్ల మంది ప్రేక్షకులు టోర్నీని తిలకించారు. 'సోనీ నెట్‌వర్క్'లో మ్యాచ్‌లు ప్రసారం అవుతాయి.

'సెంచూరియన్' పేసర్లకు అనుకూలం!

తొలి రోజు మ్యాచ్‌కు వాన గండం



సెంచూరియన్: భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే తొలి టెస్టు పేస్ బౌలింగ్‌కు బాగా అనుకూలించే అవకాశం ఉంది. ఈ నెల 26నుంచి మ్యాచ్ జరిగే సూపర్ స్పోర్ట్ పార్క్ పిచ్ పేసర్లకు బాగా కలిసొస్తుందని పిచ్ క్యురేటర్ బ్రయాన్ బ్లాయ్ స్వయంగా వెల్లడించాడు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఈ టెస్టుకు వాన అంతరాయం కలిగించవచ్చు. మ్యాచ్ మొదటి రోజు పూర్తిగా వాన బారిన పడవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలో పిచ్‌పై క్యురేటర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'మొదటి రోజు గనుక ఆట వాన బారినపడితే తర్వాతి రోజుల్లో పేసర్లకు మంచి అవకాశముంది. పిచ్‌పై కవర్లు ఎక్కువ సమయం ఉంచిన తర్వాత ముందుగా బ్యాటింగ్ చేయడం చాలా కఠినంగా మారిపోతుంది. దాదాపు 20 డిగ్రీలకు పడిపోయే చల్లటి వాతావరణంలో పేస్ బౌలర్లకే మేలు జరుగుతుంది. ఆపై కూడా మ్యాచ్‌లో స్పిన్నర్ల పాత్ర నామమాత్రంగా మారిపోతుంది. పిచ్‌పై ప్రస్తుతం పచ్చిక ఉంది. మ్యాచ్ సమయానికి కూడా దీనిని కొనసాగిస్తాం. నాలుగు రోజుల్లోనే టెస్టు ముగిసినా ఆశ్చర్యం లేదు' అని బ్లాయ్ వ్యాఖ్యానించాడు. 2021 సిరీస్‌లో సెంచూరియన్‌లోనే జరిగిన టెస్టులో భారత్ విజయం సాధించింది.

నేనూ 'పద్మశ్రీ' వెనక్కి ఇచ్చేస్తా

బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ ప్రకటన



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల ఫలితాలపై నిరసనగా తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్న స్టార్ రెజ్లర్లకు బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ కూడా బాసటగా నిలిచాడు. తనకు లభించిన పౌరపురస్కారం 'పద్మశ్రీ'ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేస్తానని ప్రకటించాడు. డెఫ్ ఒలింపిక్స్ (బధిర ఒలింపిక్స్)లో స్వర్ణ విజేతగా నిలిచిన వీరేందర్ 'గుంగా పహిల్వాన్'గా గుర్తింపు తెచ్చుకున్నాడు. 'భారత మానస పుత్రిక, నా సోదరి సాక్షి మలిక్ కోసం నేను నా 'పద్మ' పురస్కారాన్ని తిరిగి ఇచ్చేస్తా. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీజీ... సాక్షిని చూసి నేనెంతో గర్వపడుతున్నాను. దేశంలోని దిగ్గజ క్రీడాకారులంతా దీనిపై స్పందించాలని నేను కోరుకుంటున్నాను' అని సోషల్ మీడియా 'ఎక్స్'లో వీరేందర్ ట్వీట్ చేశాడు. మరో వైపు డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల ఫలితాలు, తదుపరి స్టార్ రెజ్లర్ల నిరసన నిర్ణయాలపై స్పందించేందుకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ నిరాకరించారు. బెంగళూరులోని 'సాయ్' సెంటర్‌లో ఆసియా క్రీడల్లో పతకాలు గెలిచిన అథ్లెట్లను అభినందించే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 'దీనిపై నేను ఇదివరకే చెప్పాల్సింది చెప్పా. ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయను' అని ఠాకూర్ అన్నారు.

'పాక్‌లో డేవిస్ కప్ ఆడాల్సిందే'

'ఐటా'కు స్పష్టం చేసిన ఐటీఎఫ్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో డేవిస్ కప్ పోరును మార్చే విషయంలో అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా)కు ఎదురు దెబ్బ తగిలింది. పాక్ గడ్డపై డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్ 'టై' పోటీలు ఆడాల్సిందేనని అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) శనివారం స్పష్టం చేసింది. పాక్‌లో కాకుండా మరో తటస్థ వేదికపై ఆడేందుకు అనుమతించాలని 'ఐటా' గతంలో అప్పీలు చేసుకుంది. దీన్ని విచారించిన ఐటీఎఫ్ ట్రిబ్యునల్ గురువారం తమ నిర్ణయాన్ని వెలువరించింది. 15 మంది సభ్యులు గల డేవిస్ కప్ కమిటీ (డీసీసీ) 'ఐటా' అప్పీల్‌ను తోసిపుచ్చింది. 'పాకిస్తాన్‌లో డేవిస్ కప్ టై పోటీలు నిర్వహించాలనే డీసీసీ నిర్ణయానికి బలమైన ఆధారాలున్నాయి. డీసీసీ ఎంపిక చేసిన వేదికపై ఆడటం అన్ని దేశాలకు వర్తిస్తుంది' అని ట్రిబ్యునల్ వెల్లడించినట్లు పాకిస్తాన్ తెలిపింది. పాక్‌లో డేవిస్ కప్ పోటీలు విజయవంతంగా జరిగాయని, అలాంటపుడు భారత్ అక్కడ ఆడటానికి విముఖత చూపడం అర్థరహితమని డీసీసీ అభిప్రాయపడింది. 'భద్రత ఏర్పాట్లు ఆతిథ్య దేశం చూసుకుంటుంది. కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నప్పుడు తప్పించుకోవాలనుకోవడం సబబు కాదు' అని డీసీసీ వర్గాలు తెలిపాయి. దీనిపై 'ఐటా' ప్రధాన కార్యదర్శి అనిల్ ధూపర్ స్పందిస్తూ 'క్రీడాశాఖతో ఈ విషయంపై చర్చిస్తాం. ఆ తర్వాతే జట్టును పంపడంపై మార్గదర్శకాలు వస్తాయి' అని అన్నారు. భారత్ వెళ్లకపోతే పాక్‌నే విజేతగా ప్రకటిస్తారు.



మెక్‌గ్రాత్

మెక్‌గ్రాత్‌ను బౌల్డ్ చేసిన ఆనందంలో కెప్టెన్ హర్మన్ సంబరాలు...

ఆసీస్ పోరాడినా... భారత్ చేతుల్లోనే..!

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 233/5
- తహీలా మెక్‌గ్రాత్ అర్ధ సెంచరీ
- మహిళల టెస్టుకు నేడు చివరి రోజు

ముంబై: భారత్, ఆస్ట్రేలియా మహిళల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్‌కు స్వల్ప ఆధిక్యం లభించినా...టెస్టు ఇంకా భారత్ చేతుల్లోనే ఉంది. చివరి రోజు ఆసీస్‌ను తొందరగా ఆలౌట్ చేయగలిగితే స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఛేదించేందుకు అవకాశం ఉంటుంది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ కాస్త మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా...శనివారం ఆట చివర్లో భారత్‌కు మళ్లీ పట్టు చిక్కింది. ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. తహీలా మెక్‌గ్రాత్ (177 బంతుల్లో 73; 10 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా...ఎలైస్ పెరీ (91 బంతుల్లో 45; 5 ఫోర్లు), బెత్ మూనీ (33), కెప్టెన్ అలీసా హీలీ (32) కీలక పరుగులు జోడించారు. భారత బౌలర్లలో హర్మన్‌ప్రీత్ కౌర్, స్నేహ్ రాణా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం ఆసీస్ 46 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 376/7తో ఆట కొనసాగించిన భారత్ మరో 30 పరుగులు జోడించి తమ తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (78)ను గార్త్ బౌల్డ్ చేయగా...పూజ వస్త్రకర్ (47), రేణుకా సింగ్ (8)లను గార్డ్‌నర్ వెనక్కి పంపించింది. దాంతో భారత్‌కు 187 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

కీలక భాగస్వామ్యాలు...

రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాకు మెరుగైన ఆరంభం లభించింది. మూనీ, లిచ్‌ఫీల్డ్ (18) తొలి వికెట్‌కు 49 పరుగులు జోడించారు. అయితే మూనీ స్వయంకృతంతో రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. రాణా బౌలింగ్‌లో మూనీ ముందుకొచ్చి డిఫెన్స్ ఆడగా చురుగ్గా ఉన్న సిల్లీ పాయింట్ ఫీల్డర్ రిచా వెంటనే బంతికి వికెట్లపైకి విసిరింది. సరైన సమయంలో వెనక్కి వెళ్లలేక మూనీ వెనుదిరిగింది. లిచ్‌ఫీల్డ్‌నూ రాణానే అవుట్ చేశాక మెక్‌గ్రాత్, పెరీ కలిసి జట్టును ఆదుకున్నారు. భారత స్పిన్నర్లను వీరు సమర్థంగా ఎదుర్కొన్నారు. 15 పరుగుల వద్ద మెక్‌గ్రాత్ ఇచ్చిన క్యాచ్‌ను రాణా వదిలేయడం ఆసీస్‌కు కలిసొచ్చింది. మెక్‌గ్రాత్, పెరీ మూడో వికెట్‌కు 84 పరుగులు జత చేశారు. అయితే ఆ తర్వాత హీలీతో కలిసి మెక్‌గ్రాత్ ఇన్నింగ్స్‌ను నడిపించింది. 119 బంతుల్లో ఈ మ్యాచ్‌లో రెండో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న మెక్‌గ్రాత్...రేణుక ఓవర్లో వరుసగా 3 ఫోర్లతో ఆసీస్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. ఆసీస్ బ్యాటర్లు పాతుకుపోగా, వరుసగా 28.2 ఓవర్ల పాటు భారత్ వికెట్ తీయడంలో విఫలమైంది. ఈ దశలో కెప్టెన్ హర్మన్ తానే స్వయంగా బౌలింగ్‌కు దిగింది. తొలి ఓవర్లోనే చక్కటి బంతితో మెక్‌గ్రాత్‌ను బౌల్డ్ చేసి 66 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెర దించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే హీలీని వికెట్ల ముందు దొరకబుచ్చుకొని హర్మన్ మ్యాచ్‌ను మళ్లీ భారత్ చేతుల్లోకి తెచ్చింది. అంతకు ముందు బంతికే హర్మన్, హీలీ మధ్య 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'కు సంబంధించి తీవ్ర వాదోపవాదన జరిగిన తర్వాత ఈ వికెట్ దక్కడం విశేషం. ఆ తర్వాత 62 బంతుల పాటు జాగ్రత్తగా ఆడి మరో వికెట్ పడకుండా సదర్లాండ్ (12 నాటౌట్), గార్డ్‌నర్ (7 నాటౌట్) ఆటను ముగించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 219; **భారత్ తొలి ఇన్నింగ్స్** 406; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** మూనీ (రనౌట్) 33; లిచ్‌ఫీల్డ్ (బి) రాణా 18; పెరీ (సి) యస్తిక (బి) రాణా 45; తహీలా మెక్‌గ్రాత్ (బి) హర్మన్ 73; హీలీ (ఎల్బీ) (బి) హర్మన్ 32; సదర్లాండ్ (నాటౌట్) 12; గార్డ్‌నర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (90 ఓవర్లలో 5 వికెట్లకు)** 233.
వికెట్ల పతనం: 1–49, 2–56, 3–140, 4–206, 5–221. **బౌలింగ్:** రేణుకా సింగ్ 8–3–22–0, పూజ వస్త్రకర్ 8–0–36–0, స్నేహ్ రాణా 17–3–54–2, దీప్తి శర్మ 19–5–30–0, రాజేశ్వరి 27–10–42–0, జెమీమా 2–0–13–0, హర్మన్‌ప్రీత్ 9–0–23–2.

తలైవాస్‌పై పాంథర్స్ గెలుపు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 25–24తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. అర్జున్ దేశ్వాల్ (7 పాయింట్లు), రెజా మిర్‌బగెరి (5), సునీల్ కుమార్ (4), అజిత్ (3) రాణించారు. తలైవాస్ తరఫున హిమాన్షు నర్వాల్ 8 పాయింట్లు సాధించాడు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 38–30తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. గుజరాత్ విజయంలో రెయిడర్ రాకేశ్ (14) కీలకపాత్ర పోషించాడు.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	6	3	1	2	21
హరియాణా స్టీలర్స్	6	4	2	0	21
పట్నా పైరేట్స్	6	3	3	0	17
యు ముంబా	5	3	2	0	16
యూపీ యోధాస్	7	2	4	1	15
బెంగళూరు బుల్స్	7	2	5	0	14
దబంగ్ ఢిల్లీ	5	2	3	0	12
తమిళ్ తలైవాస్	6	2	4	0	11
తెలుగు టైటాన్స్	6	1	5	0	7

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

బంగ్లా చేతిలో కివీస్ చిత్తు

నేపియర్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను ఇప్పటికే చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఊరట విజయం దక్కింది. శనివారం జరిగిన చివరి వన్డేలో బంగ్లా 9 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 31.4 ఓవర్లలో 98 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాపై ఆ జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. యంగ్ (26) టాప్ స్కోరర్ కాగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తన్‌జీమ్ హసన్ (3/14), సౌమ్య సర్కార్, షరీఫుల్ తలా 3 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లా 15.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 99 పరుగులు చేసింది. నజ్ముల్ హుస్సేన్ (51 నాటౌట్), అనాముల్ హక్ (37) రాణించారు. కివీస్ గడ్డపై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి గెలుపు కావడం విశేషం. తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన న్యూజిలాండ్ 2–1తో సిరీస్ సొంతం చేసుకుంది.

సినిమా

స్వదేశానికి కన్నప్ప



మోహన్ బాబు

విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, బ్రహ్మానందం, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, శరత్‌కుమార్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖేష్ కుమార్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ 3 నెలల క్రితం న్యూజిల్యాండ్‌లో మొదలైంది. ''న్యూజిల్యాండ్‌లో 600 మంది హాలీవుడ్, భారతదేశంలోని అతిరథ మహారథులైన నటీనటులతో 90 రోజుల మొదటి షెడ్యూల్ చేశాం. అక్కడి అద్భుతమైన లొకేషన్స్‌లో దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసి, భారతదేశానికి తిరిగి వస్తున్నాం. ఈ సినిమాకు థాయ్‌ల్యాండ్, న్యూజిల్యాండ్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు మోహన్‌బాబు. శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

ఇక స్పీడ్‌గా సినిమాలు చేస్తాను

- దర్శకుడు రవికాంత్ పేరేపు

రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో రవికాంత్ పేరేపు చెప్పిన విశేషాలు.



● ప్రేమకథ ప్రధానంగా సాగే రిలేషన్‌షిప్ డ్రామా 'బబుల్‌గమ్'. ఈ చిత్రంలో ఆది పాత్రలో రోషన్, జాన్వీ పాత్రలో తెలుగు అమ్మాయి మానస నటించారు. కొత్తవారితో చేయాల్సిన సినిమా ఇది. రోషన్ హీరోగా పరిచయమవుతున్నాడని తెలిసి, ఈ కథ చెప్పాను. కాలేజీ చదువు పూర్తి చేసుకున్న తర్వాత యువకుల కెరీర్‌లో కొంత కన్‌ఫ్యూజన్ ఉంటుంది. మనకు ఇష్టమైనది చేయాలా? సంపాదన కోసం ఏ ఉద్యోగమైనా చేయాలా? అనే అయోమయంలో ఉంటారు. అలాంటి ఓ కన్‌ఫ్యూజన్‌లో ఉన్న ఓ కుర్రాడు ప్రేమలో పడితే ఏం జరుగుతుంది? అన్నదే ఈ సినిమా కథాంశం. రోషన్‌కు ఇది తొలి సినిమా అయినా అతని తల్లిదండ్రులు సుమ, రాజీవ్ కనకాల ఈ సినిమాలో జోక్యం చేసుకోలేదు. ● 'ప్రేమ బబుల్‌గమ్ లాంటిది. మొదట్లో తీయగా ఉంటుంది. ఆ తర్వాత చప్పగా ఉంటుంది. ఆ నెక్ట్స్ అతుక్కుంటే వదలదు' అనే డైలాగ్ ఉంటుంది. కథానుసారం ఈ సినిమాకు 'బబుల్‌గమ్' టైటిల్ పెట్టాం. ఇక నా 'క్షణం', 'కృష్ణ అండ్ హిజ్ లీల' ఇప్పుడు 'బబుల్‌గమ్' సినిమాలకు శ్రీ చరణ్ సంగీతం ఇచ్చాడు. మేమిద్దరం ఒకే ఊరివాళ్లం కాబట్టి కంఫర్ట్ కుదిరింది. 'బబుల్‌గమ్' ట్రైలర్‌ను చిరంజీవిగారికి చూపించాం. ఈ సినిమాలోని 'ఇజ్జత్..' సాంగ్ ఆయనకు బాగా నచ్చింది. ● 'క్షణం' మంచి విజయం సాధించింది. ఎందుకో కానీ ఆ సినిమా సక్సెస్ క్రెడిట్ నాకు అంతగా రాలేదు. దర్శకత్వంలో అడివి శేష్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఉందనే ప్రచారం జరిగింది. నిజానికి 'అడివి' శేష్, శ్రీచరణ్ పాకాల 'క్షణం' క్రెడిట్ నాకే ఇస్తారు. ఓ అవుట్ సైడర్‌గా ఇండస్ట్రీ పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి నాకు కొంత టైమ్ పట్టింది. ఇకపై దర్శకుడిగా స్పీడ్‌గా సినిమాలు చేస్తాను.


యానిమల్ తర్వాత హిందీలో అవకాశాలు వస్తున్నాయి

- సంగీతదర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్



కల్యాణ్ రామ్ హీరోగా నటించిన చిత్రం 'డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్'. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా, మరో హీరోయిన్ మాళవికా నాయర్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాను అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 29న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్ర సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ మాట్లాడుతూ– ''డెవిల్' సినిమాలో మూడు పాటలు ఉన్నాయి. ఇది పీరియాడికల్ ఫిల్మ్ కాబట్టి ప్రత్యేక వాయిద్యాలను వాడాం. 'దూరమే..' పాటను బుడాపెస్ట్‌లో షూట్ చేశాం. అలాగే 'దిస్ ఈజ్ లేడీ రోజ్..' పాటను ర్యాపర్ రాజకుమారితో పాడించాం. ఈ పాట సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తుంది. అలాగే నేపథ్య సంగీతం చాలా బాగుంటుంది. అయితే సంగీత దర్శకులు, నటీనటులు ఎంత ఎఫర్ట్ పెట్టినా విజువల్ సపోర్ట్ ఉండాలి. ఈ విషయంలో ఈ చిత్రం కెమెరామేన్ సౌందర్ రాజన్ గారు ప్రాణం పెట్టి అద్భుతంగా వర్క్ చేశారు. సెకండాఫ్‌లోని ఓ ముఖ్యమైన యాక్షన్ సీక్వెన్స్‌లో కల్యాణ్‌రామ్ గారి నట విశ్వరూపాన్ని ఆడియన్స్ చూస్తారు. ఈ సినిమాకు జాతీయ స్థాయిలో అవార్డులు రావొచ్చని నాకనిపిస్తోంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''భవిష్యత్‌లో డైరెక్షన్ చేసే అవకాశం ఉంది. ఇద్దరు గిటారిస్ట్స్ మాత్రమే ఉండేలా ఓ సినిమా, డ్రమ్స్ శివమణిగారి బయోపిక్ తీయాలని ఉంది. 'యానిమల్' తర్వాత బాలీవుడ్‌లో చాలా అవకాశాలు వస్తున్నాయి. అవి చర్చల దశలో ఉన్నాయి. ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగాగారు చేయనున్న 'స్పిరిట్' సినిమాకు సంగీతం అందించనున్నాను'' అన్నారు.

స్నేహితుల కథ



● 'రోటీ కపడా..' పోస్టర్

హర్షా నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ 'రోటి కపడా రొమాన్స్'. బెక్కెం వేణుగోపాల్‌తో కలిసి సృజన్ కుమార్ బొజ్జం ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫస్ట్ డోస్ అంటూ ఈ సినిమా పబ్లిసిటీ వీడియోను శనివారం విడుదల చేశారు మేకర్స్. ''నలుగురు స్నేహితుల కథే ఈ చిత్రం. వారి స్నేహం, ప్రేమ, వారి లైఫ్ జర్నీ ఈ సినిమాలో ఉంటుంది. యూత్‌కు ఈ సినిమా ఓ పండగలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్–ఆర్ఆర్ ధ్రువన్–వసంత్ .జి, కెమెరా: సంతోష్ రెడ్డి.

సి. కృష్ణవేణి నూరవ పుట్టినరోజు ప్రత్యేకం

కృష్ణమణి

మణిలాంటి నటి... మణిలాంటి గాయని... మణిలాంటి నిర్మాత... కృష్ణవేణి చిత్రసీమకు ఒక అమ్యూల్యమైన మణి. మంచి నటీమణిగా తెరపై తన అభినయాన్ని కనబర్చారు. మంచి గాయనీమణిగా తన గాత్రాన్ని వినిపించారు. 'మన దేశం' వంటి చిత్రంతో అభిరుచి గల నిర్మాత అనిపించుకున్నారు. నేడు నూరవ వసంతంలోకి అడుగు పెడుతున్నారు సి. కృష్ణవేణి. ఈ సందర్భంగా కృష్ణ'మణి' జీవిత విశేషాలు కొన్ని తెలుసుకుందాం.



● సి. కృష్ణవేణి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా పంగిడి గ్రామంలో 1924 డిసెంబరు 24న జన్మించారు కృష్ణవేణి. తండ్రి యర్రంశెట్టి కృష్ణారావు డాక్టర్. పాఠశాల నాటకాల్లో ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి వేషాలు వేసి బహుమతులు అందుకున్నారు కృష్ణవేణి. ఆ తర్వాత వెండితెరపైనా ప్రేక్షకులను మెప్పించారు. ప్రముఖ దర్శక–నిర్మాత సి. పుల్లయ్య బాల నటీనటులతో 'సతీ అనసూయ' చిత్రానికి సన్నాహాలు చేశారు. ఆ సమయంలో రాజమండ్రి వెళ్లినప్పుడు ఆయన 'తులాభారం' నాటకం చూశారు. అందులో కృష్ణవేణి నటన నచ్చి, సినిమాలో నటించమని అడిగారు. అలా 'సతీ అనసూయ' (1936) సినిమాలో తొలి అవకాశం అందుకున్నారు కృష్ణవేణి. ఆ చిత్రం తర్వాత మళ్లీ నాటకాల్లో నటించారు. ఆ సమయంలో తండ్రి కృష్ణారావు మృతి చెందడంతో అమ్మమ్మ, బాబాయిల వద్ద పెరిగారు కృష్ణవేణి. ఆ తర్వాత 'తుకారాం' (1973) సినిమా కోసం చెన్నైలో అడుగుపెట్టారు. ఆ సినిమా సరిగ్గా ఆడలేదు. కృష్ణవేణి హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' (1938) విజయం సాధించడంతో మంచి గుర్తింపు, పేరు వచ్చాయి. ఆ తర్వాత 'మహానంద' చిత్రంలో నటించేందుకు చెన్నైలోనే స్థిరపడ్డారు.



● భర్త మీర్జాపురం రాజాతో కృష్ణవేణి



● కృష్ణవేణి

ఆ సమయంలోనే ప్రముఖ దర్శక–నిర్మాత, మీర్జాపురం రాజాతో (మేకా రంగయ్య) కృష్ణవేణి వివాహం 1940లో విజయవాడలో జరిగింది. వివాహం తర్వాత బయటి సంస్థల్లో పని చేయడం ఇష్టం లేక సొంత ప్రొడక్షన్ జయా పిక్చర్స్–శోభనాచల స్టూడియోస్ నిర్మించిన చిత్రాల్లో నటించారామె. మీర్జాపురం రాజా నిర్మించిన తొలి సాంఘిక చిత్రం 'జీవన జ్యోతి'లో (1940) హీరోయిన్‌గా చేశారు. ఆ చిత్రంతో సీహెచ్ నారాయణరావు హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించారు కృష్ణవేణి. నటిగా ఆమెకు 'గొల్లభామ, లక్ష్మమ్మ' వంటి చిత్రాలు బాగా పేరు తెచ్చాయి. 'కచదేవయాని, గొల్లభామ, అనసూయ' వంటి పలు చిత్రాల్లో పాటలు పాడారు కృష్ణవేణి. 'తిరుగుబాటు' సినిమాలో ఆమె చేసిన వ్యాంప్ క్యారెక్టర్‌పై ప్రేక్షకులు పెదవి విరిచారు. 1942లో రాజా–కృష్ణవేణి దంపతులకు కుమార్తె రాజ్యలక్ష్మి అనూరాధ జన్మించడం.. భర్త రాజా సినిమాల నిర్మాణంలో బిజీగా ఉండటంతో స్టూడియో వ్యవహారాలు చూసుకోవాల్సి రావడం ... వంటి కారణాలతో నటనకు స్వస్తి పలికారు కృష్ణవేణి. కుమార్తె పేరుపై 'ఎంఆర్ఏ' ప్రొడక్షన్ స్థాపించి, తొలి ప్రయత్నంగా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో 'మన దేశం' (1949) సినిమా తీసి, విజయం అందుకున్నారు. ఈ చిత్రం ద్వారా ఎన్టీఆర్‌ని వెండితెరకు పరిచయం చేశారు కృష్ణవేణి. కాగా 'వరూధిని' సినిమా తర్వాత ఊరు వెళ్లిపోయిన ఎస్వీ రంగారావుని పిలిపించి, 'మన దేశం'లో ఓ పాత్రకు అవకాశం ఇచ్చారామె. తన అభిరుచి మేరకు నిర్మించిన ఆ సినిమా ఎంతో సంతృప్తి ఇచ్చిందని పలు సందర్భాల్లో కృష్ణవేణి పేర్కొన్నారు. ఇక ఆ రోజుల్లో ఎక్కువ పారితోషికం తీసుకున్న హీరోయిన్‌గానూ తన ప్రత్యేకత చాటుకున్నారామె. 'ధర్మాంగద'కి రూ. నలభై ఐదు వేలు పారితోషికం తీసుకున్నారు. ఆమె నిర్మించిన 'గుడ్ ఈవెనింగ్, లేడీ డాక్టర్' వంటి కొన్ని చిత్రాలు పరాజయం కావడం, 'కుమ్మరి మొల్ల' వంటి మరికొన్ని సినిమాలు మధ్యలోనే ఆగిపోవడంతో అసంతృప్తికి గురయ్యారు కృష్ణవేణి. ఆమె హీరోయిన్‌గా నటించిన ఆఖరి చిత్రం 'సావాసం' (1952). మహారాష్ట్ర గవర్నర్‌గా చేసిన కోన ప్రభాకరరావు ఆ చిత్రంలో హీరోగా నటించడం విశేషం. కృష్ణవేణి నిర్మించిన చిత్రాల్లో 'భక్త ప్రహ్లాద' (1942) ఒకటి. నిర్మాతగా 1957లో విడుదలైన 'దాంపత్యం' కృష్ణవేణి చివరి సినిమా. నటిగా, నిర్మాతగా, గాయనిగా చిత్ర పరిశ్రమలో ప్రత్యేకత చాటుకున్న ఆమె 2004లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. గత ఏడాది 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డుల్లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు కృష్ణవేణి.



● 'కచదేవయాని'లో ఓ దృశ్యం

తల్లి బాటలో కుమార్తె

కృష్ణవేణి బాటలో ఆమె కుమార్తె ఎన్ఆర్ అనురాధా దేవి నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. ముందు పలు అనువాద చిత్రాలు విడుదల చేసి, లక్ష్మి ఫిలింస్ కంబైన్స్‌పై ఆమె కన్నడంలో తన తొలి చిత్రం 'భక్త కుంబారా' (1974)ని నిర్మించారు. ఇందులో రాజ్ కుమార్ హీరో. తెలుగులో అనురాధ నిర్మించిన తొలి చిత్రం 'చక్రధారి' (1977). అక్కినేని నాగేశ్వర రావు, వాణిశ్రీ, జయప్రద కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. నిర్మాతగా మొత్తం 17 చిత్రాలు నిర్మించారు అనురాధ. ఆమె నిర్మించిన చివరి చిత్రం 'మా పెళ్లికి రండి' (2000). జేడీ చక్రవర్తి, సాక్షి శివానంద్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. ప్రపంచంలో అత్యధిక చిత్రాలు నిర్మించిన మహిళా నిర్మాతగా అనురాధా దేవి 2001లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌ని సొంతం చేసుకున్నారు.



● అనురాధా దేవి

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/35y/5'8"/డిగ్రీ/బిజినెస్/1 లక్ష నెలకు/10 Cr ప్రాపర్టీ/Own House, Lands కలిగిన ఏకైక వరుడికి మిడిల్ క్లాస్ అమ్మాయి కావలెను. కుల పట్టింపు లేదు. డైరెక్ట్ Contact: Ph: 8019468462, 8897213126 [H-801452]

రెడ్డి: 2వ పెళ్లి/45/5'6"/డిప్లొమా/ Pvt జాబ్/ 40,000/-PM / వెల్ సెటిల్డ్ వరుడికి Any OC/BC వధువు కావలెను. Ph: 7569117901, 9440925165 [H-13238]

SC హిందు మాదిగ: M.Tech/ C.Govt. లోకోపైలెట్/ రైల్వే/ 80,000/- PM /6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [H-13238]

ముదిరాజ్: కట్నం ప్రసక్తి లేదు/M.Tech C.Govt.Asst. మేనేజర్/SBI/ 65000/- pm/ 5'11" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618007652 [H-13238]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్ /యూనియన్ బ్యాంక్/ 80,000/-PM / 5'10" ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-14938]

SC మాల & క్రిస్టియన్ /M.Tech(IT) / C. Govt. డిప్యూటీ మేనేజర్ / SBI / 85000/- PM/ 5'8" ఎత్తు /28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-14938]

కుల ప్రసక్తి లేని, 37 సం॥ల వయస్సు గల వరుడికి వధువు కావలెను. వధువుకు మొదటి/ రెండవ, విడో, పిల్లలు ఉన్న వారైనా సంప్రదించండి. జాతీ ప్రసక్తి లేదు. Ph: 6301055248, 7396730091 [HA-14938]

మాల/28/5'9" / B.Tech / Govt. A.E.E / ట్రాన్స్‌కో / 90,000/- PM/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14938]

రజక/B.Tech / Govt.AE / ఇరిగేషన్ Dept / 82,000/-PM / 5'10" ఎత్తు / 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph : 9515942275 [HA-14942]

SC మాల 43 ఒంటరి రెండవ బిజినెస్ / మంచి ఆస్తి ఇల్లు గల వరునికి 1వ లేదా 2వ వధువు (కుల పట్టింపు లేదు) కావలెను. ఫోన్: 8919914094. (డైరెక్ట్). [H-788498]

కుల పట్టింపు లేదు (BC) B.Tech / 36 / Job / 5.6 వరునికి తగిన వధువు కావలెను. (1వ లేదా 2వ) నో బ్రోకర్స్, డైరెక్ట్ వాట్సప్ నెం. 7386799341 [S-189760]

ఖమ్మ, 56Y, 5'10H, Fair, NRI Doctor ఇక్కడే స్థిరపడిన అతనికి ఏ బాదర బంధి లేని అందమైన చదువుకున్న 45 సం॥లోపు ఇంట్లో ఉండిపోయే యువతి కావలెను. CNB Ph : 80746 87749 [V-1162484]

★

మాల/కట్నం ప్రసక్తి లేదు/49/5'/1st మ్యారేజ్/ ప్రైవేట్ టీచర్/1.10L PM/ సొంత ఇల్లు ఉన్న వరునికి డిగ్రీ/పిజీ చదివిన 45 సం॥ 1st మ్యారేజ్ వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788245]

మాల/48/5'2"/1st మ్యారేజ్ (తెల్ల మచ్చల పూత)/ TS Govt/ 70K PM/సొంత ఇల్లు ఉన్న వరునికి ఇంటర్ చదివిన, మధ్యతరగతి వధువు కావలెను. నోబ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788246]

గూగుల్‌లో పనిచేయుచున్న 27 ఏండ్ల ఫెయిర్, 5 ఫీట్ 8 అంగుళాల క్రైస్తవునికి భక్తి కలిగిన వధువు కావలెను. సంప్రదించండి. సెల్ : 8332921163 [HA-95934]

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల పట్టింపులేదు మరియు రెండో పెండ్లి వారు కూడ సంప్రదించవచ్చును. ఇది డైరెక్ట్‌గా ఇచ్చినాము. సంప్ర॥ 8790197318 [Y-784403]

★★

OC / వయస్సు 50 బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్ సెటిల్ వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర: 94908 78646 [P-772947]

కాపు 34Y/ 5'4", ప్రైవేట్ జాబ్ జీతం 15,000/- 2 సొంత ఇల్లులు Divorced No Broker's Direct Contact : 76750 72871, 87907 27171 [V-797087]

కుల, కట్నం ప్రసక్తి లేదు. డిగ్రీ/35సం., 5'5" ఎత్తు బిజినెస్ చేస్తున్న వరుడికి డిగ్రీ ఆపైన చదివిన 1వ & 2వ వధువు కావలెను. (నో బ్రోకర్స్) (అర్జంట్) 9347908346, 8088801146. [B-1206378]

వరుడు కావలెను



డైవర్సీ/2వ పెళ్లి/35yrs/ Govt. ఎంప్లాయ్ 2,00,000/- (pm) కుల పట్టింపులేని వెల్‌సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్న) సంప్ర: 7386550413 [H-793638]

రెడ్డి/32y / 5'5" / MBBS / Own Clinic/ 30Cr ప్రాపర్టీ/Late Marriage వధువుకి వరుడు కావలెను. Job & Business. Ph: 8897213126, 8019468462 [H-801452]

ఖమ్మ/43y/5'4"/విడో/సొంత మెడికల్ షాప్/10Cr ప్రాపర్టీ/Divorce వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8019468462, 8019484384 [H-801452]

వైశ్య/58y/5'2"/G.Employ/85 వేలు నెలకు/ సొంత ఇల్లు పొలాలు కలిగిన విడో వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019484384, 7396608019 [H-801452]

రెడ్డి/46y/5'5"/Own Restaurent/2 లక్షలు నెలకు/20 Cr ప్రాపర్టీ/విడో వధువుకి Job & బిజినెస్ చేయు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7396608019, 8019484384 [H-801452]

కాపు/25y/B.Com/MBA/Own Business/ 25L P/A కోట్ల ప్రాపర్టీ కలిగిన ఏకైక వధువుకు బిజినెస్ చూసుకునే వరుడు కావలెను (Reddy also Accepted) Ph: 9985746131 [H-787761]

సెకండ్ మ్యారేజ్/డైవర్సీ/42y/ ఎన్విరాన్‌మెంట్ & పొల్యూషన్ కంట్రోల్ Dept (EE)/1.5L PM/సొంత విల్లా/50 ఎ॥ పంటపొలాలు/కోట్ల ఆస్తి గల ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 9030116573 [H-787761]

రెడ్డి/లేట్ మ్యారేజ్/30y/M.Tech/ 2L PM/7 Acars ఫాంల్యాండ్/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985748142 [H-787761]

రెండవ పెళ్ళి/విడో/55y/Guntur/ లెక్చరర్/ Own House Rents/కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 7997175138 [H-787761]

రెడ్డి /విడో / 27y / B.Tech / MBA/ SWE / 1.2L PM / కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-787761]

గౌడ: B.Tech/C.Govt.Asst. Exq. ఇంజనీర్/ IOCL/ 50,000/- pm/5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9618007652 [H-13238]

రజక: 50 లక్షల ఆస్తి / B.Tech/ SWE / 60,000/- pm / 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9618008271 [H-13238]

SC హిందుమాల: B.Tech / Govt. సబ్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్ Dept / 80,000/- pm/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9966760501 [H-13238]

ముదిరాజ్: B.Tech/ C.Govt. బ్యాంక్ క్యాషియర్ / ఇండియన్ బ్యాంక్ / 38,000/- pm/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9515942275 [H-13238]

రజక: B.Tech/ C.Govt. ట్యాక్స్ ఆఫీసర్/ ఇన్‌కంట్యాక్స్ Dept/ 65,000/- pm/ 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [H-13238]

వడ్డెర: B.Tech/ C.Govt. క్యాషియర్/ SBI/ 28,000/- pm/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [H-13238]

క్రిస్టియన్: 2వపెళ్లి/ కులప్రసక్తి లేదు/ B.ఫార్మసీ C.Govt Asst. మేనేజర్/బ్యాంక్ ఆఫ్ బరోడా/ 75000/-pm/5'2" ఎత్తు/33 సం॥ల పిల్లలులేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph:9550650024 [H-13238]

FC/విడో/60y/ఎర్రని ఛాయ/ప్రభుత్వ రిటైర్డ్/ Own House / పంట పొలము గల ఒంటరి వధువుకి మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. Ph: 9121509718 [H-793399]

రెడ్డి/విడో/52y/5'5"/ Very Fair/ Govt. (H.M)/ Own House/ 20 ఎకరాల మాగాణి/2L pm/ వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. Ph: 7093717220 [H-793399]

నాయుడు/విడో/51y/ సొంత పవర్‌ప్లాంట్ బిజినెస్/ పెన్షనర్/ రెంట్స్/ 1L pm ఆదాయం కలిగి ఆంధ్రాలో భూములు ఉన్న వధువుకు కుల, ధన ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 7013400498 [H-793399]

FC/విడో/60y/5'3"/ డిగ్రీ/రిటైర్డ్ Govt. ఎంప్లాయ్/ సొంత ఇల్లు & రెంట్స్ / 80K pm/ 2 ఎకరాల పంటపొలం గల ఒంటరి వధువుకు సాంప్రదాయమైన మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 8019324258 [H-793399]

కాపు/48y/ 2nd మ్యారేజ్/ కుల పట్టింపులేదు/ Govt. ఎంప్లాయ్ 90K (pm), వెల్‌సెటిల్డ్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 8374802603 [H-793399]

రెడ్డి/విడో / 50ys / ప్రాపర్ Khammam సొంత అపార్ట్‌మెంట్స్/ సొంత హాస్టల్స్/ రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (అర్జెంట్). (నోబ్రోకర్స్).(ఇల్లరికం Ok). Ph:7799083500, 7386660643 [H-793638]

రెడ్డి/39yr/5'4"/ 1st మ్యారేజ్ కుల పట్టింపులేదు/ ఫెయిర్ / PG/ Govt. ఎంప్లాయ్ 70K (PM) వెల్‌సెటిల్ ఫ్యామిలీ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర : 8008474869 [H-793638]

రెడ్డి/40yr/ కుల పట్టింపులేదు/ 2nd మ్యారేజ్, Govt. ఎంప్లాయ్ 80K (PM), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9492081545 [H-793638]

కాపు/కుల పట్టింపు లేదు/55yrs/ 60,000/- PM/Own House & వ్యవసాయ భూమి 12 ఎ॥రాలు గల వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 7729090846 [HA-14938]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK). Ph: 8143011223 [HA-14938]

యాదవ/ B.Tech / Govt.A.E / ఇరిగేషన్ Dept/ 60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-14938]

బ్రాహ్మణ/24/5'3"/B.SC "27/5'4"/MBA "30/ 5'3"/B.SC "32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/పురోహితులకు మ్యారేజెస్ త్వరగా కుదుర్చబడును. PH: 7842635086 [HA-14938]

హిందూ మాల/ 25/5'4" / B.Tech/ Govt. A.E./ఇరిగేషన్ Dept/50,000/- PM/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14938]

SC మాల/ఏకైక కుమార్తె/B.Tech, IIT/ C. Govt. ట్యాక్స్ Asst/ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/ 60,000/-PM/5'3" ఎత్తు/27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-14938]


SC మాల/ 26Years/ 5'4"/ B.Tech/ SWE/50K PM/Well Settled Family కలిగిన వధువుకి వరుడు కావలెను. (SWE, Govt, Doctors). Ph: 7416007604 (Whatapp) [HA-14942]

కులపట్టింపు లేదు / 22y & 24y & 25y & 27y &28y&30y&32y&34y&36y&37y&39y&41y&42y&44y&46y&48y&49y&51y&52y&54y&55y&56y&58y&59y "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-14942]

రెడ్డి/కుల ప్రసక్తి లేదు/రెండవ సంబంధం/H: 5'4" / కలర్: ఎరుపు/ ట్రావెల్స్ బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. Ph: 9121300377 [HA-14942]

2వ వివాహం/37 సం॥రాలు/Govt Employee/ 2,75,000 PM/ బాగా స్థిరపడిన అన్నలు ఉన్న అమ్మాయికి అబ్బాయి కావలెను. ఏకైక వారసురాలు ఏ కులమైన అభ్యంతరం లేదు. ఇల్లరికం: 9381696641 [H-788171]

వేదికలు



కుల పట్టింపులేదు, రిటైర్డ్ Govt. ఎంప్లాయ్ పెన్షన్, సింగిల్, వెల్‌సెటిల్ గల సారికి ఏ బాధరాబందీలేని భాగస్వామి కావలెను. అన్నికులాల వారికి సంబంధాలు చూడబడును, ఫీజు 1000/- మాత్రమే. సంప్ర: 7286031653 [H-793638]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-793387]

శ్రీ శ్రీరస్తు శుభమస్తు. ఓల్డ్ రెడ్డీస్ గత 15 స.లుగా అనేక జంటలు కలిపిన సంస్థ. ఇండియా అబ్రోడు సంబంధాలు కలవు. మా బ్రాంచెస్ Hyd, విజయవాడ, బెంగళూరు. Ph: 9100454789 [HA-14942]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793556]

పెళ్లి సంబంధాలు-కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ, చౌదరి, రెడ్డి కులస్థులకు, సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ వారికి Specialగా చూడబడును, పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1983]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-1-2024వ తేదీ ఉ॥ 9 గం॥లకు 64వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయం వేదిక మరియు మ 2॥లకు 19వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలోజరుగును. ✆ 99895 00130 [B-1234]

150గ॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 [B-610]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14939]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14939]

Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14939]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14939]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/Blue Trend Matrimonial (P) Ltd. [HA-14939]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-950]

కాపు వధూవరుల స్వయంవరం (Online) 17 Dec. 2023, Free Registration Bhavani Matrimony, ECIL, HYD. Ph: 9704656103/ 9533608887 [HA-679]

★★

Reddys - Naidus Matrimony- రెడ్లు- నాయుడులకు మాత్రమే-ఫ్రీ రిజిస్ట్రేషన్ & క్విక్ రెస్పాన్స్, వాట్సప్: 7337355435, చిత్తూరు. [T-4793]

Kalyani Matrimony: గౌడ, కాపు మరియు అన్ని కులాల వారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన పెండ్లి సంబంధాల కొరకు వెంటనే సంప్ర: 8500747535/ 9533133969. kalyanimatrimony.in [H-793389]

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి రెండు గంటల సమయం
- వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ముక్కోటి ఏకాదశితోపాటు ఆదివారం, 25వ తేదీ సోమవారం సెలవు నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఉదయం నుంచే సాధారణ భక్తులతోపాటు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వదర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ. 500 టికెట్ల క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ముక్కోటి..భక్తకోటి



ఉత్తర ద్వార దర్శనంలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడుని దర్శించుకుంటున్న భక్తులు

- ముక్కోటికి కిటకిటలాడిన మంగళాద్రి
- ఉత్తర ద్వారంలో దర్శనం స్వామివారు
- దర్శించుకున్న పలువురు ప్రముఖులు

తాడేపల్లిరూరల్: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. శుక్రవారం రాత్రి బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణతో తిరువంజనోత్సవం నిర్వహించుకుని శ్రీదేవి భూదేవి సమేతుడై బంగారు గరుడ వాహనంపై శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు బంగారు శంఖుతో తీర్థం స్వీకరించారు. ముక్కోటి సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వార దర్శనంలో పలువురు న్యాయమూర్తులు, రాష్ట్ర సమాచార ప్రసార సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు న్యాయవాదులు, అధికారులు దర్శించుకున్నారు.



భక్తులకు బంగారు శంఖుతో తీర్థం అందజేస్తున్న ఆలయ అర్చకులు

అట్టహాసం..సంబరమాశ్చర్యం

✤ గుంటూరులో నంది నాటకోత్సవాలు ప్రారంభం ✤ కళాభిమానులు, విద్యార్థులతో కిక్కిరిసిన ప్రాంగణం

- నాటక రంగ పరిరక్షణ కోసమే నంది నాటకోత్సవం
- బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు
- తొలిరోజు నాలుగు పద్య, సాంఘిక నాటక ప్రదర్శనలు

పాత గుంటూరు: అంతరించిపోతుందనుకుంటున్న తరుణంలో నాటక రంగ పరిరక్షణ కోసం, నిరుత్సాహంగా ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు నిర్వహిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్వరాజ్య సమరయోధుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం జయంతి సందర్భంగా ఆయన పేరుతో కళా ప్రాంగణంలో ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి మంత్రి వేణుగోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు సంస్థ ఎండీ టీ.విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ సమాజ సంస్కరణకు విశేష కృషి చేసిన మహనీయుడు లక్ష్మీకాంతం జన్మదినం రోజున కళాకారులను గౌరవించే విధంగా ఇలాంటి మహత్కార్యాన్ని సంస్థ నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారుల జీవన ప్రమాణాల పట్ల ప్రభుత్వానికి ఒక ఆశయం, చిత్తశుద్ధి ఉందన్నారు. పేద, మధ్యతరగతి కళాకారుల అభ్యున్నతికి ఈనంది నాటక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎండీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

టీడీపీ హయాంలో కళాకారులకు అన్యాయం

సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన నాటక రంగ సంస్థలు, కళాకారులకు అన్యాయం జరిగిందని అన్నారు. అనర్హులకు నంది అవార్డులు అందించిన హీనచరిత్ర చంద్రబాబుదేనన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హులకే నంది అవార్డులు దక్కుతాయని స్పష్టం చేశారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా 27మంది కళాకారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. సంస్థ ఎండీ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి చెల్లుబోయినకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. నాటక ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులతో విజ్ఞాన మందిరం ప్రాంగణమంతా కిక్కిరిసింది. విద్యార్థులు, కళాభిమానుల కరతాళ ధ్వనులతో ప్రాంగణం మార్మోగింది. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కళాకారుల వసతి, మేకప్ సదుపాయాలు, భోజనం ఏర్పాట్లను సంస్థ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరం నాటకంలోని సన్నివేశం

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అనంతరం ప్రదర్శించిన రెండు పద్య నాటకాలు, రెండు సాంఘిక నాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ మీగడ రామలింగస్వామి రచన, మీగడ మల్లికార్జునస్వామి దర్శకత్వం వహించిన శ్రీకాళహస్తీశ్వరం పౌరాణిక పద్య నాటకం రసవత్తరంగా సాగింది.

▶ రాజాం కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు మెట్ట దామోదరరావు నిర్వహించారు. ఆకురాతి భాస్కర్ శర్మ రచనా, దర్శకత్వంలో ఎర్ర కాలువ సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది.

▶ తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచన, నాటకీరణలో నాన్నా నేనొచ్చేస్తా సాంఘిక నాటిక, గుంటూరు జిల్లా కొల్లూరు మండలం అనంతవరం శ్రీ దుర్గా భవానీ నాట్యమండలి వారి శ్రీ రామభక్త తులసీదాసు పౌరాణిక నాటకం ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.

నేటి నాటక ప్రదర్శనలు ఇవే..

- ఉదయం 9:30 గంటలకు విజయవాడ సంస్కార భారతి నిర్వహణలో డాక్టర్ పి.వి. ఎస్ కృష్ణ రచన దర్శకత్వంలో శ్రీ మాధవ వర్మ పద్య నాటకం
- మధ్యాహ్నం 12:30 గంటలకు రాప్తాడు అరవి యూత్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ఆముదాల సుబ్రహ్మణ్యం రచనా, దర్శకత్వంలో 'బాధ్యత' బాలల నాటిక
- 2:30 గంటలకు హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో శ్రీ ఆకెళ్ల రచన, బీఎం రెడ్డి దర్శకత్వంలో 'కలనేత' సాంఘిక నాటకం.
- సాయంత్రం 4:30 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి నిర్వహణలో వరమాత్మని శివరాం రచన, రమేష్ మంచాల దర్శకత్వంలో 'చీకటి పువ్వు' సాంఘిక నాటిక
- సాయంత్రం 6 గంటలకు తిరుపతి నందనం అకాడమీ నిర్వహణలో డాక్టర్ పి.వివేక్ రచన, దర్శకత్వంలో 'ఉద్ధం సింగ్' కళాశాల, విశ్వవిద్యాలయాల నాటిక
- రాత్రి 7:30 గంటలకు పొన్నూరు రసఝురి నిర్వహణలో ఎల్లాప్రగడ భాస్కరరావు రచన, వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో 'త్రిజుడు' సాంఘిక నాటిక ప్రదర్శన.
- రాత్రి 9.00 గంటలకు కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ నిర్వహణలో రామకృష్ణారావు కథకు, శ్రీ స్నిగ్ధ నాటకీకరణ, గోపరాజు విజయ్ దర్శకత్వంలో 'గమ్యస్థానాల వైపు' నాటిక ప్రదర్శన.

ఆకట్టుకున్న నృత్య జుగల్‌బందీ

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నెలవారీ సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా మొగల్రాజపురం లోని సిద్ధార్థ కళాశాలలోని కళావేదికపై ఆదివారం కేరళకు చెందిన కళాకారుల బృందం ప్రదర్శించిన నృత్య జుగల్‌బందీ(మూడు నృత్య సంప్రదయాలు) ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కేరళకు చెందిన కళాసంస్కృతి ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, కథాకళి అంశాలు జాతీయ సమైక్యతను చాటాయి. జేజే బిజిన కూచిపూడిలో, సుదీప్‌మోహన్ కథకళిలో, రాఫీ సతీష్ భరతనాట్యం సంప్రదాయంలో నృత్య కదంబ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాకారులను అకాడమీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కళాపీఠం అధ్యక్షుడు పొలడుగు లక్ష్మణరావు, కళాపీఠం కార్యదర్శి లలిత్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కేరళ కళాకారుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా...

త్వరలోనే రాజకీయ పార్టీలో చేరుతా: ముద్రగడ



రౌతులపూడి: తాను ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరుతానని, ఏ పార్టీలో చేరేది త్వరలో స్పష్టత ఇస్తానని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పోతులూరు, రౌతులపూడిలో శనివారం ఆయన పర్యటించారు. రౌతులపూడిలో మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వేంకటేశ్వర్లు(దేవుళ్లు), మాజీ కరణం ఆచంట వెంకట సుందర సుబ్బరామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడను కలిసిన విలేకరులు మళ్లీ రాజకీయ అరంగేట్రంపై ప్రశ్నించగా... రాజకీయాలు మాట్లాడేందుకు ఇది సమయం కాదని చెప్పారు. పూర్వపు శ్రేయోభిలాషులను కలిసేందుకు మాత్రమే వచ్చానన్నారు. రాజకీయ పార్టీలో చేరాలని తనను ఎవరూ సంప్రదించలేదని ముద్రగడ చెప్పారు. అనంతరం ప్రత్తిపాడు మండలం పోతులూరులో ఇటీవల మృతిచెందిన పాలింక సత్తిబాబు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

సీఎం జగన్ వెంటే నడుస్తా

పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు



పిఠాపురం: తాను సీఎం వైఎస్ జగన్ వెంటే నడుస్తానని కాకినాడ జిల్లా పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్పష్టంచేశారు. తాను వేరే పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని, అవి కేవలం కల్పితాలేనని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే దొరబాబు శనివారం పిఠాపురంలో విలేకరులతో మాట్లాడుతూ తనపై వస్తున్న అసత్య కథనాలను తీవ్రంగా ఖండించారు. తాను ఏ పార్టీ నేతలతోనూ మాట్లాడలేదని తెలిపారు. ఏ పార్టీ నేతలు తనను కలవలేదని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తాను ఉంటానని, ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని స్పష్టంచేశారు. మరోసారి తమ పార్టీ గెలుపు కోసం సీఎం జగన్ కచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, తనకు మరో ఆలోచన లేదన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో రూ.5 లక్షలు ఆరోగ్య బీమా

సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా ఏటా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. ఈ పథకంలో చేరిన వారికి దేశంలో ఎంప్యానల్ అయిన ప్రధానాస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎం భారతీయ జన ఔషధీ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన మందులు, పీఎంఎంవీవై కింద కింద ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో మొదటి కాన్పునకు రూ.5 వేల పారితోషికం, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6 వేల పారితోషికం ఇస్తున్నట్లు వివరించారు.

చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌లో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ఇప్పటికే వాదనలు ముగిశాయి. రాతపూర్వక వాదనలు సమర్పించాలంటూ న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. సీఐడీ అధికారులు కోర్టు ముందు ఓ మెమో దాఖలు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నిందితునిగా ఉన్న లోకేశ్ ఇటీవల పలు మీడియా ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చి దర్యాప్తు అధికారులను, సాక్షులను బెదిరించారంటూ ఆ ఇంటర్వ్యూల వివరాలను కోర్టు ముందుంచారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించే ముందు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ మెమోను పరిశీలించిన న్యాయమూర్తి దీనిపై రాతపూర్వకంగా అభ్యంతరాలు దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులను ఆదేశించారు. దీంతో చంద్రబాబు తరఫు న్యాయవాదులు సీఐడీ మెమోను వ్యతిరేకిస్తూ మెమో దాఖలు చేశారు. సీఐడీ మెమోను తిరస్కరించాలని కోరారు. అనంతరం న్యాయమూర్తి ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

అంగన్‌వాడీల సమస్యలపై దృష్టి పెట్టండి: చంద్రబాబు

సాక్షి, అమరావతి: గత 11 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయకపోగా, న్యాయం కోసం రోడ్డెక్కినవారి నిరసనలను అణిచివేయడం దుర్మార్గమని అన్నారు.

అసత్యాలు అసూయపడేలా..

పింఛన్లలో అవినీతి అంటూ ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం

- పూర్తి ఆన్‌లైన్ విధానంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకున్నా అవినీతి అంటూ అడ్డగోలు ఆరోపణలు
- బయోమెట్రిక్ ప్రక్రియ కూడా ఆధార్‌తో అనుసంధానం
- ఈ వివరాలు సరిపోలిన తర్వాతే పింఛన్ డబ్బులు అందజేత
- ఈ సమాచారమంతా ఎప్పటికప్పుడు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు
- అయినా ఇవేవీ తెలుసుకోకుండా గుడ్డిగా అసత్య కథనాలు
- ప్రతి నెలా ఠంఛనుగా ఒకటో తేదీనే ఇంటిదగ్గరే పింఛన్ ఇస్తున్నా ఏడుపే
- పచ్చముఠా ఆరోపణలపై 'సెర్ప్' ఫ్యాక్ట్‌చెక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారం చూసి అబద్ధాలు కూడా అసూయపడుతున్నాయి. వారు చేసే విమర్శలు విని, చూసి జనం సైతం నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా లేకుండా సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం అసత్యాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారు. మునుపెన్నడూ లేని విధంగా అవ్వాతాతలకు ప్రతీనెలా ఠంఛనుగా ఒకటో తేదీనే ఇంటికెళ్లి మరీ పింఛన్లు పంపిణీ చేస్తున్నా అందులోనూ వారు రంధ్రాన్వేషణ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నిజానికి.. ఈ విషయంలో అవినీతి అంటూ ప్రతిపక్షాలు, వారి అనుకూల పత్రికలు పెడుతున్న పెడబొబ్బలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో గూడుకట్టుకున్న అభిమానంతో వారు ఎంతగా రగిలిపోతున్నారో వారి మాటలు, రాతలు చూస్తే అర్థమవుతుంది. పింఛన్లపై పచ్చముఠా విషం కక్కుతున్న నేపథ్యంలో నిజాలపై రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యాక్ట్‌చెక్' విడుదల చేసింది. ఆ వివరాలు..

నిజానిజాలు తెలుసుకోకుండా..

రాష్ట్రంలో ప్రతినెలా సామాజిక పింఛన్లు పొందుతున్న 65.33 లక్షల మందిలో ప్రస్తుతం 55.68 లక్షలమంది వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు రూ.2,750ల చొప్పున పింఛను తీసుకుంటున్నారు. జనవరి 1 నుంచి వీరి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. మిగిలిన దివ్యాంగ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పింఛనుదారులకు ఒక్కొక్కరికీ ఇప్పటికే రూ.3 వేల నుంచి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ప్రతినెలా పింఛను పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో.. కొత్తగా పింఛన్ల పెంపు వర్తించే 55.68 లక్షల మందిపై ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదించారు. దీనిపై జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ రెండ్రోజుల క్రితం.. ప్రభుత్వం ప్రతినెలా 65.33 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తోందని మీడియాకు చెబుతూ.. మంత్రివర్గ సమావేశంలో కేవలం 55.68 లక్షల సంఖ్యనే చూపిందని మిడిమిడి జ్ఞానంతో ఆరోపించారు. మిగిలిన సంఖ్యకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని నోటికొచ్చినట్లు సిగ్గూఎగ్గూ లేకుండా అబద్ధాలు చెప్పేశారు. మొత్తంగా ప్రభుత్వం తప్పుడు లెక్కలతో నెలకు రూ.292 కోట్లు చొప్పున ఏడాదిలో రూ.3,500 కోట్లకుపైగా అవినీతికి పాల్పడుతోందని ఆయన విషం కక్కారు. ఈ వివరాలను కనీసం పరిశీలించకుండా.. ఆ ఆరోపణల్లో నిజాలను తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా వారి అనుకూల ఈనాడు పత్రిక అడ్డగోలుగా అచ్చోసింది. వాస్తవానికి.. ప్రభుత్వం ప్రతినెలా వలంటీర్ల ద్వారా పంపిణీ చేసే పింఛన్ల వివరాలను, వారికి చెల్లించిన మొత్తాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆన్‌లైన్‌లో ఉంచుతుంది. అయినా, ఆ వివరాలను నాదెండ్ల మనోహర్ కానీ, ఈనాడు కానీ కనీసం పట్టించుకోలేదు. వాటిపై అధికారులను కూడా సంప్రదించకుండానే చేతికొచ్చింది ఈనాడు రాసిపారేసింది.



అవినీతికి ఆస్కారంలేని విధానంలో పంపిణీ..

నిజానికి.. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతోంది. ఒక్కో లబ్ధిదారునికి పింఛను డబ్బులు అందజేసే సమయంలో వారి బయోమెట్రిక్‌ను నమోదు చేసుకునే ప్రక్రియ ఎప్పటి నుంచో అమల్లో ఉంది. సీఎం జగన్ ప్రభుత్వం కొత్తగా మరింత పారదర్శకత తీసుకొచ్చి, బయోమెట్రిక్ ప్రక్రియ కూడా ఆధార్‌తో అనుసంధానం చేసింది. ఆధార్‌లో ఆ వ్యక్తి బయోమెట్రిక్ వివరాలు, పింఛను పంపిణీ సమయంలో సేకరించి బయోమెట్రిక్ వివరాలు సరిపోలిన తర్వాత పింఛను డబ్బులు అందజేస్తున్నారు. ఇలా ఒక్కో గ్రామంలో ఎంతమందికి పింఛను పంపిణీ చేశారో... అంతమంది లబ్ధిదారుల బయోమెట్రిక్ వివరాలు రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదవుతాయి. ఈ ప్రక్రియలో అసలు అవినీతికి ఆస్కారం లేదు.

అర్థంలేని ఆరోపణలు..

రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 1 నుంచి పంపిణీకి గాను 65.54 లక్షల మంది పింఛనుదారుల కోసం రూ.1,806.90 కోట్లు విడుదల చేయగా, డిసెంబర్ 1 నుంచి పంపిణీకి 65.33 లక్షల మంది పింఛనుదారుల కోసం రూ.1,800.96 కోట్లు విడుదల చేసింది. వాస్తవానికి.. పింఛనుదారుల్లో అత్యధికులు అవ్వాతాతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కావడంతో ప్రతినెలా వారిలో 16 వేల నుండి 20 వేల వరకు మరణాలు ఏళ్ల తరబడి నుంచి నమోదవుతున్నాయి. ఇలా మరణించిన వారి పింఛన్లను తొలగించి, కొత్తగా నమోదు చేసుకుని అందులో అర్హత కలిగిన వారికి పింఛను సొమ్ము విడుదల చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. కానీ, మరణించిన వారి తొలగింపు కారణంగా నవంబరు–డిసెంబరు నెలల మధ్య లబ్ధిదారుల వ్యత్యాసంలో లెక్క తప్పిందనడం అర్థంలేని ఆరోపణ మాత్రమే.

చంద్రబాబు హయాంలో అవ్వాతాతలకు నరకయాతనే..

గత చంద్రబాబు ప్రభుత్వంలో ఎవరైనా అర్హత ఉండి కొత్తగా పింఛను పొందాలన్నా.. లబ్ధిదారులు ప్రతినెలా వారి పింఛను డబ్బులు తీసుకోవాలన్నా.. నరకయాతన పడే పరిస్థితి ఉండేది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పుడు అర్హులందరికీ ఎప్పటికప్పుడే సంతృప్తస్థాయిలో పింఛను మంజూరు కావడంతో పాటు అవ్వాతాతలకు చిన్న కష్టం లేకుండా ప్రతినెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా వలంటీర్లే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందజేసే పరిస్థితి కల్పించారు. ఈ నేపథ్యంలో.. గత నాలుగున్నర ఏళ్లలోనే దాదాపు 23 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది.

మెడ్‌టెక్ జోన్ సిగలో మరో కలికితురాయి

ఉద్యోగులకు వసతి కోసం ప్రత్యేకంగా ఐవీవై లీగ్ హౌస్



ఐవీవై లీగ్ హౌస్‌ను ప్రారంభించిన డాక్టర్ వీకే పాల్

సాక్షి, విశాఖపట్నం: వైద్య ఉపకరణాల తయారీ, ఎగుమతుల్లో ప్రపంచంలోనే పేరుగాంచిన విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ సిగలో మరో కలికితురాయి చేరింది. ఇందులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల కోసం పూర్తి స్థాయి సౌకర్యాలతో కూడిన వసతి గృహంగా ఐవీవై లీగ్ హౌస్‌ను నిర్మించారు. ఈ హౌస్‌ను నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే పాల్ శనివారం ప్రారంభించారు. ఇందులో పురుషుల బ్లాక్‌కు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరు, మహిళల బ్లాక్‌కు మదర్ థెరిసా పేరు పెట్టారు. వాక్ టూ వర్క్ కాన్సెప్ట్‌తో ప్రారంభించిన ఈ హౌస్‌ను పూర్తి ఏసీ సౌకర్యంతో నిర్మించినట్లు మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. పూర్తిస్థాయి సౌకర్యాలు, జిమ్, ఫుడ్ కోర్టు, ఫుడ్ సర్వీసు సౌకర్యాల్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీతో కలిసి పని చేస్తున్నాం

సీఎం జగన్ ఘనవిజయమే మా లక్ష్యం: ఐ–ప్యాక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది నుంచి వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నామని ఐ–ప్యాక్ వెల్లడించింది. 'రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి అనునిత్యం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మా వంతు తోడ్పాటును అందిస్తాం. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ తిరుగులేని విజయం సాధించడానికి కృషి చేస్తాం' అని ఐ–ప్యాక్ శనివారం ఓ ట్వీట్ ద్వారా స్పష్టం చేసింది.

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ సమావేశం

- సీఎం రమేష్ సొంత విమానంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన నారా లోకేశ్
- మూడు గంటలకు పైగా చంద్రబాబుతో సమావేశం
- రాబోయే ఎన్నికల్లో టీడీపీ పరిస్థితిపై చర్చ!
- మళ్లీ అదే విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లిన లోకేశ్
- పీకేపై గతంలో బాబు తీవ్ర విమర్శలు
- ఇప్పుడు ఆయనతోనే ఎన్నికల వ్యూహాలకు సమావేశం

సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) శనివారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వారిద్దరూ మూడు గంటలకు పైగా సమావేశమైనట్లు సమాచారం. టీడీపీ నేత లోకేశ్‌తో కలిసి ప్రశాంత్ కిషోర్ శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ప్రశాంత్ కిషోర్‌తో చంద్రబాబు, లోకేశ్ రాజకీయ అంశాలపై చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి ఏమిటనే దానిపై వారు మాట్లాడినట్లు తెలిపాయి. అనంతరం ప్రశాంత్ కిషోర్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగానే కలిశానని ప్రశాంత్ కిషోర్ మీడియాకు తెలిపారు. ఆయన సీనియర్ నాయకుడని, అందుకే కలిశానని చెప్పారు. చంద్రబాబుతో ఏం చర్చించారో వెల్లడించలేదు.

బీజేపీ నేత సీఎం రమేష్ విమానంలో..

ప్రశాంత్ కిషోర్‌ను విజయవాడ తీసుకురావడానికి చంద్రబాబు బీజేపీలో ఉన్న తన అనుచరుడు సీఎం రమేష్‌కి చెందిన విమానాన్ని వాడుకోవడం పైనా చర్చ జరుగుతోంది. రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన విమానంలో లోకేశ్, ప్రశాంత్ కిషోర్ హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చారు. ఈ కంపెనీ సీఎం రమేష్‌దనే విషయం అందరికీ తెలిసిందే. ఆ విమానంలోనే పీకేను తీసుకువచ్చిన లోకేశ్ మళ్లీ అదే విమానంలో తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లారు. దీన్నిబట్టి సీఎం రమేష్ బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోసం పని చేస్తున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది.

అప్పుడు ప్రశాంత్ కిషోర్ చేదు..

బీహార్ వాడికి ఇక్కడ పనేంటి అంటూ ప్రశాంత్ కిషోర్‌పై గత ఎన్నికల సమయంలో నానా రకాలుగా తూలనాడిన చంద్రబాబు.. ఇప్పుడు అదే ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వ్యక్తులను, పార్టీలను, సంస్థలను అవసరమైనప్పుడు అక్కున చేర్చుకోవడం, అవసరం తీరాక గిరాటెయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేన పార్టీలతో ఆయన ఆడుతున్న ఆటలు, అవసరం తీరాక వాటిని గడ్డిపరక కింద జమకడతారు. మళ్లీ అవసరమైతే అదే వ్యక్తులను చేరదీస్తారు. ఇదంతా కళ్లకు కనిపిస్తున్నదే. ఎన్నికల్లో మిత్రపక్షాలనే మోసం చేయడం బాబు హాబీ. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ విషయంలోనూ బాబు ఇదే తీరుతో వ్యవహరిస్తున్నారు. 'ఆయనో పెద్ద వ్యూహకర్త' అంటూ 2019లో ప్రశాంత్ కిషోర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బీహార్ నుంచి వచ్చిన ప్రశాంత్ కిషోర్ రాష్ట్రంలో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశాంత్ కిషోర్ అప్పట్లో చంద్రబాబుకు సమాధానం ఇస్తూ.. 'కళ్ల ముందు ఓటమి కనిపిస్తుంటే సీజన్లకు అనుగుణంగా రాజకీయాలు చేసే చంద్రబాబు అలా మాట్లాడటం తనను ఆశ్చర్యపరచలేదు' అంటూ కౌంటర్ ఇచ్చారు. బీహార్‌కు వ్యతిరేకంగా, అభ్యంతరకరంగా మాట్లాడడం మానేసి, ఏపీ ప్రజలు మళ్లీ ఆయనకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలని చంద్రబాబుకు సూచించారు. అప్పట్లో ప్రశాంత్ కిషోర్‌పై ఆరోపణలు గుప్పించిన లోకేశ్ ఇప్పుడు దగ్గరుండి ప్రత్యేక విమానంలో తీసుకువచ్చారు.

మెటీరియల్ బాగాలేకపోతే మేస్త్రి ఏం చేస్తాడు

చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ సమావేశంపై అంబటి సెటైర్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: అసలు మెటీరియల్ బాగాలేకపోతే ఏ మేస్త్రి అయినా ఏం చేస్తాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే)తో శనివారం చంద్రబాబు సమావేశం కావడంపై అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. ఎంతమంది పీకేలు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని అన్నారు. 'గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వ్యూహకర్తగా పనిచేసిన బీహార్‌కు చెందిన ప్రశాంత్ కిషోర్ ఈ రోజు లోకేశ్‌ను, టీడీపీ పెద్దలను కలిశాడని.. ఆయన వారికి వ్యూహకర్తగా ఉండబోతున్నారన్న వార్త వచ్చింది. ఆయనను లోకేశ్ తీసుకువెళ్లడం చూసినప్పుడు కించిత్ ఆశ్చర్యం కలిగింది. గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటే.. ప్రశాంత్ కిషోర్ ఒక వ్యూహకర్త. దేశంలో అనేక పార్టీలకు ఆయన పనిచేశారు. అతని వృత్తే అది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేశారు. ఆయన వ్యూహకర్తగా పనిచేసిన రోజుల్లో ఇదే లోకేశ్, ఇదే చంద్రబాబు ఆయన గురించి ఏ మాట్లాడారో గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన పీకే కాదు.. బీహార్ డెకాయిట్ అని చంద్రబాబు అన్నారు. పీకే తోకలు కత్తిరిస్తాం. ఆయన ఏమైనా చేయగలడా.. అని కూడా అన్నారు' అని అంబటి గుర్తు చేశారు. పీకే మతకల్లోలాలు సృష్టించి, హత్యలు చేయించారని చంద్రబాబు విమర్శించారని గుర్తు చేశారు. లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నమ్మకం లేక ప్రశాంత్ కిషోర్‌ను తెచ్చుకుందని వ్యాఖ్యలు చేసిన విషయాన్ని సైతం అంబటి గుర్తు చేశారు. చంద్రబాబు, లోకేశ్ ఎంతగా దిగజారిపోతారో, అవసరమైతే కాళ్లు పట్టుకుంటారో అనడానికి ప్రశాంత్‌కిషోర్ ఉదంతమే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ఒకప్పుడు బీహార్ డెకాయిట్ అన్న ప్రశాంత్ కిషోర్‌నే ఇప్పుడు వ్యూహకర్తగా కావాలని ఢిల్లీ వెళ్లి బతిమలాడి తెచ్చుకున్నారని.. వారికి గెలుస్తామన్న నమ్మకం లేదని ప్రజలకు కూడా అర్థమైందని ఎద్దేవా చేశారు.

ఆ పీకే.. ఈ పీకే టీడీపీని బతికించలేరు

ఆ పీకే (ప్రశాంత్ కిషోర్) అయినా ఈ పీకే (పవన్ కళ్యాణ్) అయినా తెలుగుదేశం పార్టీని బతికించే అవకాశం లేదని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కొందరు డాక్టర్లు వైద్యం చేయడానికి, మరికొందరు శవ పరీక్ష చేయడానికి ఉంటారని, అలాగే ప్రశాంత్ కిషోర్ ఇప్పుడు చనిపోయిన తెలుగుదేశం పార్టీకి పోస్టుమార్టం చేయడానికి మాత్రమే పనికి వస్తాడన్నారు. ఎంతమంది పీకేలు వచ్చినా టీడీపీని బతికించడం సాధ్యం కాదన్నారు. ఇంతకుముందు వ్యూహకర్తగా పనిచేసిన రాబిన్‌సింగ్ పనికిరాలేదని, అందుకే కొత్త వ్యూహకర్తను తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు లోకేశ్ కొంతకాలం కనపడలేదని, ఆయన ఢిల్లీ వెళ్లి ప్రశాంత్ కిషోర్‌ను బతిమిలాడి తీసుకువచ్చారన్నారు.

పిల్లలకిచ్చే కానుక పైనా 'కుటిల' రాతలు

'జగనన్న విద్యా కానుక'పై అవాస్తవాలు, వక్రీకరణలతో ఈనాడు కథనం



సాక్షి, అమరావతి: వాస్తవాలు కనిపించవు. అసలు చూడాలన్న ప్రయత్నమే ఉండదు. ఏదో విధంగా ప్రభుత్వంపై బురద జల్లడమే ఈనాడు రామోజీరావు నిత్య జీవితం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. పేద విద్యార్థులు చదువుకొనే ప్రభుత్వ బడుల రూపురేఖలు, బోధన తీరుతెన్నులను సమూలంగా మారుస్తున్నారు. పేదింటి పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చారు. వారిని అదే స్థాయిలో తీర్చిదిద్దడానికి యూనిఫాం, నోట్ బుక్స్, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీ, షూలు, బెల్టులు వంటి విద్యకు అవసరమైన వస్తువులను మంచి నాణ్యత గల బ్యాగుతో సహా 'జగనన్న విద్యా కానుక' అందిస్తున్నారు. ఎనిమిది పదుల వయసున్న రామోజీరావు పేదల పిల్లలను అన్ని విధాలుగా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే ముఖ్యమంత్రిని ఎన్నడైనా, ఎక్కడైనా చూశారా? ఆయన అనుంగు చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రానికి తొమ్మిదేళ్లు, విభజిత ఏపీకి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో కనీసం మరమ్మతులు చేసిన ప్రభుత్వ స్కూళ్లెన్ని? తరగతి గదుల్లో చాక్‌పీస్‌లకు కూడా గతి లేని పరిస్థితి. ఎంతసేపూ భారీగా ఫీజులు వసూలు చేసే ప్రైవేటు విద్యా సంస్థలకు స్థలాలు, రాయితీలు ఇచ్చి, వాటి యజమానులను కోట్లకు పడగలెత్తేలా చేసింది చంద్రబాబు. ఇందులో ఎవరికెంత లబ్ధి అన్నది రామోజీకీ తెలియనిది కాదు. బాబు పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో పేదింటి పిల్లలు ఎంత దయనీయ స్థితిలో గడిపారో అందరికీ తెలిసిందే. బడికి రాలేక, అక్కడ చదువు చెప్పే వారు లేక విద్యను మధ్యలోనే ఆపేసిన విద్యార్థులు ఎందరో! అటువంటి దయనీయ స్థితి నుంచి ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారు. పేద విద్యార్థులూ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, సీబీఎస్ఈ సిలబస్, డిజిటలైజేషన్, ట్యాబులు పంపిణీ చేయడం, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ పెట్టడం, బై లింగువల్ టెక్స్ట్‌బుక్స్‌తో పాటు, బైజూస్ కంటెంట్, టోఫెల్, ఐబీ సిలబస్ వంటి అనేక విప్లవాత్మక మార్పులను తెచ్చారు. విద్యా కానుక ఆ పిల్లలకు ప్రత్యేకం. క్రమం తప్పకుండా ప్రతి ఏటా స్కూలు తెరిచే సమయానికి విద్యాకానుకను ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తోంది. కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు దీటుగా చక్కటి యూనిఫాం వేసుకొని, బూట్లు వేసుకొని ఎంతో ఆత్మస్థైర్యంతో పేదల పిల్లలు ఈరోజు పాఠశాలలకు వెళ్తున్నారు. అక్కడ ఐఎఫ్‌పీలు, కలర్ టీవీల ద్వారా డిజిటల్ విద్యతో బంగారు భవిష్యత్తు వైపు నడుస్తున్నారు. ఇదే రామోజీకి కంటగింపుగా ఉంది. ఎంతసేపూ పెత్తందారుల పిల్లలే బాగుపడాలన్న దుగ్ధతో పేదల చదువులపైనా అదే పనిగా అసత్య కథనాలు అచ్చేస్తున్నారు. అదే కోవలో శనివారం 'విద్యాకానుక ఎవరి జేబులోకి?' శీర్షికన ఈనాడులో అవాస్తవాలు, వక్రీకరణలతో కథనం రాశారు. ఈ తప్పుడు కథనం వెనుక అసలు నిజాలను పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఆ వివరాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: ప్రజాధనంతో కొంటున్న వస్తువులు, వాటిపై చేస్తున్న ఖర్చులపై పారదర్శకత చూపాలి కదా.!

వాస్తవం: 2023–24 విద్యా సంవత్సరానికి నవంబరు 2022లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 5 శాతం పెంచి జేవీకే–4లో 43,10,165 మంది విద్యార్థుల కోసం ప్రభుత్వం నుంచి విద్యాశాఖ అడ్మినిస్ట్రేటీవ్ శాంక్షన్ తీసుకుంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించాం కాబట్టే, టెండర్లు పిలిచినప్పటికీ సప్లయ్ ఆర్డర్ ఇచ్చేటప్పుడు అప్పటికి ఉన్న విద్యార్థుల యథార్థ సంఖ్యను పరిగణనలోకి తీసుకుని 39,95,992 మంది విద్యార్థుల కోసం మాత్రమే ఇచ్చాం. దాదాపు 3.15 లక్షల కిట్లను తగ్గించాం. అడ్మినిస్ట్రేటీవ్ శాంక్షన్ తీసుకున్నప్పటి నుంచి వస్తువుల పంపిణీకి 8 నుంచి 10 నెలలు పడుతుంది.

ఆరోపణ: ఏ పథకం ప్రవేశపెట్టినా వాటి నుంచి అధికార పార్టీ అస్మదీయులకు గరిష్ఠ మేలు జరిగేలా పన్నాగాలు పన్నుతున్నారు. విద్యా కానుక కిట్ల విషయంలోనూ ఇదే తేలింది.

వాస్తవం: ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగానే కిట్లు తీసుకుంటున్నాం. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు మించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం రీజాయిన్ అయిన విద్యార్థులకు కూడా కిట్లు ఇస్తున్నాం. జేవీకే 3లో యూనిఫాం, బ్యాగులు, బూట్ల స్పెసిఫికేషన్లు మారడం వల్ల వాటిని ఆ సంవత్సరంలోనే కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, ఏపీఆర్ఎస్‌లోని ఇంటర్మీడియట్‌తో పాటు అవసరమైన విద్యార్థులకు ఇచ్చాం. బెల్టులు, నోట్ పుస్తకాలను జేవీకే–4లో వినియోగించుకున్నారు. కాబట్టి కిట్లు ఎక్కడా దుర్వినియోగం కాలేదు.

ఆరోపణ: బూట్లు సైజులు సరిపోక దాదాపు 45 శాతం విద్యార్థులు వాటిని వేసుకోకుండానే బడులకు వస్తున్నారు. బ్యాగులు మూడు, నాలుగు నెలలకే చిరిగిపోయాయి.

వాస్తవం: విద్యార్థుల పాదాల కొలతలు ఆరు నెలల ముందుగా తీసుకుంటారు. కొంతమంది విద్యార్థుల పాదాల అంచనాకు మించి కొద్దిగా పెరిగాయి. మిస్ మ్యాచ్ అయిన బూట్లు కూడా రీప్లేస్ చేశాం. జేవీకే – 4లో పంపిణీ చేయగా మిగిలిన బూట్లు స్టాక్ పాయింట్లలో ఉన్నాయి. జేవీకే –3లో విద్యార్థుల నుంచి పాడైన బ్యాగుల స్థానంలో కొత్తవి అందించాం. నాణ్యతపై సీపెట్ సర్టిపై చేసినందున ఆ బ్యాగుల సరఫరాదారులపై చర్యలు తీసుకోవడానికి వీలు పడలేదు.

ఆరోపణ: పాఠశాల విద్యాశాఖ అస్తవ్యస్త నిర్ణయాలతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆడిట్ విభాగం గుర్తించింది.

వాస్తవం: ఇది పూర్తిగా అవాస్తవం. ఇదివరకే ఆడిట్ రిప్లయ్స్ అన్నీ ప్రభుత్వానికి సమర్పించాం.

ఆరోపణ: 2022 సెప్టెంబరుకు విద్యార్థుల సంఖ్య 40.66 లక్షలకు తగ్గడంతో 4 లక్షలకుపైగా కిట్లు మిగిలాయి. వీటికైన ఖర్చు రూ.70.13 కోట్లు. వీటిని పట్టించుకోకుండా మరోసారి టెండరు

వాస్తవం: జేవీకే 3లో యూనిఫాం, బ్యాగులు, బూట్ల స్పెసిఫికేషన్లు మారడం వల్ల వాటిని ఆ సంవత్సరంలోనే కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, ఏపీఆర్ఎస్‌లోని ఇంటర్‌తో పాటు అవసరమైన విద్యార్థులకు ఇచ్చాం. బెల్టులు, నోట్ పుస్తకాలను జేవీకే–4లో వినియోగించాం. కిట్లు ఎక్కడా మిగల్లేదు. సప్లయ్ ఆర్డర్ ఇచ్చేటప్పుడు అప్పటికి ఉన్న విద్యార్థుల యదార్థ సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నాం. టెండర్ నిబంధనల ప్రకారమే కిట్లు కొనుగోలు, సరఫరాదారులకు వర్క్ ఆర్డర్లు ఇస్తాం. సప్లయ్, పంపిణీ వివరాలన్నీ పారదర్శకంగా జేవీకే వెబ్ సైట్‌లో ఉంటాయి. బయోమెట్రిక్‌లో సాంకేతిక లోపం తలెత్తితే ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

జగనన్న విద్యాకానుక కోసం చేసిన ఖర్చు

ఆర్థిక సంవత్సరం	ఖర్చు (రూ. లక్షల్లో..)
2019-20	23,811.09
2020-21	64,809.64
2021-22	78,920.93
2022-23	88,668.67
2023-24	103,287.63
మొత్తం	3,59,497.96



ఆరోపణ: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన విద్యా కానుక వస్తువుల్లో నాణ్యత లేదని విజిలెన్స్ విభాగం చెప్పినా దీనిపై విచారణ జరపలేదు. మూడు జతల ఏకరూప దుస్తులకు వస్త్రం ఇవ్వగా.. దాన్ని కుట్టించుకుంటే రెండు జతలకే సరిపోయింది.

వాస్తవం: గతేడాది విజిలెన్స్ నివేదిక ఆధారంగా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా నాణ్యతా ప్రమాణాలను పెంచాం. ప్రతి మండల స్టాక్ పాయింట్‌లోని క్వాలిటీ వాల్‌లో విద్యార్థికి ఇచ్చిన వస్తువులు నమూనాలు ఇప్పటికీ ఉన్నాయి. వాటి నాణ్యతను అక్కడ పరిశీలించుకోవచ్చు. యూనిఫాం వస్త్రం రెండు జతలకే సరిపోతుందన్నది పూర్తిగా అవాస్తవం. విద్యార్థుల కొలతలను శాస్త్రీయంగా తీసుకొని, తరగతుల వారీగా నమూనా దుస్తులను కుట్టించి నిర్ధారణ చేసుకున్నాం. డ్యామేజ్ అయిన బ్యాగుల స్థానంలో కొత్తవి ఇచ్చాం.

ఆరోపణ: గతేడాది కిట్‌కు రూ.1,565 ఇచ్చారు. ఈసారి ధరను రూ.1,960కి పెంచేశారు.

వాస్తవం: రివర్స్ టెండరింగ్‌తో కూడిన ఈ–ప్రాక్యూర్‌మెంట్ కోసం జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచాం. ఈ విధానం అత్యంత పారదర్శకంగా ఉంటుంది. ఇందులో కనిష్ఠ ధరను కోట్ చేసిన వారిని ఎంపిక చేస్తాం. మెరుగైన, నాణ్యతతో కూడిన వస్తువులను సరఫరా చేయాలనే ఉద్దేశంతో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) నిర్ధారించిన స్పెసిఫికేషన్లు ఉన్న వస్తువులనే విద్యార్థులకు సరఫరా చేశాం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400 708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

భక్తులతో వైష్ణవాలయాలు కిటకిట

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు
- ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు

సాక్షి, బళ్లారి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం, వైకుంఠ ఏకాదశి రెండు ఒకే రోజు కలిసి రావడంతో శ్రీహరి నామ జపం చేస్తూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని సత్యనారాయణ పేటలో వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయం, నగర శివారు రామేశ్వరి నగర్‌లో కొలువు దీరిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, తాలూకాలోని రూపనగుడిలో పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వేల సంఖ్యలో భక్తజన సందోహం కిటకిటలాడింది. ఈ సందర్భంగా అన్ని ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాదాలను కూడా భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ నిర్వాహకులు అందజేశారు. వేలాది మంది భక్తులు శ్రీహరిని దర్శించుకుని ఓం నమో నారాయణాయ నమః అనే నామాన్ని స్మరణ చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తిపరవశంతో కనిపించాయి.





బళ్లారిలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు, రాయచూరులోని వేంకటేశ్వరాలయంలో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే రాజేంద్రరెడ్డి దంపతులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయచూరు రూరల్: నగరంలోని ఉప్పారవాడిలో వెలసిన వేంకటేశ్వర ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు, పూజలు జరిగాయి. శనివారం ఆలయంలో విగ్రహాన్ని పల్లకీలో సేవలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని సేవించి రథోత్సవం జరిపారు. ఏగనూరు దేవాలయం, బండ్లమాంబ రాజ మాతా ఆలయం, ఇతర దేవస్థానాల్లో భక్తుల సందడితో ఏకాదశిని ఆచరించారు. నవోదయ వైద్య కళాశాల ఆవరణలో వెలసిన వేంకటేశ్వరాలయంలో నారాయణపేట మాజీ శాసన సభ్యుడు రాజేంద్ర రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నెరవేర్చారు.



రాయచూరులో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



బళ్లారిలో స్వామి వారి ఆలయం ముందు దర్శనానికి బారులు తీరిన భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

నరేగ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి తండాలో చేపడుతున్న నరేగ పనులను శనివారం జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు పేదలకు వరం

కంప్లి: మఠాలు, మాన్యాల్లో ఏర్పాటు చేసిన సామూహిక వివాహాలు పేద కుటుంబాలకు ఎంతో సహాయకరం అని, దుబారా ఖర్చులకు కళ్లెం వేయవచ్చని ఎమ్మెల్యే కృష్ణానాయక్ తెలిపారు. హూవిన హడగలి తాలూకా లింగనాయకనహళ్లి జంగమ క్షేత్ర మఠంలో ఏర్పాటు చేసిన సామూహిక వివాహ కార్యక్రమంలో 24 జంటలు ఒక్కటై సప్తపదిలో కాలు మోపిన వారిని ఆశీర్వదించి మాట్లాడుతూ సతిపతులు ఒకరినొకరు అర్థం చేసుకుని ఉత్తమ జీవితం సాగిస్తూ అందరికీ ఆదర్శం కావాలన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



ప్రారంభిస్తున్న ప్రశాంతసాగర స్వామీజీ

కంప్లి: ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపరాదని కూడ్లిగి హిరేమఠ సంస్థాన పీఠాధ్యక్షులు, మఠాధీశుల ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత సాగర స్వామీజీ తెలిపారు. కూడ్లిగిలోని హిరేమఠ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన హృద్రోగ ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి సలహా సూచనలు అందించారు. ఉద్యోగాలతో వివిధ ఒత్తిళ్లు, మారిన ఆహార పద్ధతులతో గుండె, మానసిక వ్యాధులు పెరుగుతున్నాయన్నారు.

బిందుసేద్య పరికరాల పంపిణీ



పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణానాయక్

కంప్లి: హూవిన హడగలి రైతు కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే కృష్ణానాయక్ లబ్ధిదారులకు బిందుసేద్య పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ఇకపై రైతాంగం ప్రభుత్వ వివిధ పథకాల కింద దరఖాస్తులు అందిస్తే అర్హులకు వ్యవసాయ సంబంధిత వివిధ పరికరాలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ మహ్మద్ అష్రఫ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మొరార్జీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

కంప్లి: పట్టణంలోని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో విద్యార్థులు నిత్యం చన్నీళ్ల స్నానం చేయడం వల్ల చర్మ తదితర వ్యాధులు సోకి సుమారు 20 మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయిన సమాచారం తెలుసుకున్న రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యులు శశిధర్ ఎస్.కోసంబి శనివారం పాఠశాలను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. వసతి పాఠశాలలోని విద్యార్థులు చర్మవ్యాధి సోకి ఇళ్లకు వెళ్లిపోతే వారిపై ఎందుకు శ్రద్ధ చూపలేదని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇకపై విద్యార్థుల స్నానాలకు వేడినీళ్లు ఏర్పాటు చేయడంతో పాటు నిత్యం వారి యోగక్షేమాలు విచారిస్తూ ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చేసుకోవాలని సూచించారు.

మాల దీక్ష విరమణకు ఏర్పాట్ల పరిశీలన



కొబ్బరికాయ కొట్టి వంట పనిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: అంజనాద్రి కొండపై హనుమ మాల దీక్ష విరమణకు చేపట్టిన అన్ని ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఉదయాన్నే ఎమ్మెల్యే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని కొండపైకెక్కి బాలాంజనేయ స్వామికి విశేష పూజలను చేశారు. అనంతరం ఆయన సంస్కృత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వంటశాలకు వెళ్లి పొయ్యిని వెలిగించి వంట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూరగాయలు, సరుకులు నాణ్యతగా ఉన్నాయా? అని పరిశీలించారు. అనంతరం ఆయన అక్కడే ఉండి పలు కార్యక్రమాలను తిలకించారు. కాగా అంజనాద్రి కొండను విద్యుత్ దీపాలంకరణ గావించడంతో పాటు భోజన శాలలో వంట, పార్కింగ్ వ్యవస్థ, పోలీస్ బందోబస్తు, తాగునీరు, స్నానఘట్టాలు తదితర ఏర్పాట్లను సిద్ధం చేశారు.

2ఏ రిజర్వేషన్ కల్పించకుంటే పోరాటం



మాట్లాడుతున్న బసవజయ మృత్యుంజయ స్వామి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వీరశైవ లింగాయత్ పంచమసాలి వర్గానికి 2ఏ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని లింగాయత్ పంచమసాలి కూడల సంగమ పీఠాధిపతి జగద్గురు బసవజయ మృత్యుంజయ స్వామి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లింగాయత్ పంచమసాలికి 2ఏ రిజర్వేషన్ కల్పించాలని రెండేళ్ల నుంచి అందోళనలు, పాదయాత్రలు చేసినా సర్కార్ స్పందించలేదన్నారు. చివరికి ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై 2ఏకు బదులుగా 2డీని ప్రకటించి చేతులు దులుపుకున్నారని అరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచమసాలి వర్గానికి 2ఏ రిజర్వేషన్ కేటాయించాలని రెండుసార్లు సీఎం సిద్దరామయ్యను కోరినా ఫలితం లేదన్నారు. ఈ విషయంపై జనవరి 14లోగా సర్కార్ అభిప్రాయాన్ని ప్రకటించక పోతే ఆందోళనలకు శ్రీకారం చుడతామన్నారు.

సిరిధాన్యాలపై జాగృతి జాతాకు శ్రీకారం



నడక జాతాను ప్రారంభిస్తున్న మంత్రి బోసురాజు



ఊరేగింపులో పాల్గొన్న కళాకారుల బృందాలు

రాయచూరు రూరల్: ప్రజలకు సిరిధాన్యాల ప్రాముఖ్యతపై ముమ్మర ప్రచారం చేపట్టాలని రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద సిరిధాన్యాలపై జాగృతి జాతా నడకను ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్తులో ప్రజలు సిరి ధాన్యాలపై జాగృతితోడు, రైతులు సిరిధాన్యాలను పండించడానికి ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. జాతాలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్సలర్ హనుమంతప్ప, వీరనగౌడ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవిక, అధికారులు సుధానాయక్, సరస్వతిలున్నారు.

మతతత్వ పార్టీ కాంగ్రెస్సే

కోలారు: అసలైన మతతత్వ పార్టీ కాంగ్రెస్సేనని లోక్‌సభ సభ్యుడు ఎస్ మునిస్వామి ఆరోపించారు. శనివారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య హిజాబ్‌పై నిషేధాన్ని ఎత్తేయడమే వారి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. బీజేపీని పదేపదే మతతత్వ పార్టీ అని అంటున్న సిద్దరామయ్య హిజాబ్ ఆదేశాన్ని వాపసు తీసుకుంటామని ఎలా అంటారని అన్నారు. సిద్దరామయ్య కేవలం ఒక సముదాయానికి మాత్రమే సీఎంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హిందూ సముదాయ విద్యార్థులు కేసరి శాలువాలు వేసుకుని వెళితే ప్రభుత్వం అనుమతిస్తుందా? అని ప్రశ్నించారు. ఒక్కో మతానికి చెందిన వారు ఒక్కో రకం దుస్తులు ధరించి విద్యా సంస్థలకు వెళితే సరిగా ఉంటుందా? అని నిలదీశారు. పాఠశాలలు, కళాశాలల్లో అందరు సమానం అనే భావన కలగాలనే యూనిఫాం నిబంధన విధించారని, విద్యార్థులందరూ దీనిని పాటించడం సబబుగా ఉంటుందన్నారు.

కోచిముల్ నియామకాలు పారదర్శకం

కోలారు: కోచిముల్ నియామకాలు పారదర్శకంగా జరిగాయని, ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని కోచిముల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శనివారం కోచిముల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కోచిముల్‌లో ఉన్న కొందరు తనపై అక్కసుతో నకిలీ జాబితాను సిద్ధం చేసి సోషల్ మీడియాలో విడుదల చేశారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. డైరెక్టర్లు ఊలవాడి నాగరాజ్, హనుమేష్, వడగూరు డి వి హరీష్, కాడేనహళ్లి నాగరాజ్, జయసింహ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

మిరప ధర ఘనం.. దిగుబడి పతనం



రైతులు ఆరబోసిన ఎండు మిరపకాయలు



ఏపీఎంసీలో మిరపను విక్రయిస్తున్న రైతులు

- నీరందక తగ్గిన పంట ఉత్పత్తులు
- రైతులకు శాపంగా ప్రకృతి వైపరీత్యం
- దిక్కుతోచని కళ్యాణ కర్ణాటక రైతులు

రాయచూరు రూరల్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెత చందంగా మిరపకు మార్కెట్‌లో ధర ఉన్నా దిగుబడి లేకపోవడం విడ్డూరంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక రైతుల ముఖాల్లో కళ లేదు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాలో తుంగభద్ర నది, రాయచూరు, యాదగిరి, కలబుర్గి జిల్లాలో కృష్ణా నదులున్నా నీరు అందక రైతుల భూముల్లో వేసుకున్న మిరప పంటలు అనుకున్న మేర దిగుబడి రాలేదు. పొలంలో బోరుబావుల ద్వారా పంటలు పండించాలంటే భూగర్భ జలాల స్థాయి కుదించుకుపోయింది. మరో వైపు విద్యుత్ కోతలు అధికమయ్యాయి. రాయచూరు జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులున్నా వ్యవసాయ పనులు లభించక వలసలు తప్పలేదు. రైతులు జిల్లాలో 50 వేల ఎకరాల్లో మిరప, 86 వేల ఎకరాల్లో కందులు వేశారు. కాలువకు నీరందక, వానలు కురువక భూములు బీళ్లుగా మారాయి. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందక మిరప పంట చేతికందవనే ఆందోళనతో నీటిని కడవలతో మోసి పోశారు. రాయచూరు ఏపీఎంసీలో మిరప కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల ఉత్పత్తుల కొనుగోళ్లకు అవకాశం కల్పించామని అధ్యక్షుడు మల్లికార్జున గౌడ తెలిపారు. బ్యాడిగి మిరప కాయలు క్వింటాల్ ధర రూ.27,000 ఉందని, గుంటూరు మిరప కాయలు క్వింటాల్ ధర రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు ధర ఉండగా, ఏపీఎంసీ మార్కెట్‌లో వారంలో రెండు రోజుల పాటు కొనుగోలు చేస్తామన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం



చిత్రపటాలకు మంత్రి తదితరుల పుష్పాంజలి

రాయచూరు రూరల్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. శనివారం వీరశైవ కళ్యాణ మంటపంలో మాజీ ప్రధాని చరణ్ సింగ్ చౌదరి, పుట్టణ్ణయ్య జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. 75 ఏళ్లు గడిచినా రైతులు సమస్యల వలయం నుంచి బయటికి రాకపోవడాన్ని గుర్తు చేశారు. అధ్యక్ష స్థానం అలంకరించిన రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఆధారంగా మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఏపీఎంసీ, విద్యుత్ చట్టాలను ఉపసంహరించకుండా ఉండడాన్ని తప్పుబట్టారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కరువు సహాయక పనులకు నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. సమావేశంలో మేలుకోటె శాసన సభ్యుడు దర్శన్ పుట్టణయ్య, జిల్లాధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్, బూదయ్య స్వామి, మల్లన్న, దేవరాజ్ నాయక్‌లున్నారు.

విద్యుత్ సురక్షతపై అవగాహన అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: విద్యార్థులు విద్యుత్ సురక్షతపై ప్రజలకు అవగాహన కల్పించాలని బెస్కాం ఉప విభాగ కార్యపాలక ఇంజినీర్ పి.రామతీర్థ తెలిపారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యుత్ సురక్షతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులను అందించి మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకుండా రైతులకు సలహా ఇవ్వాలన్నారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే వెంటనే బెస్కాంకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ సురక్షతా చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంజినీర్లు నంజుండేశ్వర, సుదర్శన్, బీఆర్‌సీ సంయోజకురాలు కేసీ వసంత పాల్గొన్నారు.

సీడీ విడుదల



సీడీ విడుదల చేస్తున్న దృశ్యం

బనశంకరి: కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో ఖ్యాతి గడించి ప్రత్యేకంగా సుప్రభాతంలో పేరెన్నిక గల భారత రత్న డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవరాళ్లు ఎస్.ఐశ్వర్య, ఎస్.సౌందర్య వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం జేపీ.నగర తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆవరణలో ఏ2 క్లాసికల్ మ్యూజిక్ సంస్థాపకుడు, నిర్మాత గీత రచయిత పీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర సుబ్రహ్మణ్య భక్తి సంగీత సీడీని విడుదల చేశారు.

కృష్ణాపురంలో ఏకాదశి పూజలు



వైకుంఠ దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

పావగడ: తాలూకాలో చిన్న తిరుపతిగా పిలిచే కృష్ణాపురం గ్రామంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని వైకుంఠ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. తొలుత స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం నుంచి వైకుంఠాన్ని దర్శించుకున్నారు. అర్చకులు నారాయణ భట్టర్ స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణాలతో మారుమోగింది.

వేడుకగా గురుకొట్టూరేశ్వర స్వామి కార్తీకోత్సవం

కంప్లి: గురుకొట్టూరేశ్వర స్వామి కార్తీకోత్సవం సందర్భంగా గురు కొట్టూరేశ్వర స్వామి మాలధారుల 25వ సంవత్సరపు ఊరేగింపు వైభవంగా జరిగింది. పత్రి బసవేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. హాలస్వామి మఠపు అభినవ హాలసిద్దేశ్వర, గద్దికేరి చరందేశ్వర స్వామీజీ ఊరేగింపును ప్రారంభించారు.

అయోధ్యకు శ్రీరామ భక్తుడి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న దృశ్యం

శ్రీరామ భక్తుడు వినోద్ రెడ్డి

రాయచూరు రూరల్: రాయచూరు నుంచి వినోద్ రెడ్డి అనే శ్రీరామ భక్తుడు అయోధ్యకు కాలి నడకన పాదయాత్ర చేస్తున్నాడు. నగరంలోని మడ్డిపేటకు చెందిన 23 ఏళ్ల యువకుడు వినోద్‌రెడ్డి అయోధ్యలో జరిగే రామ మందిరం ప్రారంభోత్సవాన్ని తిలకించాలనే ఆశతో డిసెంబర్ 13న నగరం నుంచి 1500 కి.మీ. దూరం కాలినడకన ప్రయాణం ప్రారంభించాడు. ప్రారంభోత్సవం నాటికి అయోధ్యకు చేరాలనే తపనతో ప్రతి రోజు 40–50 కి.మీ. చొప్పున నడిచి విశ్రాంతి తీసుకొని మరుసటి రోజు పాదయాత్ర ప్రారంభిస్తున్నారు. శ్రీరామ భక్తుడు వినోద్ రెడ్డి వెళ్లిన చోట శ్రీరామ సేన భక్తులు అపారంగా స్వాగతం పలికి కుశలోపరిని కనుక్కొని ప్రయాణానికి సానుకూలంగా స్పందిస్తున్నారు. శనివారం మహారాష్ట్రలోని క్వినట్ ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సిరిధాన్య మేళా షురూ

చింతామణి: మన పూర్వీకులు సిరిధాన్యాలను తినడం వల్ల చాలా ఆరోగ్యంగా ఉండేవారని, ప్రస్తుతం ఆధునిక యుగంలో జీవనశైలిని మార్చుకోవడంతో అనారోగ్యానికి లోనవుతున్నారని, కాబట్టి ప్రతి ఒక్కరు సిరి ధాన్యాలను సేవించాలని ఉన్నత విద్యాశాఖమంత్రి ఎంసీ సుధాకర్ అన్నారు. పట్టణంలో శనివారం జిల్లా స్థాయి సిరిధాన్యాల మేళాను ఆయన ప్రారంభించారు. పలు జిల్లాల నుంచి రైతులు పాల్గొన్నారు. పలురకాల ధాన్యాలతో పాటు వంటకాలను ప్రదర్శించారు. సీఈఓ ప్రకాష్, ఎస్పీ నాగేష్, తహశీల్దార్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ ట్రాక్ ప్రారంభం

బనశంకరి: బెంగళూరు త్వరలో దేశానికి క్రీడల నిలయం కానుందని కేంద్ర యువజన క్రీడా శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. శనివారం నగరంలోని సుభాష్ కేంద్రంలోని జాతీయ క్రీడా ప్రాధికారలో రూ.69.35 కోట్లతో నిర్మించిన పురుషులు, మహిళా క్రీడాకరుల వసతి నిలయం, సింథటిక్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. ఇక్కడ క్రీడాకారులకు ఆధునిక శిక్షణ లభిస్తుందని తెలిపారు. ట్రాక్‌ను ఖేలో ఇండియా కింద అభివృద్ధి చేశామని తెలిపారు.



అలర్ట్

హిందూ సంఘాలచే దత్త జయంతి, దత్త మాలా అభియాన్ కార్యక్రమాల నేపథ్యంలో చిక్కమగళూరులో పోలీసులు భద్రతను పెంచారు. శనివారం కవాతు నిర్వహించిన దృశ్యం

నేత్రపర్వంగా శరణ బసవేశ్వర రథోత్సవం



శరణ బసవేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు



రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి: పట్టణంలో శుక్రవారం సాయంత్రం శరణ బసవేశ్వర రథోత్సవం వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. శరణ బసవేశ్వర స్వామి విగ్రహాన్ని దేవస్థానం నుంచి సకల మంగళ వాయిద్యాలతో పల్లకీలో ఉత్సవ మూర్తిని రథం వద్దకు తెచ్చి మూడుసార్లు ప్రదక్షిణ చేయించిన అనంతరం రథాన్ని లాగారు. అనంతరం దాసోహ మఠ ధర్మాధికారి డాక్టర్ ఇమ్మడి శరణార్యల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా ఆల్దాళ వీరభద్రేశ్వర రథోత్సవం

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా ఆల్దాళలో వీరభద్రేశ్వర జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి వీరగాసె నృత్యం చేస్తూ ఒడుపులు చెబుతూ అగ్నిగుండ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తెల్లవారుజామున అగ్నిగుండంలోకి పాదార్పణం చేశారు. జాతర రథోత్సవాలను వందలాది మంది భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. మాన్వి శాసన సభ్యుడు హంపయ్య నాయక్, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు వీరభద్రప్ప, సిద్దనగౌడ రథానికి మొక్కి తమ మొక్కులు తీర్చుకున్నారు.